ప్రభాతనవ

SINGIDI
తెలుగు దినపత్రిక

సింగిడి

ప్రతి రంగూ ఓ నిజం

singidinews.com

సోమవారం 12 అక్టోబర్ 2026 | సంపుటి: 1 | సంచిక: 116 | పేజీలు 12 | వెల: 6.50

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar

సౌదీలో ఎయిర్‌పోర్టుపై

క్షిపణి దాడి

పైలట్ సహా 12 మంది మృతి



2



జిబౌటి తీరంలో

పెను విషాదం

బోటు బోల్తా- 109 మంది మృతి

మరో 116 మంది గల్లంతు

2

రెండో రోజు సీజేపీ నిరసనలు

100 మందికి పైగా అరెస్ట్



ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ), విద్యార్థి సంఘాలు చేపట్టిన నిరసనలు రెండో రోజుకు చేరాయి. ఈ నేపథ్యంలో ఆదివారం జంతర్ మంతర్ వైపు ర్యాలీగా వెళ్తున్న 100 మందికి పైగా ఆందోళనకారులను ఢిల్లీ పోలీసు లు అదుపులోకి తీసుకున్నారు.

- న్యూఢిల్లీ (సింగిడి)

2

షరతులతో సీజేపీ అగ్రనేతల విడుదల

ఢిల్లీలో భారీ భద్రత.. అభిజీత్, సౌరవ్, అశుతోశ్ లను విడుదల చేసిన కోర్టు



ఢిల్లీలో నిరసనల నేపథ్యంలో ముందస్తు అదుపులోకి తీసుకున్న 'కాక్రోచ్ జనతా పార్టీ' (CJP) నేతలు అభిజీత్ దిప్కే, సౌరవ్ దాస్, అశుతోశ్ రంకాలను కోర్టు విడుదల చేసింది. రాబోయే ఒక సంవత్సరం పాటు శాంతిభద్రతలకు భంగం కలిగించే ఎలాంటి చర్యలకు పాల్పడవద్దనే షరతు, రూ.50 వేల పూచికత్తుపై కోర్టు వారిని విడుదల చేసినట్లు ఢిల్లీ పోలీసులు వెల్లడించారు.

– న్యూఢిల్లీ (సింగిడి)

2

ఇంటర్నెట్ సేవలు పునరుద్ధరించండి

కేంద్రం, దిల్లీ పోలీసులకు సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

దిల్లీలో సీజేపీ నిరసనలను అడ్డుకునేందుకు పోలీసులు చేపట్టిన కట్టడి చర్యలపై పలువురు న్యాయవాదులు దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది.

- న్యూఢిల్లీ (సింగిడి)



2



డ్రగ్స్ అడ్డాగా గోవా..

'నషా ముక్త్ భారత్' ఎక్కడ?

2

గోవాలో గోయ్ రాఖోన్న్ యాత్రలో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి

బీజేపీ పాలనలో అందమైన గోవా పర్యాటక ప్రాంతం కాస్తా డ్రగ్ పెడ్లర్స్‌కు అడ్డాగా మారిపోయిందని రేవంత్ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక యువతను మత్తుకు బానిసలుగా మారుస్తున్నారని మండిప డ్డారు. "దేశవ్యాప్తంగా 'నషా ముక్త్ భారత్' అని నినదించే ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా.. గోవాలో ఆ నినాదాన్ని ఎందుకు అమలు చేయడం లేదు?" అని నిలదీశారు. ల్యాండ్ మాఫియా, డ్రగ్ లార్డ్స్ చేతుల్లోకి వెళ్లిన రాష్ట్రాన్ని కాపాడుకోవా ల్సిన బాధ్యత ప్రజలపైనే ఉందన్నారు. గోవాలో జరుగుతున్న గోయ్ రాఖోన్న్ యాత్రలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం గోవా బయలుదేరి వెళ్లారు. గోవా భూములు, పర్యావరణం, సంస్కృతి, వారసత్వం, స్థానిక గుర్తింపును కాపాడుకోవడం కోసం సాగుతున్న యాత్రలో సాయంత్రం ఆయన పాలుపం చుకోనున్నారు. - పనాజీ (సింగిడి)

యాసంగి పంట వద్దు

నీళ్లు లేవ్.. ఎల్‌నినో ప్రభావం ఎక్కువుంది

ఉన్న పంటను కాపాడ్డానికే ఇబ్బందవుతుంది

పాలేరు పర్యటనలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



ఎల్‌నినో ప్రభావం వల్ల ఉన్న పంటలనే కాపాడ్డానికి ఇబ్బందులు పడుతున్నామని.. ప్రభుత్వం మాట విని యాసంగి పంట వేయొద్దని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి రైతులను కోరారు. రాష్ట్రంలో తీవ్ర జల వనరుల సంక్షోభ పరిస్థితులు నెలకొన్నా యని చెప్పారు. రాష్ట్రానికి అధిక ఆర్థిక సహాయం అందించేలా ప్రత్యేక ప్యాకేజీ ప్రక టించాలని, వీబీజీ రామ్ జీ పథకం కింద గ్రామాల్లో అదనపు పనిదినాలు కల్పించా లని కేంద్రాన్ని కోరతామన్నారు. పాలేరు నియోజకవర్గంలో ఆదివారం పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన సందర్భంగా మంత్రి మాట్లాడారు. ఇప్పటికే రైతులు సాగు చేసిన తొలి పంటను కాపాడేందుకు ప్రభుత్వం శక్తివంచన లేకుండా కృషి చేస్తుంది. ప్రస్తుత పరిస్థితుల్లో రెండో పంట వేసి ఇబ్బందులు పడొద్దని విజ్ఞప్తి చేస్తున్నా. రెండో పంట వేసి, నీరు అందక పంటలు ఎండిపోయి రైతులు నష్టపోయే పరిస్థితి తెచ్చుకోవద్దని, ప్రభుత్వ సూచనలను పాటించాలి. ఎల్‌నినో ప్రభావం దక్షిణాది రాష్ట్రాలపై తీవ్రంగా ఉంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర మంత్రివర్గ బృందం ఢిల్లీ వెళ్లి ప్రధానమంత్రిని, కేంద్ర మంత్రులను కలిసి తెలంగాణలో నెలకొన్న పరిస్థితులను వివరిస్తాం. రాష్ట్రానికి అధిక ఆర్థిక సహాయం అందించేలా కృషి చేస్తాం అని పొంగులేటి పేర్కొన్నారు.

- పాలేరు (సింగిడి)

వికసిత్ భారత్‌కు యువతే వెన్నెముక

మొబైల్ ఫోన్ల తయారీలో రెండోస్థానంలో భారత్: ప్రధాని

చెన్నైలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

తమిళనాడులో రూ.13 వేల కోట్లతో పనులు

తమిళనాడు పర్యటనలో భాగంగా 13 వేల కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభోత్సవాలు, శంకు స్థాపనలు చేశారు. చెన్నై విమానాశ్రయంలో ప్రధానికి గవర్నర్ ఆర్లేకర్, సీఎం విజయ్ ఘన స్వాగతం పలికారు.

దేశాభివృద్ధనే మంత్రంగా తీసుకొని ముందుకు సాగుతున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద మొబైల్ తయారీ దారుగా భారత్ మారిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. 2014 నుంచి మన ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు 11 రెట్లు పెరిగాయని కొనియా డారు. రక్షణ పరికరాల తయారీలో స్వయం సమృద్ధి సాధిస్తున్నామని తెలిపారు. 12 ఏళ్లలో అనేక రంగాల్లో మార్పులు తెచ్చినట్లు చెప్పారు. తయారీ రంగంలో వృద్ధి వల్ల యువతకు ఉపాధి అవకాశాలు పెరిగాయని వివరించారు.

- చెన్నై (సింగిడి)



2

సీఎం విజయ్‌తో కలిసి ప్రధాని

మెట్రో ప్రయాణం



2

బాలాత్రిపుర సుందరిగా కనకదుర్గమ్మ

ఇంద్రకీలాద్రిపై ఘనంగా ప్రారంభమైన దసరా శరన్నవరాత్రులు

తొలిరోజు బాలాత్రిపుర సుందరి దేవిగా దర్శనమిచ్చిన కనకదుర్గమ్మ

అమ్మవారి దర్శనానికి తెల్లవారుజాము నుంచే బారులు తీరిన భక్తులు

పది రోజుల పాటు భక్తులకు కనువిందు చేయనున్న దుర్గమ్మ

విజయవాడ ఇంద్రకీలాద్రిపై దేవీ శరన్నవరాత్రి మహోత్స వాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. నేటి నుంచి అక్టోబర్ 20వ తేదీ వరకు పది రోజుల పాటు కన కదుర్గమ్మ పది రకాల విశేష అలంకారాల్లో భక్తులకు దర్శ నమివ్వనున్నారు.

- విజయవాడ, అక్టోబర్ 11 (సింగిడి)

హైదరాబాద్ – మియోషి సిస్టర్ సిటీ

స్నేహ బంధానికి 20 ఏళ్లు

జపాన్ ఫెస్టివల్–2026లో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌తో కలిసి పాల్గొన్న మంత్రి వివేక్



పాలేరు, అక్టోబర్ 11 (సింగిడి)

హైదరాబాద్ – మియోషి సిస్టర్ సిటీ స్నేహ బంధానికి 20 ఏళ్లు పూర్తి కావడం ఎంతో ఆనందంగా ఉంది అని రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. ఈ సందర్భంగా హైదరా బాద్‌లో నిర్వహించిన జపాన్ ఫెస్టివల్–2026లో తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌తో కలిసి మంత్రి వివేక్ పాల్గొన్నారు. భారత్ జపాన్ మధ్య ఉన్న పరస్పర విశ్వాసం, గౌరవం, సాంకేతిక సహకారం మన సంబంధా లకు బలమైన పునాది అని మంత్రి పేర్కొన్నారు. హైదరాబాద్ – మియోషి మధ్య ఏర్పడిన ఈ రెండు దశాబ్దాల అనుబంధాన్ని ఇప్పుడు విద్య, నైపుణ్యా భివృద్ధి, పరిశోధన, సాంకేతికత, పరిశ్ర మలు, పెట్టుబడులు, ఉపాధి రంగాల్లో మరింత విస్తరించాల్సిన అవసరం ఉంది అని ఆయన అన్నారు. తెలంగాణ యువతకు ప్రపంచస్థాయి నైపుణ్యాలు అందించి, జపాన్‌తో సహా అంతర్జాతీయ స్థాయిలో మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడమే మా లక్ష్యం అని వివేక్ ఉద్ఘాటించారు. జపాన్ విశ్వవిద్యాలయాలు, పరిశ్ర మలు, సాంకేతిక సంస్థలతో దీర్ఘకాలిక భాగస్వామ్యాలు ఏర్పరచి, విద్యార్థులు, యువ నిపుణులకు కొత్త అవకాశాలు సృష్టించేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. గత 20 ఏళ్లలో స్నేహబం ధాన్ని నిర్మించుకున్నాం.. రాబోయే 20 ఏళ్లలో కలిసి కొత్త అవకాశాలను సృష్టించుకుందాం అని పిలుపుని చ్చారు. జపాన్ ఫెస్టివల్–2026 కేవలం మన స్నేహానికి ప్రతీకగా మాత్రమే కాకుండా.. సహకారం, ఆవి ష్కరణలు, ఉపాధి, ఉమ్మడి అభివృద్ధికి కొత్త అధ్యాయానికి నాంది కావాలని ఆకాంక్షిస్తున్నాను అని మంత్రి వివేక్ పేర్కొన్నారు.

మణిపూర్‌లో మళ్లీ హింస

కాల్పుల ఘటనల్లో 9 మంది మృతి

కొద్దిరోజులుగా స్తబ్ధుగా ఉన్న ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో ఉద్రిక్తతలు ఒక్కసా రిగా భగ్గుమన్నాయి. కొండ ప్రాంత జిల్లాలైన కమ్‌జోంగ్, కాంగ్‌పోక్పీ, ఉఖ్రుల్‌లలో గత 24 గంటల వ్యవధిలో చోటుచేసుకున్న తీవ్ర సాయుధ ఘర్షణలు, కాల్పుల ఘటనల్లో కనీసం 9 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అధికా రులు గుర్తించారు. మృతుల్లో ఓ మహిళతో పాటు నేపాల్‌కు చెందిన వ్యక్తి కూడా ఉన్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి.

- న్యూఢిల్లీ (సింగిడి)

2

సిరిసిల్ల జేఎన్టీయూ విద్యార్థుల

సమస్యలను పరిష్కరించండి



రేవంత్ రెడ్డికి కేటీఆర్ విజ్ఞప్తి

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఎం రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.

- సిరిసిల్ల, అక్టోబర్ 11 (సింగిడి)

2

స్థానిక ఎన్నికల్లో బీసీలకు 40 శాతం సీట్లు

ట్రిపుల్ ఇంజిన్ సర్కార్‌పై చంద్రబాబు ధీమా

బీసీ రిజర్వేషన్లను తగ్గించి వైసీపీ అన్యాయం చేసిందని విమర్శ

విజయవాడ శరన్నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలని అధికారులకు ఆదేశం

పేదలకు శాశ్వత ఇంటి పట్టాల పంపిణీ ఒక ఉద్యమంలా కొనసాగుతోందని వెల్లడి

స్థానిక ఎన్నికల విజయంతో ట్రిపుల్ ఇంజిన్ సర్కార్ ఏర్పాటు చేస్తామని ధీమా



2

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన వర్గాలకు (బీసీలకు) తెలుగుదేశం పార్టీ తరఫున 40 శాతం వరకు సీట్లు కేటాయించనున్నట్లు పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక ప్రకటన చేశారు. ఈ ఎన్నికల ఫలితాల ఆధారంగానే పార్టీ నాయకుల పనితీరును అంచనా వేస్తామని స్పష్టం చేశారు. టీడీపీ సీనియర్ నాయకులతో నిర్వహించిన వర్చువల్ సమావేశంలో ఆయన మాట్లా డుతూ, రాష్ట్ర జనాభాలో దాదాపు సగం ఉన్న బీసీల సంక్షేమం పట్ల తమ ప్రభుత్వానికి పూర్తి చిత్తశుద్ధి ఉందని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించి తీవ్ర అన్యాయం చేసిందని చంద్రబాబు ఆరోపించారు. రిజర్వేషన్లు అందకుండా అడ్డుకోవడానికి, ఎన్నికలను వాయిదా వేయడానికి వైసీపీ కోర్టు మెట్లెక్కిందని విమర్శించారు. వైసీపీ హయాంలో బీసీలకు జరిగిన అన్యాయాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకె ళ్లాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు.

- విజయవాడ, అక్టోబర్ 11 (సింగిడి)



రెండో రోజు సీజేపీ నిరసనలు

సీపీఐ(ఎం) ఎంపీ జాన్ బ్రిటాస్, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఏ నాయకులు, పలువురు విద్యార్థులను పోలీసులు నిర్బంధించారు. పోలీసుల దాడిలో తమ నాయకులు గాయపడ్డారని విద్యార్థి సంఘాలు ఆరోపించాయి. శనివారం జరిగిన నిరసనల్లో 7,000 మందికి పైగా ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్నారు. పలువురు ప్రతిపక్ష నేతలు కూడా నిర్బంధానికి గురయ్యారు. ఈ ఘటనలకు సంబంధించి ఢిల్లీ పోలీసులు ఇప్పటికే 20 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. నిరసనకారులు పోలీసులపై దాడి చేసినట్లు, వారి విధులకు ఆటంకం కలిగించడం వంటి అభియోగాలు వారిపై నమోదు చేసినట్లు సమాచారం. నిరసనల సందర్భంగా జరిగిన ఘర్షణల్లో 15 మందికి పైగా భద్రతా సిబ్బంది గాయపడ్డారు.

షరతులతో సీజేపీ అగ్రనేతల విడుదల

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలనే డిమాండుతో శనివారం జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేపట్టాలనుకోగా ముందస్తు చర్యల్లో భాగంగా పోలీసులు వీరిని నిన్న అదుపులోకి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం ఢిల్లీ కంటోన్మెంట్ పోలీసు స్టేషన్ లోని ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ ఎదుట పోలీసులు హాజరుపరుచగా వారిని విడుదల చేస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు.

రెండో రోజు ఆందోళనలపై పోలీసుల అలర్ట్:

సీజేపీ అగ్రనేతల విడుదల, ఇవాళ జంతర్ మంతర్ వద్ద నిరసన కొనసాగే అవకాశం ఉండటంతో పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. ముఖ్యంగా సీజేపీ ఇన్ చార్జి అజింక్య షిండే ఆధ్వర్యంలో నిరసన కొనసాగనున్నట్లు తెలుస్తోంది. నిన్నటి ఆందోళనల్లో రాజకీయ నాయకులు కూడా భాగమయ్యారు. ఈ నేపథ్యంలో ఆదివారం సెలవు రోజు కావడంతో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసనల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా రాజధాని అంతటా భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. 30 వేల మందికి పైగా పోలీసులు పారామిలిటరీ సిబ్బందిని మోహరించారు. ఢిల్లీ సరిహద్దుల వద్ద భద్రతను పటిష్టం చేశారు.

స్థానిక ఎన్నికల్లో బీసీలకు 40 శాతం సీట్లు

అభ్యర్థుల ఎంపికలో గెలుపు అవకాశాలు, నిజాయతీ, సామాజిక సమతుల్యతకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. మరోవైపు, విజయవాడలో జరగనున్న శరన్నవరాత్రి ఉత్సవాలు, అభివృద్ధి పనులపై సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి వేడుకలను విజయవంతం చేయాలని, విజయవాడ ఉత్సవ్ 2.0ను ఘనంగా నిర్వహించాలని దేవాదాయ, పర్యాటక శాఖలను, జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. "అడవి తల్లి బాట" తొలి దశలో 1,976 కిలోమీటర్ల రహదారుల నిర్మాణం పూర్తి కావడం పట్ల జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను అభినందించారు. రాష్ట్రవ్యాప్తంగా పేదలకు శాశ్వత ఇంటి పట్టాల పంపిణీ ఒక ఉద్యమంలా సాగుతోందని చంద్రబాబు అన్నారు. విజయవాడ జాఫర్ సాహెబ్ కాలువ ప్రాంత వాసులకు పట్టాలు ఇవ్వాలని నిర్ణయించామని, సంక్రాంతికి నెల్లూరులో మరో 4,000 మందికి పట్టాలు అందిస్తామని తెలిపారు. ప్రస్తుతం కేంద్రం, రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఉందని, స్థానిక ఎన్నికల్లో గెలిచి ట్రిపుల్ ఇంజిన్ సర్కార్‌ను ఏర్పాటు చేయడమే లక్ష్యమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మిత్రపక్షాలైన టీడీపీ, జనసేన, బీజేపీ మధ్య సమన్వయంతో పనిచేసి స్థానిక ఎన్నికల్లో విజయం సాధించాలని సూచించారు. "ఆరోగ్యవంతమైన, సంపన్న, సంతోషకరమైన ఆంధ్రప్రదేశ్" నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు.

బాలాత్రిపుర సుందరిగా కనకదుర్గమ్మ

ఉత్సవాల్లో భాగంగా తొలిరోజైన నేడు అమ్మవారు శ్రీ బాలాత్రిపుర సుందరి దేవిగా భక్తులను అనుగ్రహిస్తున్నారు. అమ్మవారి దర్శనం కోసం తెల్లవారు జాము నుంచే భక్తులు భారీ సంఖ్యలో ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా క్యూలైన్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. అలంకార ప్రాముఖ్యత విషయానికి వస్తే.. పండితుల ప్రకారం, బాలాత్రిపుర సుందరి దేవి అత్యంత శక్తివంతమైన దేవత. శ్రీచక్రంలోని ప్రథమ ఆవరణలో ఈమె కొలువై ఉంటుంది. బాల మంత్రాన్ని అత్యంత పవిత్రమైనదిగా భావిస్తారు. విద్యా ఉపాసకులకు ప్రప్రథమంగా ఈ మంత్రాన్నే ఉపదేశిస్తారు. బాలాత్రిపుర సుందరి అనుగ్రహం లభిస్తే మహాత్రిపుర సుందరి దేవి కటాక్షం సులభంగా సిద్ధిస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. జాగ్రత్, స్వప్న, సుషుప్తి అనే మూడు అవస్థలకు అధిదేవత కాబట్టే ఆమెను 'త్రిపుర' అని పిలుస్తారు. ఈ మూడు స్థితుల్లో మనలోనే ఉంటూ విశ్వాన్ని పరిపాలిస్తుందని భక్తుల నమ్మకం. శరన్నవరాత్రుల్లో బాలాత్రిపుర సుందరి దేవి దర్శనం సంపూర్ణ ఫలదాయకమని ఆధ్యాత్మిక వేత్తలు చెబుతున్నారు.



మణిపూర్‌లో మళ్లీ హింస

గుర్తు తెలియని దుండగులు పలు గ్రామాలపై విచక్షణారహితంగా కాల్పులు జరపడమే కాకుండా, డజనుకు పైగా నివాస గృహాలకు నిప్పు పెట్టడంతో ఆయా ప్రాంతాలు రణరంగంగా మారాయి. పరిస్థితి తీవ్ర ఉద్రిక్తతకు దారితీయడంతో స్థానిక పోలీస్ స్టేషన్ పరిసరాల్లో, ప్రధాన రహదారులపై అధికారులు కఠిన నిషేధాజ్ఞలు విధించారు. తాజా ఘర్షణల నేపథ్యంలో సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు కేంద్ర సాయుధ బలగాలు, అస్సాం రైఫిల్స్ సిబ్బందిని భారీగా మోహరించారు. నిరసనకారులు, సాయుధ ముఠాలు మరింతగా రెచ్చిపోకుండా భద్రతా దళాలు ముమ్మర కూంబింగ్ ఆపరేషన్లు నిర్వహిస్తున్నాయి. కాంగ్‌పోక్పీ తదితర ప్రాంతాల్లో స్థానిక గిరిజన సంఘాలు బంద్‌కు పిలుపునివ్వడంతో జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. శాంతిభద్రతలను పునరుద్ధరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ చర్యలు చేపడుతుండగా, మళ్లీ చెలరేగిన ఈ హింసాత్మక పరిణామాలు స్థానిక ప్రజల్లో తీవ్ర భయాందోళనలను రేకెత్తిస్తున్నాయి.

సీఎం విజయ్‌తో కలిసి ప్రధాని మెట్రో ప్రయాణం

ప్రారంభోత్సవం అనంతరం పోరూర్ బైపాస్ స్టేషన్ నుంచి పూందమల్లి బైపాస్ స్టేషన్ వరకు ప్రధాని మోదీ మెట్రో రైలులో ప్రయాణించారు. ఈ ప్రయాణంలో ఆయనతో పాటు తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ కూడా ఉన్నారు. ఇద్దరు నేతలు మెట్రో ప్రయాణాన్ని ఆస్వాదించడం విశేషం.రూ.4,900 కోట్ల భారీ వ్యయంతో నిర్మించిన పూందమల్లి–వడపళని స్ట్రెచ్‌ను ప్రధాని లాంఛనంగా ప్రారంభించారు. దీనివల్ల నగరంలో రద్దీ తగ్గి ప్రయాణం మరింత సులభం కానుంది.

రోడ్డు, రైల్వే కనెక్టివిటీకి పెద్దపీట

తమిళనాడులో రవాణా వ్యవస్థను మెరుగుపరచడానికి, ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి సుమారు రూ.3,700 కోట్ల విలువైన జాతీయ రహదారి (NH) ప్రాజెక్టులకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేసి, ప్రారంభించారు. ఎన్‌హెచ్–744: 36 కి.మీ పొడవున్న వడుగుపట్టి–తేర్కు వెంగనల్లూర్ నాలుగు వరుసల సెక్షన్‌ను ప్రధాని ప్రారంభించారు. ఇది పారిశ్రామిక, వాణిజ్య కేంద్రాలకు కనెక్టివిటీని పెంచుతుంది. అలాగే మధురై రింగ్ రోడ్డు ప్రాజెక్టు ద్వారా నగరంలో ట్రాఫిక్ కష్టాలు తీరనున్నాయి. రైల్వే ప్రాజెక్టులు: రూ.750 కోట్లకు పైగా విలువైన రైల్వే ప్రాజెక్టులను ప్రధాని మోదీ ప్రారంభించారు. ఇందులో కారైకాల్–పెరాలం రైలు మార్గంతో పాటు కోయంబత్తూరులో మూడు రైల్ ఫ్లైఓవర్లు ఉన్నాయి. వీటివల్ల ప్రయాణికుల సమయం ఆదా కావడంతో పాటు రోడ్డు భద్రత పెరుగుతుంది. అమృత్ స్టేషన్లు: పళని, వెల్లూరు కంటోన్మెంట్, అంబసముద్రం, నామకల్ స్టేషన్లను



అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద ఆధునీకరించి జాతికి అంకితం చేశారు.

.పోర్టులు, మౌలిక సదుపాయాలు

సముద్ర రవాణా రంగాన్ని బలోపేతం చేయడానికి చెన్నై పోర్టు, వీవో చిదంబరనార్ పోర్టులలో పలు ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. చెన్నై పోర్టులో పేవ్డ్ స్టోరేజ్ యార్డ్, ఎగ్జిమ్ గోడౌన్లు, అప్‌గ్రేడ్ చేసిన క్రూయిజ్ టెర్మినల్, సీఫేరర్స్ క్లబ్‌లను ప్రారంభించారు. చెన్నై పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (సీపీసీఎల్) ఆధ్వర్యంలో మణలి రిఫైనరీలో రూ. 1,620 కోట్ల వ్యయంతో చేపట్టనున్న లూబ్ ఆయిల్ బేస్ స్టాక్స్ ప్రాజెక్టుకు ప్రధాని శంకుస్థాపన చేశారు.

ఐఐటీ మద్రాస్‌లో బ్రెయిన్ సెంట్రల్ ప్రారంభం

చెన్నె ఐఐటీలో సుధా గోపాలకృష్ణన్ బ్రెయిన్ సెంటర్ ను ప్రధాని మోదీ ప్రారంభించారు. మానవ మెదడుకు సంబంధించిన 1,000 పైగా మైక్రోస్కోపిక్ సెక్షన్లతో కూడిన 'సీ-స్టోక్' అట్లాస్‌ను విడుదల చేశారు. ఇది ప్రపంచవ్యాప్తంగా ఉన్న పరిశోధకులకు కొత్త వైద్య చికిత్సల అన్వేషణకు ఎంతో సహాయపడుతుంది. అనంతరం చెన్నైలోని జైగోపాల్ గరోడియా హిందూ విద్యాలయ మెట్రిక్యులేషన్ హయ్యర్ సెకండరీ స్కూల్ స్వర్ణోత్సవ వేడుకల్లో ప్రధాని పాల్గొన్నారు. విద్యారంగానికి ఆ పాఠశాల అందిస్తున్న సేవలను ఈ సందర్భంగా ఆయన కొనియాడారు.

వికసిత్ భారత్ కు యువతే వెన్నెముక

సమగ్రమైన మౌలిక సదుపాయాలు అవసరం. అందుకే గత దశాబ్ద కాలంలో దేశవ్యాప్తంగా మెట్రో నెట్‌వర్క్‌ను భారీగా విస్తరించాం. 2014లో దేశంలోని 5 నగరాల్లో మాత్రమే మెట్రోలు నడిచేవి. ఈరోజు దేశవ్యాప్తంగా 25 నగరాల్లో మెట్రో సేవలు అందుబాటులో ఉన్నాయి."
---నరేంద్ర మోదీ, ప్రధానమంత్రి

ఐఐటీ మద్రాస్‌లో బ్రెయిన్ సెంటర్ జాతికి అంకితం

రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పనకు రూ. 3వేల 700 కోట్లతో NH-744, NH-83 ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. పలు రైల్వే లైన్లు సహా పోర్టుల సామర్థ్యాలను పెంచే ప్రాజెక్టులు, అలాగే ఆధునికీకరించిన 5 అమృత్ భారత్ స్టేషన్లను ప్రారంభించారు. ఐఐటీ మద్రాస్‌లో సుధా గోపాలకృష్ణన్ బ్రెయిన్ సెంటర్‌ను జాతికి అంకితం చేసిన ప్రధాని, మనిషి మెదడుకు సంబంధించిన 3D అట్లాస్ మిషన్‌ను, స్టోక్ అట్లాస్‌ను ఆవిష్కరించారు. చెన్నైలోని జైగోపాల్ గరోడియా హిందూ విద్యాలయ స్వర్ణోత్సవ వేడుకల్లోనూ ప్రధాని పాల్గొన్నారు.



సిరిసిల్ల జేఎన్టీయూ విద్యార్థుల సమస్యలను పరిష్కరించండి

కళాశాల శాశ్వత క్యాంపస్ నిర్మాణంలో జరుగుతున్న జాప్యాన్ని నివారించి, విద్యార్థుల విద్యాభ్యాసానికి ఎలాంటి ఆటంకం కలగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. 2021లో రూ.402 కోట్ల పరిపాలనా అనుమతులతో మంజూరైన జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల శాశ్వత క్యాంపస్ నిర్మాణం ఇప్పటికీ పెండింగ్‌లో ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. మండేపల్లి గ్రామంలో 20 ఎకరాల భూమిని కేటాయించినప్పటికీ, నిర్మాణ పనులు ప్రారంభం కాక పోవడంతో కళాశాల ప్రస్తుతం అగ్రహారంలోని డిగ్రీ కళాశాల ప్రాంగణంలో తాత్కాలికంగా కొనసాగుతోందని తెలిపారు. కళాశాలను ప్రస్తుత ప్రాంగణం నుంచి మరో ప్రైవేటు భవనానికి తరలించే ప్రతిపాదనలు విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందికి ఇబ్బందులు కలిగించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇప్పటికే ఉన్న తరగతి గదులు, ప్రయోగశాలలు, ఇతర మౌలిక సదుపాయాలు నిరుపయోగం కాకుండా చూడాలని సూచించారు. ఈ నేపథ్యంలో మండేపల్లిలో కేటాయించిన స్థలంలో శాశ్వత క్యాంపస్ నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేసి పనులను వేగవంతం చేయాలని, కొత్త క్యాంపస్ పూర్తయ్యే వరకు కళాశాలను ప్రస్తుత ప్రాంగణంలోనే కొనసాగించేందుకు అనుమతించాలని కేటీఆర్ కోరారు. తగిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు జరిగే వరకు కళాశాల ప్రస్తుత ప్రాంగణాన్ని ఖాళీ చేయాలంటూ నోటీసులు జారీ చేయకుండా సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లాతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్య అందించడంలో ఈ కళాశాల కీలకమని కేటీఆర్ పేర్కొన్నారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సమస్యలను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరారు.

డ్రగ్స్ అడ్డాగా గోవా



గోవా కాంగ్రెస్ ఆధ్వర్యంలో గత నెల 22న పనాజీలో ప్రారంభమైన ఈ యాత్ర 27 రోజుల పాటు కొనసాగనుంది.ఇందులో భాగంగా చీఫ్టెన్స్ స్మారకం నుంచి కున్‌కోలిమ్ బస్టాండ్ వరకు సాగే పాదయాత్రలో రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం జరిగే బహిరంగ సభలో మాట్లాడారు. సభ ముగిసిన తర్వాత రాత్రి గోవా నుంచి నేరుగా ఢిల్లీకి వెళ్లారు. కాగా ఈ యాత్ర 27 రోజుల పాటు 40 నియోజకవర్గాలను కవర్ చేస్తూ ఈనెల 18న ముగియనున్నది. అధికార బీజేపీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరిచేందుకు యాత్ర నిర్వహిస్తున్నట్లు గోవా కాంగ్రెస్ విభాగం తెలిపింది.

ప్రమోద్ కాదు.. 'ప్రాపర్టీ సావంత్'

గోవా ముఖ్యమంత్రి తీరుపై స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. "ఇక్కడి ప్రజలు ఆయన్ను ప్రమోద్ సావంత్ అనడం లేదు.. 'ప్రాపర్టీ సావంత్' అని పిలుస్తున్నారు. రాష్ట్రాన్ని డెవలప్ చేయడం మానేసి, ఇక్కడి విలువైన భూములు, ఆస్తులను ఇతరులకు కట్టబెట్టే పనిలో పడ్డారు" అని ఎద్దేవా చేశారు. వరుసగా మూడోసారి బీజేపీకి అధికారం ఇస్తే గోవా ప్రజలు తమ సొంత గడ్డపైనే పరాయివారిగా మిగిలిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

ఓట్ల తొలగింపు కుట్ర.. రాముడు-రావణుడి మధ్య పోరాటం

ఎన్నికలు రాగానే దర్యాప్తు సంస్థలను ముందుపెట్టి రాజకీయం చేసే బీజేపీకి ఇప్పుడు వాటితోనూ ప్రయోజనం లేకుండా పోయిందని రేవంత్ అన్నారు. అందుకే ఇప్పుడు చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ పేరుతో పేదలు, దళితులు, మైనారిటీలు, ఆదివాసీల ఓట్లను తొలగించేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. ప్రస్తుత పోరాటం రావణుడికి (బీజేపీ), రాముడికి (కాంగ్రెస్) మధ్య జరుగుతున్న ధర్మయుద్ధం లాంటిదని, ప్రజలంతా రాముడి వైపు నిలబడాలని పిలుపునిచ్చారు.

2027లో గోవాలో కాంగ్రెస్ ప్రభుత్వం ఖాయం

దేశంలో నైరుతి రుతుపవనాలు (మాన్‌సూన్) మొదట కేరళలోకి ప్రవేశించి, ఆ తర్వాత గోవాను తాకుతాయని రేవంత్ గుర్తుచేశారు. అదే రాజకీయ సూత్రాన్ని ప్రస్తావిస్తూ.. "2026 మాన్‌సూన్‌లో కేరళలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. సరిగ్గా అలాగే 2027 మాన్‌సూన్‌లో గోవాలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం రాబోతోంది" అని ధీమా వ్యక్తం చేశారు. గోవాలో కాంగ్రెస్ విజయంతో మొదలై నేరుగా ఢిల్లీ ఎర్రకోటపై మువ్వన్నెల జెండా ఎగుర వేస్తామని స్పష్టం చేశారు.



రియాద్ ఎయిర్‌పోర్టుపై క్షిపణి దాడి

పైలట్ సహా 12 మంది మృతి

న్యూఢిల్లీ (సింగిడి)

సౌదీ అరేబియాపై యెమెన్‌కు చెందిన తిరుగుబాటుదారులు హౌతీలు మరోసారి దాడికి పాల్పడ్డారు. రాజధాని రియాద్‌లోని కింగ్ ఖలీద్ అంతర్జాతీయ విమానాశ్రయంపై క్షిపణి దాడి జరిపారు. దీంతో పైలట్ సహా 12 మంది మరణించారు. మరో 309 మంది గాయపడ్డారు. హౌతీల మెరుపుదాడితో అప్రమత్తమైన అధికారులు ఎయిర్‌పోర్టు కార్యకలాపాలను నిలిపివేశారు. ప్రయాణికులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. రియాద్‌కు రావాల్సిన దేశీయ, అంతర్జాతీయ విమానాలను ఇతర ఎయిర్‌పోర్టులకు మళ్లించారు. మృతుల్లో నలుగురు సౌదీ జాతీయులు ఉండగా, ఇద్దరు బంగ్లాదేశీయులు, అమెరికా, జోర్డాన్, పాలస్తీనా, సిరియా, సూడాన్, ఈజిప్ట్‌కు చెందిన వారు ఒక్కొక్కరు ఉన్నారని అధికారులు వెల్లడించారు. గాయపడినవారిని అంబులెన్సులు, హెలికాప్టర్లలో దవాఖానకు తరలించామన్నారు. క్షతగాత్రుల్లో పలువురి పరిస్థితి విషమంగా ఉందని చెప్పారు. ఎలాంటి ముందస్తు హెచ్చరికలు లేకుండానే క్షిపణి దాడి జరగగా, సౌదీ హెచ్చరికల వ్యవస్థ కూడా పని చేయకపోవడం గమనార్హం. కాగా, కింగ్ ఖలీద్ ఎయిర్‌పోర్టుపై దాడి జరగడం వారం రోజుల వ్యవధిలో ఇది మూడోసారి. రెండు రోజుల క్రితం జరిగిన దాడిలో ఒక పైలట్‌తో సహా ముగ్గురు సౌదీ పౌరులు మరణించారు. మరో వైపు రియాద్ విమానాశ్రయాన్ని మూసేశారని పేరు వెల్లడించడానికి ఇష్టపడని ఒక అధికారి వెల్లడించారు. యెమెన్ అంతర్యుద్ధంలో సౌదీ అరేబియా జోక్యం చేసుకోవడంతో ఆ దేశంపై తిరుగుబాటుదారులు తరచూ దాడులకు పాల్పడుతున్నారు.

జిబౌటి తీరంలో పెను విషాదం

బోటు బోల్తా- 109 మంది మృతి- మరో 116 మంది గల్లంతు

న్యూఢిల్లీ, (సింగిడి)

తూర్పు ఆఫ్రికా దేశమైన జిబౌటి తీరంలో పెను విషాదం చోటుచేసుకుంది. ఉపాధి కోసం అక్రమ మార్గంలో యెమెన్‌కు బయలుదేరిన వలసదారుల పడవ జిబౌటీ సముద్ర తీరంలో ఓ బోటు బోల్తా పడి 109 మంది మృతి చెందారని అంతర్జాతీయ వలస సంస్థ (ఐఓఎం) తెలిపింది. అందులో 15 మంది చిన్నారులు, 42 మంది మహిళలు ఉన్నారని పేర్కొంది. మరో 116 మంది గల్లంతు అయ్యారని, వారి ఆచూకీ కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు కొనసాగుతున్నట్లు తెలిపింది. 305 మంది వలసదారులతో జిబౌటీ నుంచి యెమన్‌కు వెళ్తున్న బోటు గురువారం రాత్రి లేదా శుక్రవారం ఉదయం బోల్తా పడి ఉండొవచ్చని ఐఓఎం చెప్పింది. ఈ ప్రమాదం నుంచి 80 మంది ఇథియోపియా పౌరులు ప్రాణాలతో బయటపడ్డారని తెలిపింది. సాధారణంగా 'హార్న్ ఆఫ్



ఆఫ్రికా' నుంచి వేల మంది వలసదారులు భద్రత, ఆర్థిక అవసరాలకోసం జిబౌటీ మీదుగా బాబ్ ఎల్-మండేబ్ జలసంధిని దాటి గల్ఫ్ దేశాలకు ప్రయాణిస్తుంటారని ఐఓఎం చెప్పింది. వాస్తవానికి యెమెన్‌లో హింస కొనసాగుతున్నప్పటికీ ఈ వలసలు ఆగడం లేదని పేర్కొంది. "ఇది అత్యంత ఘోరం. జీవనోపాధి కోసం వలసదారులు ఎదుర్కొంటున్న ప్రమాదాలకు ఈ విషాధం ఒక స్పష్టమైన గుర్తు" అని జిబౌటీలోని ఐఓఎం చీఫ్ ఆఫ్ మిషన్ అలెగ్జాండర్ కోయిసాక్ అన్నారు.

ఇంటర్నెట్ సేవలు పునరుద్ధరించండి

దిల్లీలో ఇంటర్నెట్, మెట్రో సేవలు పునరుద్ధరించాలని ఆదేశాలు జారీ చేసింది. అంతేకాదు ఈ పిటిషన్ విషయంలో తాము అన్ని పక్షాల వాదనలు పూర్తిగా వింటామని, ఎవరికీ ఎలాంటి అసౌకర్యం లేకుండా చూస్తామని అత్యున్నత ధర్మాసనం పేర్కొంది. దేశ సేవలో సుప్రీంకోర్టు ఎప్పుడూ ముందుంటుందని పేర్కొంది. సీజేపీ నిరసన కారణంగా దిల్లీలో మెట్రో, రైలు సర్వీసులపై "సంపూర్ణ నిషేధం" అమలు చేయరాదన్న కోర్టు ఆదేశాన్ని అధికారులు బహిరంగంగా ఉల్లంఘించారంటూ, వారిపై కోర్టు ధిక్కరణ కేసు ఫైల్ చేయాలంటూ పిటిషన్ దాఖలైంది. న్యాయవాది శైలేంద్ర మణి త్రిపాఠి దాఖలు చేసిన ఈ కోర్టు ధిక్కరణ పిటిషన్‌లో, కేంద్ర హోం కార్యదర్శి గోవింద్ మోహన్, దిల్లీ పోలీస్ కమిషనర్ అనురాగ్ కుమార్, దిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ డి. తారాలను ప్రతివాదులుగా చేర్చారు. మరోవైపు రాజకీయ నాయకుల నిర్బంధానికి వ్యతిరేకంగా సీనియర్ న్యాయవాది మేనకా గురుస్వామి హెబియస్ పిటిషన్‌ను దాఖలు చేశారు. వీటిపై జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. తాము న్యాయవాదులం



దరి వాదనలు వింటామని, జరిగిన దానిని ఏమాత్రం తక్కువ చేయమని తేల్చిచెప్పింది. రైల్వే, మెట్రో సహా పలు రవాణా సేవలను నిలిపివేయడంపై దాఖలైన కోర్టు ధిక్కరణ పిటిషన్‌ను కూడా పరిశీలిస్తామని చెప్పింది. కేంద్రం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తన వాదనలు వినిపించారు. సీజేపీ నిరసనల వేళ, దిల్లీలో మొత్తం 303 మెట్రో స్టేషన్లలో, కేవలం 45 స్టేషన్లను మాత్రమే మూసివేశారని కోర్టుకు తెలిపారు. ఒక స్టేషన్ మూసివేస్తే, పక్క స్టేషన్ తెరిచే ఉందని పేర్కొన్నారు. "మెట్రో స్టేషన్లు తెరిచి ఉంటాయి. ఇంటర్నెట్ సేవలు పునరుద్ధరిస్తాం. న్యాయవాదులు తమ విధులు నిర్వహించకుండా అడ్డుకోం. ప్రజా భద్రతకు లోబడి సాధారణ రాకపోకలను కొనసాగిస్తాం" అని ప్రభుత్వం తరఫున తుషార్ మెహతా చెప్పారు. దీనితో ఆయన చేసిన వాదనలను రికార్డు చేసుకుంటున్నామని ధర్మాసనం వెల్లడించింది.

సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

వాదనలు విన్న తర్వాత సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వానికి, దిల్లీ పోలీసులకు కీలక ఆదేశాలు జారీ చేసింది. 'దిల్లీలో నిలిపివేసిన ఇంటర్నెట్ సేవలను వెంటనే పునరుద్ధరించాలి. ఎలాంటి ఆంక్షలు లేకుండా మెట్రో రైలు సేవలను యథావిధిగా నడపాలి. లాయర్ల విధులకు అడ్డంకులు సృష్టించకూడదు. ఓ ఒక్క న్యాయవాదిని వృత్తిపరమైన బాధ్యతలు నిర్వర్తించకుండా అడ్డుకోవడానికి వీలు లేదని' సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అలాగే దిల్లీ వ్యాప్తంగా ఏర్పాటు చేసిన అనవసరమైన బారికేడ్లను వెంటనే తొలగించాలని స్పష్టం చేసింది. అంతేకాదు, 'అక్టోబర్ 10న ఏ ఆంక్షలు విధించారు? ఎందుకు విధించారు? అనే దానిపై వచ్చే వారం పూర్తి వివరాలతో వివరణాత్మక అఫిడవిట్ దాఖలు చేయాలని' కేంద్రాన్ని ఆదేశించింది.

ఇంతకీ ఏం జరిగింది?

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ఎస్ఐఆర్ ప్రక్రియపై, ఫారమ్ 6పై ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారని, ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆజ్ఞలతో ఎన్నికల అక్రమాలకు పాల్పడ్డారని విపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆయన సీఈసీ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ)తో పాటు మరికొన్ని విద్యార్థి సంఘాలు జంతర్ మంతర్ వద్ద నిరసనలకు పిలుపునిచ్చాయి. దీనితో దిల్లీలో భద్రతను కట్టుదిట్టం చేశారు. ముంబయి నుంచి దిల్లీ బయలుదేరిన అభిజీత్ దీప్కేతోపాటు, పలువురు ప్రతిపక్ష నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

సిద్దాపూర్ రోడ్డుకు శాశ్వత పరిష్కారం చూపాలి

- జగ్గారెడ్డి, నిర్మల జగ్గారెడ్డి
- అక్టోబర్ 30లోగా అంచనాలు సిద్ధం చేయాలని అధికారులకు సూచన





సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 11 (సింగిడి): పట్టణంలోని సిద్దాపూర్ రోడ్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అధికారులను ఆదేశించారు. నిర్మల జగ్గారెడ్డితో కలిసి ఆయన సిద్దాపూర్ రోడ్డును పరిశీలించారు. ఆర్అండ్బీ, ఇరిగేషన్, పబ్లిక్ హెల్త్, మున్సిపల్ అధికారులతో రోడ్డు నిర్మాణం, వర్షపు నీటి పారుదల, కల్వర్టులు, డ్రైనేజీ పనులపై సమీక్ష నిర్వహించారు. మెయిన్ రోడ్డు నుంచి సిద్దాపూర్ కాలనీ చివరి వరకు పలుమార్లు పనులు చేపట్టినా రోడ్డు సమస్య పరిష్కారం కాకపోవడంపై జగ్గారెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. 2004లో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు సిద్దాపూర్ రోడ్డు వేయించానని గుర్తుచేశారు. గత పదేళ్లలో ఈ రోడ్డు విషయంలో ఏం జరిగిందో తెలియదన్నారు. ఇకపై సిద్దాపూర్ రోడ్డు సమస్య పదేపదే చర్చకు రాకుండా పటిష్ఠంగా పనులు చేపట్టాలని సూచించారు. మెయిన్ రోడ్డు నుంచి సిద్దాపూర్ ఈద్గా వరకు సుమారు 1.5 కిలోమీటర్ల మేర పూర్తిస్థాయిలో సీసీ రోడ్డు నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేయాలని తెలిపారు. డిగ్రీ కళాశాల నుంచి మెయిన్ రోడ్డు జంక్షన్ వరకు సాంకేతికంగా సరైన లెవల్స్ తీసుకుని, వరద నీరు, డ్రైనేజీ నీరు సక్రమంగా వెళ్లేలా రోడ్డు నిర్మించాలని స్పష్టం చేశారు. రోడ్డు ప్రారంభం నుంచి చివరి వరకు ఎక్కడా వర్షపు నీరు నిలవకుండా డ్రైన్లు, అవసరమైన చోట్ల కల్వర్టులు ఏర్పాటు చేయాలన్నారు. కల్వర్టులు అవసరమైన ప్రాంతాలను జగ్గారెడ్డి, నిర్మల స్వయంగా పరిశీలించారు. రోడ్డు వెడల్పు, అందుబాటులో ఉన్న స్థలాన్ని టేపుతో కొలిచి మరీ పరిశీలించారు. కూల్చివేతలు లేకుండా పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. 30 అడుగుల వెడల్పు ఉన్నచోట 30 అడుగులు, 40 అడుగులు ఉన్నచోట 40 అడుగులు, 60 అడుగులు అందుబాటులో ఉన్నచోట 60 అడుగుల మేర రోడ్డు నిర్మించాలని చెప్పారు. తనకు తెలియజేయకుండా సిద్దాపూర్ రోడ్డులో ఏ డబ్బానూ తొలగించవద్దని స్పష్టం చేశారు. చిరు వ్యాపారులు, పాన్షాపులు, పూల దుకాణాలు, మటన్, చికెన్ దుకాణాలకు ఇబ్బంది కలగకుండా పనులు జరగాలన్నారు. సిద్దాపూర్ కూడలిలో ప్రజలకు, వ్యాపారులకు ఇబ్బంది కలగకుండా జంక్షన్ అభివృద్ధి చేయాలని సూచించారు. మధ్యలో విగ్రహం ఏర్పాటుకు అనువుగా సర్కిల్ రూపకల్పన చేయాలని చెప్పారు. రోడ్డు పనులకు అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలను తరలించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సిద్దాపూర్ రోడ్డు పనులకు సంబంధించి రూ. 2 కోట్ల నిధులు మిగిలి ఉన్నాయని, మున్సిపాలిటీలో టీఎఫ్ఐడీసీకి చెందిన మరో రూ. 5 కోట్ల నిధులు కూడా అందుబాటులో ఉన్నాయని సమీక్షలో ప్రస్తావించారు. కలెక్టర్తో సమావేశం అనంతరం సంబంధిత శాఖల సమన్వయంతో పనులను ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు.

సరైన లెవల్స్, డ్రైన్లు, కల్వర్టులతో కూడిన 1.5 కిలోమీటర్ల సీసీ రోడ్డు నిర్మాణానికి అక్టోబర్ 30లోగా అంచనాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పట్టణం, మండలంలోని సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకునేందుకు రోజూ ఒక ప్రాంతంలో పర్యటిస్తానని జగ్గారెడ్డి తెలిపారు. త్వరలో ఊబ చెరువును పరిశీలిస్తానన్నారు.

హైకోర్టు ఆదేశాలను అమలు చేయని రాష్ట్ర ప్రభుత్వం



సిద్ధిపేట బ్యూరో, అక్టోబర్ 11 (సింగిడి): హైకోర్టు ఆదేశాలను అమలు చేయని రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకునేందుకు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య పిటిషన్ దాఖలు చేయనున్నట్లు టి డబ్ల్యూ జే ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సత్తు మహిపాల్ రెడ్డి శనివారం రోజున పత్రికా ప్రకటనలో తెలిపారు. మీడియా అక్రెడిటేషన్ కమిటీలలో టీడబ్ల్యూజేఎఫ్ యూనియన్ కు ప్రాతినిధ్యం ఇవ్వాలని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం జారీ చేసిన కీలక ఉత్తర్వుల గడువు ముగిసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను అమలు చేయకపోవడం పై పిటిషనర్ తీవ్ర ఆవేదన చెందుతూ, ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పులను, ఆదేశాలను నిర్దిష్ట కాలంలోగా అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వ యంత్రాంగానికి ఉంటుందన్నారు. ఒకవేళ ఆ నిబంధనలను పాటించకపోతే, దానిని న్యాయవ్యవస్థను ధిక్కరించినట్లు భావిస్తూ కోర్టు ధిక్కరణ చట్టం 1971 కింద తగిన చర్యల కోసం బాధితులు కోర్టును ఆశ్రయించవచ్చునని ఆయన తెలిపారు. రాష్ట్ర, జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీలలో తమ టీడబ్ల్యూజేఎఫ్ సంఘానికి ప్రాతినిధ్యం ఇవ్వకపోవడాన్ని సవాలు చేస్తూ రాష్ట్ర అధ్యక్షుడు రాష్ట్ర హైకోర్టు ను ఆశ్రయించగా కేసును విచారించిన హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని తప్పు పడుతూ, టీడబ్ల్యూజేఎఫ్ కు అన్ని జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీ (డీఎంఏసీ)లలో ప్రాతినిధ్యం ఇవ్వాలని ఆగస్టు 3 న హైకోర్టు ఆదేశించింది. ఈ ఆదేశాలను ఆరు వారాల్లోగా అమలు చేయాలని కూడా కోర్టు ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ఆదేశాల అమలు గడువు ముగిసినా ఆదేశాలను అమలు చేయకుండా సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దీంతో పిటిషనర్ మామిడి సోమయ్య తిరిగి హైకోర్టు ను ఆశ్రయించి రాష్ట్ర ప్రభుత్వం పై కోర్టు ధిక్కరణ కేసు వేయనున్నట్లు చెప్పారు. ఇటీవలి కాలంలో వివిధ ప్రభుత్వ విభాగాలు న్యాయస్థానాల ఆదేశాలను నిర్లక్ష్యం చేయడంపై హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తోంది. ఈ నేపథ్యంలోనే, తమకు అనుకూలంగా వచ్చిన తీర్పుపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో, బాధ్యులైన ఉన్నతాధికారులపై కోర్టు ధిక్కరణ కేసు దాఖలు చేసేందుకు పిటిషనర్ మామిడి సోమయ్య తరఫు న్యాయవాదులు ముసాయిదా సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. త్వరలోనే ఈ పిటిషన్ హైకోర్టులో దాఖలు కానున్నట్లు తెలిపారు. కోర్టు ఆదేశాలను బేఖాతరు చేసినందుకు గానూ సంబంధిత శాఖల ముఖ్య కార్యదర్శులు, ఉన్నతాధికారులు, అన్ని జిల్లాల డీపీఆర్వోలను ఈ కేసులో ప్రతివాదులుగా చేర్చనున్నారని తెలిపారు. ఈ ధిక్కరణ కేసు ద్వారానైనా ప్రభుత్వంలో కదలిక వచ్చి హైకోర్టు ఆర్డర్ అమలు అవుతుందా? లేక కంటెంప్ట్ ఆఫ్ కోర్టు యాక్ట్ ద్వారా జైలు పాలవుతారా? అనేది వేచి చూడాలి.

ఎస్ఐఆర్పై అపోహలు సృష్టించడం సరికాదు

ప్రజాస్వామ్య విలువలను గౌరవించాలి

బీజేపీ వికారాబాద్ జిల్లా మాజీ అధ్యక్షుడు సదానంద రెడ్డి



వికారాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 11 (సింగిడి): ఎస్ఐఆర్ ప్రక్రియపై అపోహలు సృష్టించడం సరికాదని, దేశ పౌరులుగా ప్రతి ఒక్కరూ ప్రస్తుత పరిస్థితులపై బాధ్యతాయుతంగా ఆలోచించాలని బీజేపీ వికారాబాద్ జిల్లా మాజీ అధ్యక్షుడు టి.సదానంద రెడ్డి అన్నారు. శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం కలిగించేలా రాజకీయ పార్టీలు వ్యవహరించాలని సూచించారు. ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియలో ఏవైనా లోపాలు ఉంటే వాటిని గుర్తించి సరిదిద్దాలని, అంతేకానీ మొత్తం ప్రక్రియనే వ్యతిరేకించడం సమంజసం కాదని పేర్కొన్నారు. అర్హులైన పౌరుల ఓటు హక్కు తొలగిపోకుండా ఎన్నికల సంఘం తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అనర్హుల ఓట్లు తొలగించినట్లు ఆధారాలతో నిర్ధారణ అయితే, బాధితులకు తమ ఓటు హక్కును తిరిగి పొందే అవకాశం కల్పించాలని అన్నారు. పట్టణ వార్డులు, గ్రామాల స్థాయిలో అర్హులైన ఓటర్ల సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, పౌరులు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎస్ఐఆర్ ప్రక్రియ, ఓటర్ల జాబితాల్లో మార్పులు, ఎన్నికల నిర్వహణకు సంబంధించి అభ్యంతరాలు ఉంటే చట్టపరమైన మార్గాలను అనుసరించాలని సూచించారు. న్యాయ వ్యవస్థపై విశ్వాసం ఉంచుతూ, న్యాయ ప్రక్రియకు ఆటంకం కలగకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికి ఉందని, అయితే హక్కును శాంతియుతంగా, చట్టపరిధిలో వినియోగించుకోవాలని సదానంద రెడ్డి పేర్కొన్నారు. ప్రజల్లో భయాందోళనలు సృష్టించడం, అవసర ఉద్రిక్తతలకు కారణమయ్యే విధంగా వ్యవహరించడం వల్ల సమస్యలు పరిష్కారం కావని స్పష్టం చేశారు. చర్చలు, ఆధారాలు, చట్టపరమైన పోరాటాల ద్వారానే సమస్యలకు శాశ్వత పరిష్కారాలు లభిస్తాయని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ విధానాలపై అభ్యంతరాలు ఉన్న రాజకీయ పార్టీలు ప్రజాస్వామ్య పద్ధతుల్లో ప్రజల మధ్యకు వెళ్లి తమ అభిప్రాయాలను వివరించాలని సూచించారు. ఎన్నికల్లో పోటీ చేసి ప్రజల మద్దతు పొందడం, ప్రజల విశ్వాసాన్ని గెలుచుకుని అధికారంలోకి రావడం ప్రజాస్వామ్యంలో ఉన్న మార్గాలని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన పాలన అందించడమే రాజకీయ పార్టీల ప్రధాన లక్ష్యం కావాలని అన్నారు. దేశ ఐక్యత, శాంతిభద్రతలు, రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సదానంద రెడ్డి పిలుపునిచ్చారు.

దసరా ఏర్పాట్లను పర్యవేక్షించిన చిగుళ్లపల్లి రమేష్ కుమార్



వికారాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 11 (సింగిడి): దసరా ఉత్సవాలలో భాగంగా రేపు రామయ్య గూడ శ్రీ అనంత పద్మనాభ స్వామి వారి కట్ట దగ్గర జరగబోయే పూజా కార్యక్రమం ఏర్పాట్లను స్థానిక 18వ వార్డు కౌన్సిలర్ మరియు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగుళ్లపల్లి రమేష్ కుమార్ శనివారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా దేవుడి సేవ వచ్చే రోడ్డు మార్గంలో మరమ్మత్తు పనులు, రోడ్డుపై రెడీమిక్స్, డస్ట్ వేయించడం, జేసిబి సహాయంతో రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు తొలగించడం, క్లీనింగ్ పనులు చేపట్టడం జరిగిందని రమేష్ కుమార్ తెలిపారు. నేడు ఉదయం 10 గంటలకు రామయ్య గూడ శ్రీ అనంత పద్మనాభ స్వామి కట్ట దగ్గర జరగబోయే పూజా కార్యక్రమానికి స్థానిక ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి పూజ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ఆర్. మల్లేశం, దుద్యాల లక్ష్మణ్, నాగరాజు, దుద్యాల సురేష్, బుచ్చయ్య, వెంకట్, సంతు, జవాన్లు వేణు, రాజు, పారిశుద్ధ్య సేవకులు పాల్గొన్నారు.

న్యాయపరమైన చిక్కులను తొలగించి

మున్సిపల్ భవన నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించండి

బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్



కుత్బుల్లాపూర్, అక్టోబర్ 11 (సింగిడి): కుత్బుల్లాపూర్ నియోజక వర్గం బాచుపల్లి మండలం సర్వే నెంబర్ 233/1 లో శంకుస్థాపన చేసి కోర్టు చిక్కులతో నిలిచిపోయిన సీఎంసీ నిజాంపేట్ మున్సిపల్ సర్కిల్ నూతన కార్యాలయ భవన నిర్మాణ స్థలాన్ని బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎంసీ నిజాంపేట్ మున్సిపల్ సర్కిల్ కార్యాలయ నిర్మాణానికి గతంలో నాలుగు ఎకరాలను కేటాయించి శంకుస్థాపన చేయడం జరిగిందని కొన్ని కోర్టు సమస్యలతో పనులను ప్రారంభం కాలేదు. రెవెన్యూ పరంగా న్యాయపరమైన చిక్కులను తొలగించి మున్సిపల్ భవన నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఆర్ఐ మల్లేశ్వర్ రావు, సాయి, స్థానిక మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డివిజన్లోని సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తా

- చంద్రపురి కాలనీ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీకాంత్ యాదవ్



జవహర్ నగర్, అక్టోబర్ 11 (సింగిడి): చంద్రపురి కాలనీ డివిజన్ 2 పరిధిలోని సమస్యలను శక్తి వంచన లేకుండా పరిష్కరిస్తానని చంద్రపురి కాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ పేర్కొన్నారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ చంద్రపురి కాలనీ డివిజన్2 పరిధిలోని ఆనంద నగర్ కాలనీలో డివిజన్ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ శనివారం పార్టీ శ్రేణులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు పూల బోకేతో స్వాగతం పలికారు. అనంతరం కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా వారితో శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికి వదిలేసిందని కేవలం వారి స్వలాభాల కోసమే 10 సంవత్సరాలుగా జవహర్ నగర్ లో కాలయాపన చేశారన్నారు. డివిజన్ పరిధిలో చాలా సమస్యలు ఉన్నాయని వాటిని ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లి ఒక్కొక్కటి గా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. రాబోయే రోజుల్లో డివిజన్ పరిధిలోని అన్ని సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. దీనికి డివిజన్ ప్రజలందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేష్ గౌడ్, సుధాకర్ రెడ్డి, శంకర్రావు తో పాటు కాలనీవాసులు పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ సంబురాలు



కొడంగల్, అక్టోబర్ 11 (సింగిడి): కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించిన. శనివారం నుంచి విద్యార్థులకు దసరా సెలవులు కావడంతో పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి శుక్రవారం బతుకమ్మ ఉత్సవాలు జరుపుకున్నారు. విద్యార్థులకు బతుకమ్మ,దసరా ఉత్సవాల ప్రత్యేకతలు వివరించారు. రంగు రంగు పూలతో బతుకమ్మ లను పేర్చి, డిజె పాటలతో బతుకమ్మ చుట్టూ ఆడుతూ పాడుతూ, బొడ్డెమ్మ లు వేస్తూ ఉల్లాసంగా బతుకమ్మ సంబురాలు జరుపుకున్నారు. ఈకార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

బిజెపి రాష్ట్ర మున్సిపల్ సెల్ కో కన్వీనర్ రావుల శేషగిరి



కుత్బుల్లాపూర్, అక్టోబర్ 11 (సింగిడి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరారం పాండు భస్తి ఏవి మోడల్ స్కూల్లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం ప్రారంభోత్సవ కార్యక్రమానికి మేడ్చల్ జిల్లా ఓబీసీ మోర్చ అధ్యక్షులు శేఖర్ యాదవ్ తో కలిసి బిజెపి రాష్ట్ర మున్సిపల్ సెల్ కో కన్వీనర్ రావుల శేషగిరి ముఖ్య అతిథులుగా హాజరై మెడికల్ క్యాంపును ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీలలోని పేద ప్రజల కోసం ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య శిబిరాలను స్థానిక ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైద్య శిబిరంలో పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్న రోగులకు అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్ ఎస్ వాసు, విజేందర్ రెడ్డి, యాదగిరి తదితర నాయకులు పాల్గొన్నారు.



మూసీ సుందరీకరణ పేరిట రియల్ ఎస్టేట్ వ్యాపారమా?

- పేదల భూములు లాక్కుంటే సహించేది లేదు
- పట్లోళ్ల కార్తీక్ రెడ్డి



రాజేంద్రనగర్, అక్టోబర్ 11 (సింగిడి): మూసీ సుందరీకరణ పేరుతో పేదల భూములను స్వాధీనం చేసుకొని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని రాజేంద్రనగర్ బీఆర్ఎస్ పార్టీ ఇన్చార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని హిమాయత్ సాగర్ గ్రామంలో భూ బాధితులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ.. కేవీఆర్ పార్కులో రూ. 200 కోట్ల ప్రాజెక్టును ప్రారంభించి, పనులు మొదలుపెట్టిన తర్వాతే రద్దు చేసిన ఘనత ఈ ప్రభుత్వానికే దక్కుతుందని విమర్శించారు. శంషాబాద్ మండల పరిధిలోని బహుదూర్ గూడ గ్రామంలో బుల్లెట్ ట్రైన్ స్టేషన్ పేరుతో సుమారు 1,000 ఎకరాల భూమిని గుంజుకొని, వేలం వేసి లబ్ధి పొందాలని చూస్తున్నారని ఆరోపించారు. కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ స్వయంగా తమను సంప్రదించకుండా ఎవరూ భూములు లాక్కోవద్దని స్పష్టం చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఒక సింగిల్ ప్రాజెక్ట్ను కూడా విజయవంతంగా నిర్మించలేని అసమర్థ ప్రభుత్వం ఇదని, మూసీ సుందరీకరణ ప్రాజెక్టు పేరుతో దానికి 500 మీటర్ల దూరంలో ఉన్న భూములకు ల్యాండ్ కన్వర్షన్ నోటీసులు ఇస్తారా అని మండిపడ్డారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం బాధితులకు మూడింతల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. పేదల భూములు లాక్కోవడం మినహా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీ లేదని దుయ్యబట్టారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన ఈ ప్రభుత్వం కాలం గడుస్తున్నా ప్రజలకు ఎలాంటి న్యాయం చేయలేకపోయిందని ఎత్తిచూపారు. మూసీ సుందరీకరణ పేరిట రియల్ ఎస్టేట్ వ్యాపారానికి తెరతీస్తే బీఆర్ఎస్ పార్టీ తరఫున పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని తీవ్రంగా హెచ్చరించారు. బాధితులు ధైర్యంగా ఉండాలని, భూ సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. త్వరలోనే కేసీఆర్ నాయకత్వంలో మళ్లీ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రేమ్ కుమార్ గౌడ్, ఆర్. నాగరాజు, మాజీ సర్పంచ్ ఆంజనేయులు, సుభానితో పాటు పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్యాస్ లారీ వెనుక టైర్ కిందపడి యువకుడు మృతి

కన్నీటి శోకంలో కుటుంబం



కీసర, అక్టోబర్ 11 (సింగిడి): మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసర పోలీస్ స్టేషన్ పరిధిలోని నాగారం, రాంపల్లి చౌరస్తా వద్ద ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. గ్యాస్ లారీ వెనుక టైర్ కిందపడి అఖిల్ (20) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. అఖిల్ ఉదయం జిమ్ ముగించుకుని తన ఇంటికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగిందని, నాగారం నుంచి అహ్మద్గూడ వైపు వెళ్తున్న గ్యాస్ లారీ ప్రమాదవశాత్తు అతడిపై నుంచి వెళ్లడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. అఖిల్ శివానందపురి కాలనీలో నివాసం ఉంటున్నట్లు తెలిపారు.

కొడంగల్లో తాగునీటి నీటికొరత

రోడ్డుపై ఖాళీ బిందెలతో బైటాయింపు

ఆందోళన చెందుతున్న గాంధీనగర్ ప్రజలు



కొడంగల్, అక్టోబర్ 11 (సింగిడి): కొడంగల్ పట్టణంలో తాగునీటి ఎద్దడి ప్రారంభమైంది. పట్టణంలోని గాంధీ నగర్ లో తాగునీటి సమస్య రోజురోజుకు అధిగమించడంతో శనివారం ఉదయం కాలనీ వాసులు ఖాళీ బిందెలతో చించోలి-మహబూబ్ నగర్ జాతీయ రహదారి 167 రోడ్డు పై బైటాయించారు. తమ కాలనీకి తాగునీటి సౌకర్యం కల్పించేదాకా కదిలేదే లేదంటూ రోడ్డుపై ఖాళీ బిందెలు పెట్టి నిరసనకు దిగారు. తాగునీటి సౌకర్యం కల్పించే అవకాశం ఉన్నప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని కాలనీవాసులు వాపోయారు. దీంతో వాహనాలు రాకపోకలు ఆగిపోవడంతో ప్రయాణికులకు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్సై తమ సిబ్బంది తో బయలుదేరి, సమస్య పరిష్కరించాలని అధికారులతో మాట్లాడి ఆందోళన ను విరమింపజేశారు.

శాసన సభాపతినికలిసిన నాయకులు



వికారాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 11 (సింగిడి): తెలంగాణ శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అధికారిక విదేశీ పర్యటన విజయంతం చేసుకొని హైదరాబాద్ వచ్చిన సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యులు కాకి రంగరాజ్ మర్యాద పూర్వకంగా మినిస్టర్స్ అధికారిక నివాసంలో కలిశారు. వీరితోపాటు పార్టీసీనియర్ నాయకులు మాజీ జడ్పీటీసీ డీసీసీ జనరల్ సెక్రటరీ శ్రీనివాస్ ముదిరాజ్ మాజీ ఎంపీపీ సీనియర్ నాయ కుడు పంచాయితీ రాజ్ వింగ్ రాష్ట్ర కార్యదర్శి నర్సిములు, అనంతరెడ్డి డీసీసీ వైస్ ప్రెసిడెంట్, మైనారిటీ నాయకుడు కరీం తదితరులు పాల్గొన్నారు.

వికారాబాద్ జిల్లాలో పోలీస్ ఫ్లాగ్ డే పోటీలు

ఎస్పీ స్నేహ మెహ్రో పిలుపు



వికారాబాద్ ప్రతినిధి,అక్టోబర్ 11 (సింగిడి): పోలీస్ ఫ్లాగ్ డే 2026 సందర్భంగా వికారాబాద్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వ్యాసరచన, షార్ట్ ఫిల్మ్, ఫోటోగ్రఫీ పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రో, ఐపీస్ తెలిపారు. విద్యార్థులు, యువత మరియు పోలీస్ సిబ్బంది ఈ సదావకాశాన్ని వినియోగించుకుని పోటీల్లో ఉత్సాహంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. వ్యాసరచన పోటీలకు 12వ తరగతి వరకు, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల నివారణలో పోలీసుల పాత్ర వంటి అంశాలపై తెలుగు, ఉర్దూ, ఆంగ్ల భాషల్లో పోటీలు ఉంటాయని ఆమె తెలిపారు. డిగ్రీ, ఉన్నత విద్య అర్హత తో సోషల్ మీడియా దుర్వినియోగం, మాదకద్రవ్య రహిత తెలంగాణ అంశాలపై వ్యాసరచన పోటీ నిర్వహించనున్నట్లు ఆమె చెప్పారు. చివరి తేదీ ఈ నెల 27 గా నిర్ణయించినట్లు చెప్పారు. షార్ట్ఫిల్మ్ పోటీలకు గాను పోలీసుల సేవలు, త్యాగాలు, సైబర్ నేరాల నివారణపై గరిష్ఠంగా 3 నిమిషాల నిడివితో తెలుగు, ఉర్దూ లేదా ఆంగ్లంలో రూపొందించవచ్చని తెలిపారు. ఫోటోగ్రఫీ పోటీలకు గాను పోలీస్ విధులు, ట్రాఫిక్ నిర్వహణ, పోలీస్, ప్రజల సంబంధాలను ప్రతిబింబించేలా ఇటీవల తీసిన ఫోటోలను పంపాలని సూచించారు. దరఖాస్తులను స్థానిక ఎస్.హెచ్ వో ల ద్వారా అందజేయాలని తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారు తమ షార్ట్ ఫిల్మ్లు మరియు ఫోటోలను ఈ నెల 20వ తేదీలోగా సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారుల ద్వారా జిల్లా పోలీస్ కార్యాలయానికి పంపాలని అన్నారు. యూనిట్ స్థాయిలో ఎంపికైన ఉత్తమ ప్రతిభను కనబరిచిన వారిని రాష్ట్రస్థాయికి పంపి, ఈనెల 30 నాటికి పోలీస్ పోర్టల్లలో అప్లోడ్ చేయనున్నట్లు తెలిపారు. సమాజంలో అవగాహన పెంపొందించే ఈ సృజనాత్మక కార్యక్రమాల్లో యువత పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఎస్పీ కోరారు.

పరిశుభ్రతకు నోచుకోని పల్లెదవాఖాన

పిచ్చిమొక్కలతో నిండిపోయిన ఆవరణ



కొడంగల్, అక్టోబర్ 11 (సింగిడి): బొంరాస్ పేట్ మండలంలోని తుంకిమెట్ల గ్రామంలో గత ప్రభుత్వం హయాంలో నిర్మించిన పల్లెదవాఖాన ఆవరణ పరిశుభ్రత కు నోచుకోలేకపోయింది. ప్రజల ఆరోగ్యం పట్ల పరిసరాల పరిశుభ్రత గురించి ప్రజలకు అవగాహన కల్పించాల్సిన వైద్యులు దవాఖాన ఆవరణ పరిశుభ్రంగా ఉంచకపోవడం ప్రజల నుంచి విమర్శలు వస్తున్నాయి. వ

Editorial

ఎడిటోరియల్

ఒక సామాన్య మహిళ ప్రశ్న!

వ్యవస్థకు వినిపించాల్సిన సందేశం

ప్రజాస్వామ్యంలో సామాన్య పౌరులు వ్యక్తం చేసే అభిప్రాయాలు ప్రజా సమస్యలపై చర్చకు దారితీయగలవు. ఢిల్లీలో నిరసన ప్రదేశంలో ఒక మహిళ మాట్లాడిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో ప్రచారంలోకి రావడంతో పోలీసుల సేవల పట్ల గౌరవాన్ని వ్యక్తం చేస్తూనే, ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం, పదవీ విరమణ భద్రత, ప్రజాప్రతినిధులకు అందే ప్రయోజనాలు వంటి అంశాలు చర్చకు వచ్చాయి. అయినప్పటికీ, ప్రజా సంక్షేమానికి సంబంధించిన అంశాలపై పౌరులు తమ అభిప్రాయాలను వెల్లడించడం ప్రజాస్వామ్యంలో సహజమైన ప్రక్రియ. ఆ అభిప్రాయాల వెనుక ఉన్న సమస్యలను వాస్తవాల ఆధారంగా పరిశీలించడం, ప్రజలకు సంబంధించిన అంశాలపై బాధ్యతాయుతంగా స్పందించడం పాలనా వ్యవస్థకు అవసరం.

సంక్షేమంలో పారదర్శకత అవసరం!
ప్రజాప్రతినిధులకు అందే ప్రయోజనాలు, ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ భద్రత వంటి అంశాలు ప్రజా చర్చకు సంబంధించినవే. అయితే, వేర్వేరు వర్గాలకు వర్తించే ప్రయోజనాలను నేరుగా పోల్చే ముందు వాటి స్వభావం, అర్హతలు, బాధ్యతలను పరిగణనలోకి తీసుకోవాలి. ప్రజాధనంతో అమలయ్యే ప్రతి సంక్షేమ చర్యలో పారదర్శకత, ఆర్థిక బాధ్యత, ప్రజాప్రయోజనం కీలకంగా ఉండాలి. ప్రభుత్వ ఉద్యోగులు పదవీ విరమణ తర్వాత ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా తగిన భద్రత పొందడం, వారి సేవలకు తగిన గౌరవం లభించడం ముఖ్యం. అదే సమయంలో ప్రజాప్రతినిధులకు అందే సదుపాయాలపై ప్రజలకు స్పష్టమైన సమాచారం అందుబాటులో ఉండాలి. ఏ వర్గాన్నీ మరో వర్గానికి వ్యతిరేకంగా నిలబెట్టకుండా, అందరికీ న్యాయం జరిగే విధానాలపై చర్చ జరగాలి. ప్రజల అవసరాలు, ప్రభుత్వ ఆర్థిక సామర్థ్యం, సంక్షేమ లక్ష్యాల మధ్య సమతుల్యత పాటించడం బాధ్యతాయుత పాలనకు అవసరం.

పోలీసుల విధులు.. సంక్షేమానికి ప్రాధాన్యం!
శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు సిబ్బంది కీలక పాత్ర పోషిస్తారు. అత్యవసర పరిస్థితులు, రాత్రి విధులు, ప్రజా కార్యక్రమాలు, నిరంతర పర్యవేక్షణ వంటి సందర్భాల్లో వారి పని భారం పెరిగే అవకాశం ఉంటుంది. విధుల స్వభావం, పని గంటలు, సిబ్బంది లభ్యత, విశ్రాంతి, ఆరోగ్య పరిస్థితులు వారి సంక్షేమంపై ప్రభావం చూపుతాయి. అందువల్ల పోలీసు సిబ్బందికి తగిన విశ్రాంతి, ఆరోగ్య సంరక్షణ, ప్రమాద సమయాల్లో రక్షణ, కుటుంబ సంక్షేమం, పదవీ విరమణ భద్రత వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. విధి నిర్వహణలో ఎదురయ్యే ఒత్తిడిని తగ్గించేందుకు అవసరమైన సిబ్బంది, వసతులు, శిక్షణ, సహాయక వ్యవస్థలను బలోపేతం చేయడం కూడా ముఖ్యం. ప్రజల భద్రత కోసం పనిచేసే సిబ్బంది సంక్షేమాన్ని మెరుగుపరచడం వారి వ్యక్తిగత ప్రయోజనానికే పరిమితం కాదు. మెరుగైన పని పరిస్థితులు ప్రజలకు అందే సేవల నాణ్యతను పెంచేందుకు కూడా తోడ్పడతాయి.

ప్రజల గొంతుకు విలువ.. పాలనలో బాధ్యత!
ప్రజలు తమ సమస్యలను వెల్లడించడం, ప్రభుత్వ విధానాలపై అభిప్రాయాలు తెలియజేయడం, సంక్షేమ చర్యలపై వివరణ కోరడం ప్రజాస్వామ్యంలో భాగం. భారత రాజ్యాంగం భావప్రకటన స్వేచ్ఛను, శాంతియుతంగా సమావేశమయ్యే హక్కును గుర్తిస్తుంది. అయితే, ఈ హక్కులు రాజ్యాంగం నిర్దేశించిన పరిమితులకు లోబడి ఉంటాయి. సామాజిక మాధ్యమాల్లో ప్రచారంలోకి వచ్చే దృశ్యాలు లేదా వ్యాఖ్యల ఆధారంగా మాత్రమే వ్యక్తులు, సంస్థలు, ప్రభుత్వ వ్యవస్థలపై తుది నిర్ణయాలకు రావడం సరికాదు. సంబంధిత సమాచారం, విశ్వసనీయ ఆధారాలను పరిశీలించిన తర్వాతే సమతుల్యమైన అభిప్రాయానికి రావాలి. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, పోలీసు సిబ్బంది సంక్షేమాన్ని పరస్పర విరుద్ధ అంశాలుగా చూడకుండా, న్యాయం, సమానత్వం, ప్రజాధన వినియోగంలో బాధ్యత వంటి ప్రమాణాలతో పరిశీలించాలి. ప్రజల అభిప్రాయాలను గౌరవించడం, సమస్యలను శ్రద్ధగా పరిశీలించడం, సాధ్యమైన పరిష్కారాలను పారదర్శకంగా అమలు చేయడం బాధ్యతాయుత పాలనకు గుర్తింపు. ప్రజల మాటకు విలువనిస్తూ, సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చి, ప్రతి నిర్ణయంలో ప్రజాప్రయోజనాన్ని ముందుంచినప్పుడే ప్రజాస్వామ్యంపై విశ్వాసం మరింత బలపడుతుంది.

ఫిరోజ్ ఖాన్
సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ 9640466464

ప్రజాస్వామ్యానికి ఒక కఠిన పాఠం

జె.ఎం.ఎం. లంచాల వివాదం

2000 అక్టోబర్ 12...జే ఎం ఎం ముడుపుల కేసులో పూర్వపు ప్రధానమంత్రి పి వి నరసింహారావుకు, బూటాసింగుకు కోర్టు మూడు సంవత్సరాల కఠిన కారాగారం, 2 లక్షల జరిమానా విధించిన దినం.తరువాత వీరిద్దరూ నిర్దోషులుగా బయట పడ్డారు.

భారత ప్రజాస్వామ్య చరిత్రలో 1990వ దశకం రాజకీయ కల్లోలంతో నిండిన కాలం. ఆర్థిక సంస్కరణలు, కూటమి రాజకీయాలు, అవినీతి ఆరోపణలు అన్నీ కలసి దేశ రాజకీయ నైతికతను ప్రశ్నార్థకంగా మార్చిన సమయమది. అటువంటి సందర్భంలోనే దేశ రాజకీయ చరిత్రలో అత్యంత చర్చనీయాంశంగా నిలిచినది జార్ఖండ్ ముక్తి మోర్చా (జె.ఎం.ఎం.) లంచాల కేసు. అప్పటి ప్రధానమంత్రి పీ. వి. నరసింహారావు మరియు కేంద్ర మంత్రి బూటా సింగ్ ఈ కేసులో నిందితులుగా నిలవడం, తీర్పు వెలువడడం, తరువాత నిర్దోషులుగా బయటపడడం---ఇవన్నీ భారత ప్రజాస్వామ్య వ్యవస్థను లోతుగా పరిశీలించాల్సిన అవసరాన్ని గుర్తు చేశాయి.

1993 జూలైలో నరసింహారావు నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం పెట్టబడింది. ఆ సమయంలో లోక్‌సభలో మొత్తం 528 సభ్యులు ఉండగా, ప్రభుత్వం నిలబడేందుకు 265 ఓట్లు అవసరమయ్యాయి. కాంగ్రెస్ పార్టీ వద్ద స్పష్టమైన మెజారిటీ లేకపోవడంతో విశ్వాస తీర్మానం ఓటింగ్ ప్రభుత్వ భవిష్యత్తును నిర్ణయించేదిగా మారింది. కీలకంగా నిలిచిన వారు జార్ఖండ్ ముక్తి మోర్చా (జె.ఎం.ఎం.) పార్టీకి చెందిన శిబు సోరెన్, సురజ్ మండల్, సైమన్ మారాండి, షైలేంద్ర మహతో అనే నలుగురు ఎంపీలు. వీరు ఓటు వేయడానికి పెద్ద మొత్తం డబ్బు తీసుకున్నారనే ఆరోపణలు చోటు చేసుకున్నాయి.



ఆ కాలంలో మీడియా నివేదికల ప్రకారం జె.ఎం.ఎం. ఎంపీలకు రూ. 3.5 కోట్ల వరకు నగదు అందించ బడిందని, కాంగ్రెస్ నాయకత్వం ప్రభుత్వం రక్షించు కోవడానికే ఈ లావాదేవీలు జరిగాయని ఆరోపణలు వెలువడ్డాయి. ఈ అవినీతి ఆరోపణలు 1996లో వెలుగులోకి వచ్చాయి. ప్రజా ఒత్తిడి నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం సీబీఐ దర్యాప్తుకు ఆదేశించింది. దర్యాప్తు అనంతరం 1997లో సీబీఐ పీ.వి. నరసింహారావు, బూటా సింగ్, అలాగే జె.ఎం.ఎం. ఎంపీలను నిందితులుగా చేర్చింది.

విచారణ అనంతరం 2000 అక్టోబర్ 12న దిల్లీ ప్రత్యేక సీబీఐ కోర్టు తీర్పు వెలువరించింది. నరసింహారావు, బూటా సింగ్ ఇద్దరికి మూడు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, తలా రూ. 2 లక్షల జరిమానా విధించింది. ఈ తీర్పు భారత చరిత్రలో ఒక మాజీ ప్రధానమంత్రికి శిక్ష విధించిన అరుదైన సంఘటనగా నిలిచింది. అయితే ఈ తీర్పుతో దేశ రాజకీయ వర్గాలు, న్యాయ వర్గాలు కదలి పోయాయి. నరసింహారావు ఆర్థిక సంస్కరణల రూపకర్తగా ఉన్న ప్రతిష్ఠకు ఇది పెద్ద దెబ్బగా భావించ బడింది.

ఇద్దరూ ఆ తీర్పుపై దిల్లీ హైకోర్టులో అప్పీల్ చేశారు. దీర్ఘకాలిక విచారణ అనంతరం 2002లో హైకోర్టు సీబీఐ సమర్పించిన సాక్ష్యాలు తగినవిగా లేవని, లంచం చెల్లింపుకు నిర్ధారణగా చూపిన పత్రాధారాలు, సాక్ష్యాలు విశ్వసనీయంగా లేవని పేర్కొంటూ నిందితులను నిర్దోషులుగా ప్రకటించింది. తద్వారా నరసింహారావు, బూటా సింగ్ లు చట్టపరంగా విముక్తులయ్యారు.

ఈ ఘటన ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉన్న లోపాలను బహిర్గతం చేసింది. పార్లమెంటు సభ్యులు ప్రభుత్వాన్ని నిలబెట్టేందుకు తమ ఓటును అమ్ముకోవచ్చన్న ఆలోచన ప్రజలలో రాజకీయాలపై నమ్మకాన్ని దెబ్బతీసింది. జె.ఎం.ఎం. నాయకులు ఆ డబ్బు తమ పార్టీకి విరాళమని పేర్కొన్నా, దేశ ప్రజల దృష్టిలో అది లంచంగానే నిలిచింది. ఈ సంఘటన తరువాత "పార్లమెంటరీ లంచం" అనే పదం రాజకీయ నిఘంటువులో చోటు చేసుకుంది.

జె.ఎం.ఎం. లంచాల కేసు కేవలం ఒక అవినీతి ఆరోపణ మాత్రమే కాదు, ప్రజాస్వామ్య విలువల పునాదులను కదిలించిన చారిత్రక సంఘటన. ఆ సమయంలో రాజకీయం, న్యాయం, నైతికత మధ్య ఉన్న సున్నిత సంబంధాలను ఈ ఘటన ప్రతిబింబించింది. పీ.వి. నరసింహారావు నిర్దోషిగా బయటపడ్డా, ఈ కేసు ఆయన రాజకీయ వారసత్వంలో ఒక మచ్చగా నిలిచి పోయింది.

ఈ ఘటన దేశ ప్రజాస్వామ్యానికి ఒక పాఠం నేర్పింది--- అధికారపు అహంకారం, కూటమి రాజకీయాల తతంగం, అవినీతి ప్రలోభాలు తాత్కాలికంగా విజయాన్ని తెచ్చినా, చరిత్రలో అవి నైతిక పరాజయంగా నిలుస్తాయని. జె.ఎం.ఎం. లంచాల కేసు భారత రాజకీయ చరిత్రలో అధికార పీఠాల వెనుక నడిచే డబ్బు ప్రభావాన్ని బహిర్గతం చేసిన గంభీరమైన మలుపుగా గుర్తుండి పోతుంది.

రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494

ప్రతి కదలికకు కీళ్లే కీలకం

అక్టోబర్ 12... ప్రపంచ ఆర్థరైటిస్ దినోత్సవం

మన ప్రతి కదలికకూ కీలే.. కీలకం! జాయింట్లు మృదువుగా, సజావుగా, సున్నితంగా కదులు తుంటేనే... మన జీవితం హాయిగా, సుఖంగా సాగుతుంటుంది. అది వేళ్ల, మణికట్టు, భుజం, చివరికి పాదాల, వేళ్ల ఏ జాయింట్లు అయినా కావచ్చు.. మోకాలి కీళ్లు కావచ్చు. ఏ కదలికకైనా ఈ కీళ్లే కీలకం. మరి మన శరీరంలో ఈ కీళ్లు ఉగ్రరూపం దాలిస్తే కాలు, చేయి మెదపాలంటే కష్టం. మారు తున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు అనేక రకాల అనారోగ్య సమస్యలకు దారి తీస్తుంటాయి. అందులో ఆర్థరైటిస్ కూడా ఒకటి. ఇది గ్రీకు పదాలైన "ఆర్థ్రో" నుండి ఉద్భవించింది, అంటే "ఉమ్మడి", మరియు "ఐటిస్", అంటే "మంట". మానవ ఆర్థరైటిస్ యొక్కమొట్ట మొదటి జాడలు క్రీ.పూ 4500 నాటివి. ప్రారంభ నివేది కలలో, ఆర్థరైటిస్‌ను చరిత్రపూర్వ ప్రజల అత్యంత సాధారణ వ్యాధిగా సూచిస్తారు. కీళ్ల అరుగుదలనే ఆర్థరైటిస్ అంటాం. కీళ్ల నొప్పులు అధికంగా తుంటి, మోకాలులో వస్తుంటాయి. చేతి, మోచేతిలోనూ కీళ్ల నొప్పులు రావచ్చు. శరీరంలో మోకాలే పెద్ద కీలు. శరీర బరువును సగానికిపైగా మోకాలే మోస్తుంటుంది. వయసు పెరుగుతున్న కొద్దీ కీళ్లలో ఉండే కీలకమైన మృదులాస్థి అనే పదార్థం కరిగిపోతుంది. అది నిరంతరం కరుగుతూ మళ్లీ ఏర్పడు తుండటం దాని ప్రత్యేకత. అయితే 40--45 ఏళ్ల మధ్య మృదులాస్థి పున రుత్పత్తి తగ్గడం మొదలవుతుంది. దీంతో కీళ్లవాపు, నొప్పి, నడవలేక పోవడం వంటివి వస్తాయి. ఈ విధంగా జరగడాన్నే కీళ్ల నొప్పి లేదా ఆర్థరైటిస్ అంటారు. కీళ్లనొప్పికి జన్యు పరమైన కారణాలూ ఉంటాయి. ప్రధానంగా వయసు, జన్యు పరమైన కారణాలతోనే ఆర్థరైటిస్ వస్తుంది. రుమటాయిడ్ ఆర్థరైటిస్, ఎంకైలోడింగ్ ఆర్థరైటిస్ అనే 2 రకాలున్నాయి. సాధారణ ఆర్థరైటిస్‌కు ఈ రెండూ భిన్నం. ఈ రెండింటిలో ఉపశాఖలుగా మరో 15 ఆర్థరైటిస్‌లు ఉన్నాయి. ఒకసారి తగులుకుంటే వదిలి పెట్టవు. పూర్తిగా నిర్మూలించలేం. స్టెరాయిడ్స్ తదితర మందులు వాడటం వల్ల వీటిని నియంత్రించ వచ్చు. ఇక సోరియాసిస్ కూడా ఆర్థరైటిస్‌కు దారితీస్తుంది. రీటస్ డిసీజ్ అంటే కంటి చూపు మంద గించడం ద్వారా కీళ్ల నొప్పులు వచ్చే అవకాశ ముంది. ఇలాంటి జబ్బులు వస్తే 20--30 ఏళ్లకే ఆపరేషన్లు చేయాల్సి ఉంటుంది. గతంలో 50--60 ఏళ్లలో కనిపించే ఆర్థరైటిస్‌ను ఇప్పుడు 35--40 ఏళ్లలోనే చూస్తున్నాం. దీన్ని ముందుగా గుర్తించి నియంత్రణ చర్యలు తీసుకోక పోతే ముమ్ముందు నడవలేని, కదల్లేని పరిస్థితులు రావొచ్చని వైద్యులు హెచ్చరి స్తున్నారు. కింద కూర్చోవడం వల్ల, సాధారణ మరుగుదొడ్లు వాడినా మోకాలి నొప్పులు వస్తాయి. ఈ కీళ్లకు వచ్చే అతి పెద్ద సమస్య ఆర్థ్రైటిస్! అంటే కీలు లోపలంతా వాచి పోయి కదపా లంటేనే తీవ్రమైన నొప్పి, బాధతో జాయింటులో అరిగి పోవడం వల్ల రావచ్చు. దాన్ని "ఆస్టియో ఆర్థ్రైటిస్" అంటారు. ఇప్పుడు ఎక్కువ మంది అనుభవిస్తున్న మోకాళ్ల నొప్పుల బాధ ఇదే. ఇక ఒంట్లో ఏదైనా ఇన్ఫెక్షన్ తలెత్తి అది కీలుకు చేరటం వల్ల కీళ్లనొప్పి రావచ్చు. దీన్ని "ఇన్ఫెక్టివ్ ఆర్థ్రైటిస్' అంటారు. సొరియాసిస్ వంటి చర్మ వ్యాధుల్లో కూడా కీళ్ల వాపు, నొప్పి పలకరించవచ్చు. దాన్ని "సొరియాటిక్ ఆర్థ్రైటిస్" అంటారు. అలాగే మూత్రనాళ ఇన్ఫెక్షన్లు, నీళ్ల విరేచనాల వంటి ఇన్ఫెక్షన్ల తర్వాత కూడా కీళ్ల వాపు రావచ్చు. దాన్ని "రియాక్టివ్ ఆర్థ్రైటిస్" అంటారు. చికున్‌గన్యా వంటి వైరల్ వ్యాధుల్లో కూడా కీళ్ల వాపులు రావచ్చు. వీటిని "వైరల్ రియాక్టివ్ ఆర్థ్రైటిస్" అంటారు. ఇలా కీళ్ల వాపుల్లో ఎన్నో రకాలు న్నాయి. అయితే ఇవన్నీ కూడా ఏదో ఒక ప్రత్యేకమైన, స్పష్టమైన కారణంతో వచ్చే కీళ్ల నొప్పులు! వీటికి భిన్నంగా... స్పష్టమైన కారణమేదీ తెలియ కుండానే ఆరంభమయ్యే అతి పెద్ద సమస్య... రుమటాయిడ్ ఆర్థ్రైటిస్! కీళ్లవాతం!! వేళ్లు, మణికట్టు వంటి చిన్న జాయింట్లను ఎక్కువగా పట్టి పీడించే ఈ కీళ్లవాతం.. దీర్ఘకాలం ఉండిపోయే సమస్య! దీన్ని నిర్లక్ష్యం చేస్తే శరీరంలో గుండె, ఊపిరితిత్తులు, కళ్ల వంటి ఇతరత్రా అవయవాలూ ప్రభావితమై పరిస్థితి మరింత విషమిస్తుంది. అదృష్టవశాత్తూ- దీన్ని పూర్తి నియంత్రణలోకి తీసుకు వచ్చే విధానాలు అందుబాటులో ఉన్నాయి. అందుకే 'ప్రపంచ ఆర్థ్రైటిస్ దినం' సందర్భంగా ఈ కీళ్లవాతం గురించి అవగాహన కలిగి వుండాలి. మన శరీరంలో ఒక అద్భుతమైన రక్షణ వ్యవస్థ ఉంది. అదే 'రోగ నిరోధక వ్యవస్థ'. మనం వ్యాధుల బారినపడకుండా.. ఎటువంటి సూక్ష్మక్రిములూ మనపై దాడి చెయ్యకుండా నిరంతరం పహారా కాస్తుందీ వ్యవస్థ. రేయిం బవళ్లు ఈ బాధ్యతలను ఇది అద్భుతంగా నిర్వర్తిస్తుంటుంది. కానీ.. ఒక్కోసారి ఇది ఏకంగా మన శరీర భాగాల మీదే దాడి చేసేస్తుంది. ఫలితమే రకరకాల 'ఆటో ఇమ్యూన్' సమస్యలు. కీళ్లవాతం.. రుమటాయిడ్ ఆర్థ్రైటిస్ కూడా ఇలా తలెత్తే సమస్యే! ఇది మన కీళ్లలో ఎముకల మధ్య ఉండే మృదువైన 'సైనోవియం' పొరను చూసి, దానిపై దాడి చేసి దెబ్బతీయటం ఆరంభిస్తుంది. దీంతో కీళ్లు ఎర్రగా వాచిపోవటం, నొప్పుల వంటి బాధలన్నీ ఆరంభ మవుతాయి. సాధారణంగా ఇతరత్రా కీళ్ల నొప్పులైతే శరీరంలోని ఏదో ఒకవైపు కీలుకు మాత్రమే వస్తాయి. కానీ రుమటాయిడ్ ఆర్థ్రైటిస్‌లో- ఒకేసారి రెండు వైపులా వాపు కనిపిస్తుంది. అంటే ఉదాహరణకు కుడి చేతి వేలి కీళ్లు వాస్తే, ఎడమ చేతి వేలి కీళ్లు కూడా వాస్తుంటాయి. కుడి మణికట్టు కీలు వాస్తే, ఎడమ మణికట్టు కీలూ వాస్తుంది. అలాగే ఈ వాపు ఏకకాలంలో శరీరంలోని చాలా కీళ్లకూ రావచ్చు. కీళ్లవాతం ఏ వయసు వారికైనా రావచ్చుగానీ సాధారణంగా పెద్దవారి లోనే.. అదీ 30-60 ఏళ్ల మధ్య వయసు వారిలో ఎక్కువగా కనిపిస్తుంటుంది. ముఖ్యంగా- ఇది మహిళల్లో ఎక్కువ. కీళ్లవాతం సాధారణంగా శరీరంలోని చిన్న కీళ్లతో మొదలవు తుంది. అంటే చేతివేళ్లు, మణికట్టు, కాలివేళ్ల వంటి వాటితో ఆరంభమై క్రమేపీ మోకాలు, తుంటి వంటి పెద్ద జాయింట్లకూ రావచ్చు. వాపు, నొప్పి వంటివన్నీ చిన్న జాయింట్లతో ఆరంభం కావటం దీని ప్రత్యేక లక్షణం. రుమటాయిడ్ ఆర్థ్రైటిస్ బాధితుల్లో చాలా కొద్దిమందికి మాత్రమే కీళ్ల మార్పిడి అవసరం అవుతుంది. కీళ్లవాతం కొంతకాలం పెరుగుతూ తగ్గుతూ ఉండటం దీని మరో ప్రత్యేకత. కీళ్లవాతం వచ్చిన తొలిదశలో కీళ్ల మీది పైపొర మాత్రమే దెబ్బతింటుంది. వ్యాధి ముదురుతున్న కొద్దీ క్రమేపీ అది కీళ్లను, లోపలి ఎముకలను కొరికేస్తుంది. ఇంకా తీవ్రమైతే కీళ్ల మధ్య ఖాళీ తగ్గిపోతుంది. దీంతో ఎముకల రాపిడి కారణంగా నొప్పి వస్తుంది. కొన్నాళ్లకు కీళ్లు మొత్తం దెబ్బతింటాయి. రుమటాయిడ్ ఆర్థ్రైటిస్‌ను నియంత్రించు కోకపోతే - గుండె జబ్బులు, పక్షవాతం వంటివి పదేళ్ల ముందుగానే వచ్చే ప్రమాదం ఉంది. కళ్లు పొడిబారటం, లాలాజలం తగ్గిపోవటంతో పాటు గుండె చుట్టూ, ఊపిరితిత్తుల చుట్టూ నీరు చేరటం వంటి ఇబ్బందులూ ఎదురవ్వచ్చు. వ్యాధిని సత్వరమే గుర్తించి చికిత్స ఆరంభిస్తే ఈ కీళ్ల మార్పిడి అవసరం అంతగా రాదు. చిన్న కీళ్లకు ఈ మార్పిడి అపకాశమూ ఉండదు. అందుకే మందులతో చికిత్సకే ప్రాధాన్యం ఇస్తారు. కీళ్లవాతం బాధితుల్లో చాలామంది పూర్తి విశ్రాంతిగా పడుకుంటూ వ్యాయామం మానేస్తుంటారు. ఇది సరికాదు. వ్యాయామం చేయకపోతే కీళ్లు గట్టిగా బిగుసుకు పోతాయి. కొన్నిసార్లు ఆపరేషన్ చేసినా ఫలితం ఉండక పోవచ్చు. మందులతో నొప్పి తగ్గాక వ్యాయామం మొదలెట్టాలి. నొప్పి తగ్గుతున్న కొద్దీ వ్యాయామం చేసే సమయాన్ని కూడా పెంచుకోవాలి. ఏరోబిక్, యోగా, నడక వంటి వ్యాయామాలు ఏవైనా చేయొచ్చు. పొగ తాగకూడదు. బరువు పెరగ కుండా, శరీరానికి తగ్గట్లుగా ఉండాలి. ఆర్థరైటిస్‌ను ముందుగా గుర్తించకపోతే పనిచేసే సామర్థ్యం తగ్గిపోతుంది. దీనివల్ల శరీరంలో కొవ్వు పెరిగిపోతుంది. ఫలితంగా గుండెకు చేటు తెస్తుంది. అలాగే మెటబాలిజం తగ్గుతుంది. దీంతో ఒత్తిడి పెరుగుతుంది. మన జనాభాలో సుమారు ఒక శాతం మంది దీంతో బాధపడు తున్నారు. కీళ్ల 20 శాతం అరుగుదల ఉంటే, దాన్ని పెరగకుండా చూసుకోవాలి. మృదులాస్థి పెరగడానికి మందులు ఇస్తారు. అవి వాడాలి. సైక్లింగ్, ఈత వంటివి చేయాలి. దీని వల్ల కీళ్లపై ప్రభావం చూపదు. నిర్దిష్ట మోతాదులో డాక్టర్ల సూచన మేరకు నడవవచ్చు. ఏదైనా సమతుల్య మైన శారీరక శ్రమ, వ్యాయామం అవసరం. రుమటాయిడ్ ఆర్థ్రైటిస్ దీర్ఘకాలిక సమస్య. కాబట్టి చికిత్స కూడా దీర్ఘకాలం, జీవితాంతం తీసుకోవాల్సి ఉంటుంది.



రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...
9440595494

బొద్దింకల బెడదకు ముడుసుకుంటున్న ఛాతులు...

ప్రపంచంలో నియంతలందరూ
ఫోబియా గ్రస్తులంటుంటే విని
నమ్మలేకపోయాను కానీ
నీకున్న "కట్సరిడాఫోబియా" చూస్తే
నమ్మకుండా ఉండలేకుంటున్నాము

తీరొక్క పూల తోట ఇది
లేత కుసుమాలు విచ్చుకుంటుంటే
చూసి మురిసిపోతావనుకున్న కానీ
ఇంతగా దడుసుకుంటావనుకోలే

కలువలనే చూసి చూసున్న నీ కనులకు
ఏ పువ్వులను చూసినా ఏవగింపు రావడం
మమ్మీమీ ఆశ్చర్య పరచలేదు కానీ
నీవు ఈ దేశపు భిన్న పూల తోటకు
ఏకైక తోటమాలివి కదా
పూవులను చిదిమేస్తున్నా కూడా
చలించకుండా నీవుంటున్నావు చూడు
అదే నీపైన మాకు
తిరస్కృతికి కారణమవుతుంది

బొద్దింకలు రోడ్డెక్కితే
నీవు నీ అధికార కలుగులో దాక్కుంటున్నావు
గుంపుగా వాళ్ళు వీధుల్లో
ప్రశ్నల పెంట వదులుతుంటే
సమాధానాలతో నీవు సాపు చేస్తావనుకుంటే
సాటు సాటుకు తప్పించుకు తిరుగుడేందుకు

తనను తాను
బోనులో బంధించుకున్న పులి
గాండ్రింపులకు ఇన్నేళ్లు జడుసుకున్నాము కానీ
బొద్దింకలొచ్చాక ఆ అరుపులన్నీ
భయంతో నీవు పిచ్చిగా కూసే కూతలని తేలింది

మా నాయనమ్మ చెప్పుతుండేది
మంత్రాల బలం లేకున్నా
ఉత్త తుప్పిర్ల బలమన్న ఉండాలెరా అని
ఇప్పటికీ గానీ అర్థం కాలేదు
నీకున్నదంతా...
మంత్రాల బలము కాదు
అదంతా ఉత్త తుప్పిర్ల పనేనని

వాహనాన్ని, వాహకాన్ని రద్దు చేయగలవు కానీ
వాయువునేట్లా నిరాకరించగలవు..!?
ప్రశ్న కూడా ఇప్పుడు ఊపిరివంటిదే
ఈ దేశ ప్రజాస్వామ్య దేహానికి!!

నీవెంతో ఘనమైన వాడివని
గణతంత్ర దేశపు ఘనతను
ప్రపంచ పటంలో వెలిగిస్తావనుకుంటే
ఖాకీల కాపలాతో ఇట్టా కాటకలుపుతావనుకోలే!

రంగు చూసి బెదిరేటోడికి
ఆరిద్ధల చూసినా అదురే ...
నిన్ను చూశాకే అర్థమవుతుంది
అదెంత అర్థసత్యమో...!!

దిలీప్.వి
మానవ హక్కుల కార్యకర్త
సెల్: 8464030808

కేసీఆర్ దూర దృష్టితోనే భూపాలపల్లి జిల్లా ఏర్పాటు

● మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



భూపాలపల్లి, అక్టోబర్ 11 (సింగిడి): భూపాలపల్లి జిల్లా ఏర్పాట్లు మాజీ ముఖ్యమంత్రి బిఆర్ఎస్అధినేత కేసిఆర్ దూరదృష్టి, ప్రత్యేక చొరవ ఉన్నాయని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాగా ఏర్పడి 10 సంవత్సరాలు అయిన సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న దశాబ్ది ఉత్సవాలలో భాగంగా నేడు భూపాలపల్లి హనుమాన్ టెంపుల్ నుండి బైక్ ర్యాలీగా మెడికల్ కాలేజీ మీదుగా సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయం చేరుకొని కలెక్టర్ కార్యాలయం ఎదుట తెలంగాణ బాపు కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ముందుగా హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం అంబేద్కర్ విగ్రహానికి, ప్రొఫెసర్, జయశంకర్ సార్ విగ్రహాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేగండ్ర మాట్లాడుతూ.. మారుమూల ప్రాంతంగా ఉన్న భూపాల్ పల్లి జిల్లా కేంద్రంగా అభివృద్ధి చేసి, ప్రజలకు పరిపాలనను చేరువ చేసిన ఘనత కేసిఆర్ కి దక్కుతుందన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాను జనగామ, మహబూబాబాద్, భూపాలపల్లి జిల్లాలుగా విభజించాలనే ఆలోచన కెసిఆర్ కు ముందుగానే ఉందని అప్పట్లో డెక్కన్ క్రానికల్ లో పనిచేసిన సీనియర్ పాత్రికేయుడు కృష్ణారావు తనతో చెప్పినట్టు గుర్తు చేశారు.

2016 అక్టోబర్ 11న కొత్త జిల్లాల ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ చేయడం ద్వారా మారుమూల ప్రాంతాల అభివృద్ధికి కేసీఆర్ బాటలు వేశారని అన్నారు. ప్రొఫెసర్, జయశంకర్ సార్ పేరు మీద జిల్లా ఏర్పాటు చేయడం తెలంగాణ సమాజానికి గర్వకారణం అని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమానికి సలహాలు సూచనలు అందించిన ప్రొఫెసర్, జయశంకర్ పేరును జిల్లాకు పెట్టడం ద్వారా కేసీఆర్ ఆయనకు సముచిత గౌరవం కల్పించారన్నారు. కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో భూపాలపల్లి లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని వివరించారు. జిల్లా కలెక్టరేట్, పోలీసు సూపరిండెంట్ కార్యాలయం, 100 పడకల ఆసుపత్రి, వైద్య కళాశాల, సింగరేణి కార్మికులకు 1000 నూతన క్వార్టర్స్, పేదల కోసం రెండు పడకల గదుల ఇల్లు, డిగ్రీ కళాశాల వంటి నిర్మాణాలు ప్రణాళిక బద్ధంగా చేపట్టినట్టు తెలిపారు. గతంలో కలెక్టర్, ఇతర ఉన్నత అధికారులను కలవాలంటే వరంగల్ వెళ్లాల్సి వచ్చేదని, ఒక్కోసారి రెండు రోజుల సమయం పట్టేదని గుర్తు చేశారు. ప్రస్తుతం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ ను, ఇతర అధికారులలో సులభంగా కలిసి అవకాశం ఏర్పడిందని తెలిపారు. తెలంగాణలో గతంలో 10 జిల్లాలు ఉండగా, కెసిఆర్ ప్రభుత్వం వాటిని 33 జిల్లాలకు విస్తరించి పాలనను ప్రజలకు చేరువ చేసిందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కేసీఆర్ కీలక పాత్ర పోషించారని అందుకే తెలంగాణ ప్రజలు ఆయనను తెలంగాణ బాపుగా భావిస్తున్నారని అన్నారు. జిల్లా ఏర్పాటుకు పదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ప్రజలు గతాన్ని స్మరించుకోవాలని, అభివృద్ధి ప్రస్థానాన్ని గుర్తు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హాజరైన పార్టీ కుటుంబ సభ్యులు, పార్టీ కార్యకర్తలు, మహిళలు, నాయకులు, కృతజ్ఞతలు తెలిపారు.

ఐలాపురం, తోపుచెర్ల గ్రామాల చెరువులను నింపేందుకు ఎమ్మెల్సీ ప్రత్యేక చొరవ

మిర్యాలగూడ అక్టోబర్ 11 (సింగిడి): సాగర్ ఎడమ కాలువ ద్వారా తాగునీటిని విడుదల చేసిన నేపథ్యంలో ఐలాపురం, తోపుచెర్ల గ్రామాల చెరువులను డి-30 కాలువ ద్వారా నింపేందుకు గౌరవ ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఈ సందర్భంగా రైతులతో కలిసి కాలువ వద్దకు వెళ్లి, సంబంధిత అధికారులతో మాట్లాడి గ్రామాల చెరువులకు నీటిని విడుదల చేసి నింపేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామాల్లో పర్యటిస్తూ రైతుల సమస్యలను తెలుసుకుని, గ్రామాల తాగునీటి అవసరాలను తీర్చడంతో పాటు చెరువుల్లో నీరు నిల్వ ఉండేలా కృషి చేశారు. రైతులకు, గ్రామ ప్రజలకు నీటి కొరత తలెత్తకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేసి చెరువులను నింపాలని ఎమ్మెల్సీ సూచించారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రైతుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సూర్య, స్థానిక రైతులు, గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ పండగ శుభాకాంక్షలు తెలిపిన ఎంపీ డాక్టర్ కడియం కావ్య



హన్మకొండ, అక్టోబర్ 11 (సింగిడి): ప్రకృతిని ఆరాధించే గొప్ప పండుగ బతుకమ్మ అని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవానికి, ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ప్రజలందరూ ఆనందోత్సాహాలతో, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఆమె ఆకాంక్షించారు. ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమయ్యే తొమ్మిది రోజుల పూల పండుగను పురస్కరించుకుని వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలందరికీ ఎంపీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రకృతి ఒడిలో విరబూసే తీరొక్క పూలను సేకరించి, అందంగా బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ పాటలు, ఆటలతో మహిళలు జరుపుకునే ఈ పండుగ తెలంగాణ అస్తిత్వానికి, మన సంస్కృతీ వైభవానికి నిలువెత్తు నిదర్శనమని పేర్కొన్నారు. తొమ్మిది రోజుల బతుకమ్మ సంబరాలు ప్రతి ఇంటా ఆనందాన్ని, ప్రతి కుటుంబంలో సంతోషాన్ని, ప్రతి హృదయంలో కొత్త ఆశలను నింపాలని ఎంపీ ఆకాంక్షించారు. పల్లెలు, పట్టణాలు పూల పరిమళాలతో, సంప్రదాయ గీతాలతో కళకళలాడాలని, మహిళలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కోరుకున్నారు.

పోలీసులు డ్యూటీతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్



నల్లగొండ ప్రతినిధి అక్టోబర్ 11 (సింగిడి): 5వ తెలంగాణ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్--2026కు జోనల్ స్థాయి క్రీడా ఎంపికలను ప్రారంభించిన జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ శనివారం 5వ తెలంగాణ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్--2026లో పాల్గొనే క్రీడాకారుల ఎంపికలో భాగంగా యాదాద్రి-ఎ జోన్ స్థాయి క్రీడా ఎంపికలను జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ ప్రారంభించారు. పోలీస్ సిబ్బందిలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి, రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచే క్రీడాకారులను ఎంపిక చేయడమే ఈ జోనల్ స్థాయి ఎంపికల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. క్లస్టర్-ణ పోటీలు నవంబర్ 3 నుంచి 5వ తేదీ వరకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో, క్లస్టర్-జు పోటీలు నవంబర్ 25 నుంచి 28వ తేదీ వరకు నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో భాగంగా వివిధ క్రీడాంశాల్లో పురుషులు, మహిళలకు పోటీలు నిర్వహించనున్నారు. పోలీస్ విధులను సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు క్రీడల్లోనూ రాణించడం ద్వారా సిబ్బందిలో శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, సమయపాలన, జట్టుగా పనిచేసే సామర్థ్యం, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని ఎస్పీ పేర్కొన్నారు. క్రీడలు పోలీస్ సిబ్బందిలో మానసిక ఉల్లాసాన్ని పెంచడంతో పాటు విధి నిర్వహణలో మరింత చురుకుదనాన్ని అందిస్తాయని తెలిపారు. సిబ్బందిలోని క్రీడా ప్రతిభను ప్రోత్సహిస్తూ, రాష్ట్రస్థాయి పోటీల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా పోలీస్ శాఖ అన్ని విధాలుగా ప్రోత్సాహం అందిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమేష్, డీఎస్పీ శ్రీనివాసరావు, ఆర్ఐలు సంతోష్, హరిబాబు, శ్రీను, పోలీస్ క్రీడాకారులు పాల్గొన్నారు.

జిల్లాల విభజన అశాస్త్రీయం

● కేసీఆర్ పదేళ్ల పాలన ప్రజలకు,యువతకు తీరని అన్యాయం జరిగిందని నిరసన

● కేసీఆర్ దిష్టిబొమ్మ దగ్ధం చేసిన కాంగ్రెస్ శ్రేణులు



హన్మకొండ, అక్టోబర్ 11 (సింగిడి): కాకతీయుల చారిత్రక వారసత్వానికి ప్రతీకగా నిలిచిన వరంగల్ మహానగరాన్ని స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం అశాస్త్రీయంగా విభజించి, జిల్లా ప్రజలకు తీరని అన్యాయం చేసిన బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తీరును వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. వరంగల్ జిల్లాల విభజనకు పదేళ్లు పూర్తయిన సందర్భంగా శనివారం వరంగల్ పశ్చిమనియోజకవర్గకాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. డీసీసీ భవన్ నుంచి అశోక జంక్షన్ వరకు కాంగ్రెస్ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించి, వరంగల్ నగరాన్ని రెండు జిల్లాలుగా విభజించిన కేసీఆర్ నిర్ణయానికి నిరసనగా ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు నల్లజెండాలు, నిరసన నినాదాలతో తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాల విభజనకు కాంగ్రెస్ వ్యతిరేకం కాదని, చారిత్రక నేపథ్యం, భౌగోళిక స్వరూపం, ప్రజల అవసరాలు, యువత భవిష్యత్తును పరిగణనలోకి తీసుకోకుండా రాజకీయ ప్రయోజనాల కోసం వరంగల్‌ను విభజించడాన్నే వ్యతిరేకిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. వరంగల్ జిల్లాను అశాస్త్రీయంగా విభజించడం వల్ల ఈ ప్రాంత చారిత్రక ప్రాధాన్యత దెబ్బతినడంతో పాటు, స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు, స్థానికత ఆధారంగా లభించాల్సిన ప్రయోజనాల విషయంలో అనేక సమస్యలు ఎదురయ్యాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాకతీయుల పాలనా వైభవానికి, తెలంగాణ చరిత్రకు సాక్ష్యాలుగా నిలిచిన వరంగల్ కోట, వేయి స్తంభాల దేవాలయం, చారిత్రక కట్టడాలు ఉన్న ఈ ప్రాంతాన్ని పరిపాలనా సౌలభ్యం కంటే రాజకీయ లెక్కలకే ప్రాధాన్యమిస్తూ విభజించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వరంగల్‌కు ఉన్న చారిత్రక, సాంస్కృతిక, పరిపాలనా ప్రాధాన్యతను కాపాడాల్సిన పాలకులే ఆ వారసత్వాన్ని విస్మరించారని మండిపడ్డారు.వరంగల్ నుంచి మొదలయ్యే ప్రజా ఉద్యమాలు రాష్ట్ర రాజకీయాలను ప్రభావితం చేస్తాయనే భయంతోనే ఈ ప్రాంత రాజకీయ ఐక్యతను దెబ్బతీసేలా జిల్లాల విభజనకు పాల్పడ్డారనే విమర్శను ఎమ్మెల్యే నాయిని ఈ సందర్భంగా ముందుకు తెచ్చారు. సిద్ధిపేటకు ప్రాధాన్యత ఇచ్చే క్రమంలో వరంగల్ అభివృద్ధిని విస్మరించారని, ఈ ప్రాంతానికి రావాల్సిన ప్రాధాన్యతను, అవకాశాలను దూరం చేశారని ఆరోపించారు. జిల్లా విభజనతో పరిపాలనా వ్యవస్థలో ఏర్పడిన అసంబద్ధతలు, చారిత్రక గుర్తింపుకు జరిగిన నష్టం ప్రజలు ఇప్పటికీ మరిచిపోలేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు, సంక్షేమ పథకాలను అమలు చేసేందుకు కృషి చేస్తోందని నాయిని పేర్కొన్నారు. మరోవైపు, గత ప్రభుత్వ నిర్ణయాలపై ప్రశ్నలు ఎదురైనప్పుడు వాటికి సమాధానం చెప్పకుండా సోషల్ మీడియా, యూట్యూబ్ ఛానళ్ల ద్వారా దుష్ప్రచారానికి పాల్పడటం రాజకీయ బాధ్యతారాహిత్యమని విమర్శించారు. వరంగల్‌కు జరిగిన అన్యాయంపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడం, ఈ ప్రాంత హక్కులు, అభివృద్ధి, యువత భవిష్యత్తు కోసం పోరాటం కొనసాగించడం కాంగ్రెస్ పార్టీ బాధ్యతగా భావిస్తోందని తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య గారు,డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి , కుడా చైర్మన్ గుండు సుధారాణి,లైబ్రరీ చైర్మన్ అజీజ్ ఖాన్ ,టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి,మాజీ కార్పొరేటర్లు,జిల్లా కమిటీ,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సాంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక బతకమ్మ పండుగ

● ప్రకృతిని ఆరాధిస్తూ, ఆడపడుచుల ఆత్మీయతను చాటే పూల పండుగ బతుకమ్మ

● జిల్లా ప్రజలకు ఎంగిలిపూల బతుకమ్మ శుభాకాంక్షలు

● జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



భూపాలపల్లి, అక్టోబర్ 11 (సింగిడి): తెలంగాణ సాంస్కృతి, సాంప్రదాయాల వైభవానికి, ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ఆరాధనకు ప్రత్యేకగా నిలిచే బతుకమ్మ పండుగను జిల్లా ప్రజలందరూ ఆనందోత్సాహాలతో, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆకాంక్షించారు. ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమయ్యే తొమ్మిది రోజుల బతుకమ్మ ఉత్సవాలను పురస్కరించుకొని శనివారం జిల్లా ప్రజలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రకృతిలో సహజంగా లభించే వివిధ రకాల రంగురంగుల పూలను సేకరించి, అందంగా బతుకమ్మలను పేర్చి చిన్న, పెద్దతేడా లేకుండా మహిళలు ఆట,పాటలతో జరుపుకునే ఈ పండగ తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలకు ప్రత్యేకగా నిలుస్తుందన్నారు. బతుకమ్మ కేవలం పూల పండుగ మాత్రమే కాదని, మహిళల ఆత్మగౌరవం, ఐక్యత, కుటుంబ అనుబంధాలు, ప్రకృతితో మానవాళికి ఉన్న విడదీయలేని అనుబంధాలకు నిదర్శనం అని అన్నారు. తొమ్మిది రోజులపాటు జరిగేఈ బతుకమ్మవేడుకలు ప్రతి ఇంత ఆనందాన్ని నింపాలని, ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. అమ్మవారి ఆశీస్సులతో జిల్లా ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని, జిల్లా మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

బతుకమ్మ వేడుకల అనంతరం గోదావరి తో పాటు చెరువులు, కుంటలు, వాగుల వద్ద నిమజ్జనం చేసే సమయంలో ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. బతుకమ్మ నిమజ్జన ప్రాంతాల వద్ద భద్రత సూచనలు పాటిస్తూ, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు. సాంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత నిస్తు బతుకమ్మ పండుగను సంతోషంగా జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు.

ఓటు హక్కుపై దాడిని ఆపాలి

● మోదీ, అమిత్ షాలకు నియంతల గతే పడుతుంది: సీపీఎం నాయకులు

● జంతర్ మంతర్ వద్ద ఎం.ఏ. బేబీ నిర్బంధంపై నిరసనగా ఆలేరులో దిష్టిబొమ్మ దహనం



ఆలేరు, అక్టోబర్ 11 (సింగిడి): ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించాలని, ఓటు హక్కును తొలగించే విధానాలకు స్వస్తి పలకాలని సీపీఎం జిల్లా నాయకుడు ఎం.ఏ. ఇక్బాల్, మండల కార్యదర్శి దూపటి వెంకటేష్ లు డిమాండ్ చేశారు. శనివారం జంతర్ మంతర్ వద్ద సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం.ఏ. బేబీని నిర్బంధించడాన్ని నిరసిస్తూ ఆలేరు స్థానిక బస్టాండ్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ఆర్ఎస్ఎస్, బీజేపీకి వ్యతిరేకంగా దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రజల మద్దతును కోల్పోయిందని, ఎస్ఐఆర్ (ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ) పేరుతో ఓటర్లను తొలగించే విధానాలు ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగిస్తున్నాయని విమర్శించారు. దేశవ్యాప్తంగా కోట్లాది ఓట్లు తొలగించారన్న ఆరోపణలపై సమగ్ర పరిశీలన జరగాలని కోరారు. ప్రజలను ఓట్లు అడిగి మద్దతు పొందాలి తప్ప, ఓటు హక్కును దెబ్బతీసే చర్యలకు పాల్పడకూడదని అన్నారు. పేద ప్రజలు, కార్మికులు, ప్రజాస్వామ్య హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం.ఏ. బేబీతో పాటు ఇతర నాయకులను నిర్బంధించడం అప్రజాస్వామిక మని వారు పేర్కొన్నారు. ప్రజల హక్కుల కోసం పోరాడేవారిని నిర్బంధించినంత మాత్రాన ఉద్యమాలను ఆపలేరని స్పష్టం చేశారు. ఓటు హక్కు పరిరక్షణ కోసం ప్రజాస్వామ్య శక్తులు చేపడుతున్న పోరాటానికి కేంద్ర ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజలకు స్పష్టత ఇవ్వాలని, ఓటర్ల జాబితా సవరణలో పారదర్శకత పాటించాలని, ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం కల్పించాలని కోరారు. ఎన్నికల సంఘం ప్రధానాధికారి జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని కూడా వారు డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య హక్కులపై దాడులు కొనసాగితే ప్రజలే తగిన రీతిలో స్పందిస్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు మొరిగాడి రమేష్, వడ్డెమాను బాలరాజు, బొమ్మకంటి లక్ష్మీనారాయణ, గనగాని మల్లేష్, ఎం.డి. మతిన్, ఎం.డి. ఖలీల్, వడ్డెమాను విష్ణవ్, గ్యాల భాస్కర్, మొరిగాడి లక్ష్మణ్, గనగాని రాజు, చింతల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



మిర్యాలగూడ, అక్టోబర్ 11 (సింగిడి): డివిజన్ ఆంధ్రప్రభ రిపోర్టర్ గుండెపూరి వెంకన్న మాతృమూర్తి గుండెపూరి రాములమ్మ అనారోగ్యంతో స్వర్గస్థులైన విషయం తెలుసుకున్న మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి శనివారం వ స్వగ్రామమైన అంజనపెల్లి గ్రామానికి వెళ్లి రాములమ్మ పార్థివ దేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.అనంతరం మిర్యాలగూడ మండలం రాయినిపాలెం గ్రామానికి చెందిన మంద సైదులు స్వర్గస్థులైన విషయం తెలుసుకున్న పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు యువతలో స్నేహభావాన్ని పెంపొందిస్తాయి



● మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్

మహాదేవపూర్ అక్టోబర్ 11 (సింగిడి): క్రీడలు యువతలో స్నేహభావాన్ని పెంపొందిస్తాయ ని మంథని మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ పుట్ట మధుకర్ అన్నారు. శనివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలో మాజీ ఉపసర్పంచ్ సల్మాన్ ఖాన్ స్మారక క్రికెట్ టోర్నీ ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు యువతలో ఐక్యత, స్నేహం, స్ఫూర్తిని పెంపొందించడంతోపాటు క్రమశిక్షణ నేర్పుతాయని అన్నారు. సల్మాన్ ఖాన్ మహాదేవుడు గ్రామ అభివృద్ధికి పాటుపడ్డారని, ఆయన పెద్దల పట్ల గౌరవం కలిగిన వ్యక్తిగా అందరితో కలిసి మెలిసి ఉండే వారిని గుర్తు చేసుకున్నారు. అతని తండ్రి మహమూద్ ఖాన్ దుఃఖం తీర్చలేనిదని అతని కుటుంబానికి భగవంతుడు మనోధైర్యం కలిగించాలని కోరుకుంటున్నానని, ఆయన ఆశయాల కొనసాగింపుగా క్రీడలు నిర్వహిస్తున్నామని ఆయన వివరించారు. మహాదేవపూర్ మాజీ సర్పంచ్ శ్రీపతి బాపు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ క్రీడలకు సహకారం అందిస్తున్న ప్రతి ఒక్కరికి అభినందనలు తెలియజేశారు. సల్మాన్ ఖాన్ మరణం తమ పార్టీకి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ పార్టీ నాయకులు కేదారి గీత, పెండ్యాల మనోహర్, తడుకల రమేష్, సాజిత్ అని, సుంకే మధు, వెన్నంపల్లి మహేష్, కూర తోట రాకేష్, సాగర్ల రాజు, అన్నమనేని అరుణ, చిలుక సునీత, మమత, స్వప్న, చంద్రకళ, ఓడేటి రవీందర్, సర్పంచులు పేటలత, ప్రభాకర్, వార్డు సభ్యులు లావణ్య తో పాటు బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉచ్చుకు బలై యువకుడి మృతి!

పండుగ వేళ విషాదం.. మృతదేహం అదృశ్యంపై అనుమానాలు





జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, అక్టోబర్ 11 (సింగిడి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలంలో పండుగ వేళ విషాదం చోటుచేసుకుంది. వన్యప్రాణుల వేట కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ ఉచ్చుకు తగిలి అజంనగర్ గ్రామానికి చెందిన జడల అశోక్ (30) మృతి చెందినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపినట్లు సమాచారం. అయితే, ఘటన జరిగిన ప్రదేశంలో ఉదయం మృతదేహం కనిపించకపోవడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పోడు పనుల కోసం అటవీ ప్రాంతానికి వెళ్లి..

ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. భూపాలపల్లి మండలం అజంనగర్ గ్రామానికి చెందిన ఎనిమిది మంది శుక్రవారం రాత్రి ట్రాక్టర్లతో చెట్లు తొలగించి పోడు చేసేందుకు నిమ్మగూడెం--అజంనగర్ మధ్య ఉన్న అటవీ ప్రాంతానికి వెళ్లారు. ఈ క్రమంలో యామన్‌పల్లి వైపు నుంచి అడవిలోకి వస్తున్న ట్రాక్టర్లు దారి తప్పిపోయాయి. వాటిని పోడు చేసే ప్రాంతానికి తీసుకువచ్చేందుకు నలుగురు వ్యక్తులు ఎదురుగా వెళ్లారు. ఈ సమయంలో జడల అశోక్ విద్యుత్ ఉచ్చుకు తగిలి అక్కడికక్కడే మృతి చెందినట్లు ప్రత్యక్ష సాక్షులు వెల్లడించారు. ఆయన వెంట ఉన్న మరో ముగ్గురు ప్రమాదం నుంచి బయటపడ్డారు.

మృతదేహం అదృశ్యంపై పోలీసుల దర్యాప్తు..

శనివారం ఉదయం ఘటనాస్థలికి వెళ్లి చూడగా అశోక్ మృతదేహం కనిపించకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. దీంతో కాటారం సీఐ నాగార్జునరావు ఘటనాస్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతుడితో పాటు వెళ్లిన ముగ్గురిని విచారించారు. మృతదేహం కనిపించకుండా పోవడానికి గల కారణాలపై పలు కోణాల్లో దర్యాప్తు ప్రారంభించారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల విచారణలో వెల్లడికావాల్సి ఉంది.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు యాదాద్రి జిల్లా బాలికల జట్టు

ఆలేరు బస్టాండ్ నుంచి అశ్వారావుపేటకు పయనం



ఆలేరు, అక్టోబర్ 11 (సింగిడి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో ఈ నెల 10, 11, 12 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి జూనియర్ బాలికల కబడ్డీ పోటీల్లో పాల్గొనేందుకు యాదాద్రి భువనగిరి జిల్లా జట్టు శనివారం ఉదయం ఆలేరు బస్టాండ్ నుంచి బయలుదేరింది. ఈ సందర్భంగా క్రీడాకారులకు పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపి వీడ్కోలు పలికారు. కబడ్డీ అసోసియేషన్ కోశాధికారి గంధమాల కుమార్ తన తల్లి జ్ఞాపకార్థం క్రీడాకారులకు దుస్తులు అందజేశారు. కౌన్సిలర్ యాట శివకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరిచి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం క్రీడాకారులకు అరటిపండ్లు అందజేశారు. ఆలేరు ఎస్‌బీఐ మేనేజర్ శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ కష్టపడి చదువుతోపాటు క్రీడల్లో రాణించే వారికి మంచి భవిష్యత్తు ఉంటుందని పేర్కొంటూ క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పూల నాగేందర్, కార్యవర్గ సభ్యులు అచ్చిన సురేందర్, మంగళగిరి నరేష్, జాతీయ రిఫరీ మరాటి లింగస్వామి, ఆర్గనైజర్ పూల చంద్రకుమార్, ఫ్రెండ్స్ క్లబ్ గౌరవ సభ్యులు ఘనగాని సంపత్‌కుమార్, పారానంది రాహుల్ తేజ, అక్షయ్ పాల్, క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కొత్తగూడెంలో ఇసుక వసూళ్ల కలకలం!

బండ

చైతన్య విద్యానికేతన్ హైస్కూల్లో వైభవంగా బతుకమ్మ సంబరాలు

- ఆటపాటలతో సంబరాలు జరుపుకున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు







కుత్బుల్లాపూర్, అక్టోబర్ 11 (సింగిడి): కుత్బుల్లాపూర్ నియోజక వర్గం జగద్గిరి గుట్ట మగ్దుంనగర్ చైతన్య విద్యా నికేతన్ హై స్కూల్లో వైభవోపేతంగా ఎంగిలిపూల బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకైన ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలను శనివారం రోజున ఎంతో వైభవంగా, కోలాహలంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల చైర్మన్ ట్రస్మా స్టేట్ ప్రెసిడెంట్ శివరాత్రి యాదగిరి ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ వేడుకల సందర్భంగా విద్యార్థినులు, ఉపాధ్యాయురాళ్లు సాంప్రదాయ దుస్తులు ధరించి, రకరకాల రంగురంగుల పూలతో (తంగేడు, గునుగు, బంతి, చామంతి మొదలైనవి) బతుకమ్మలను పేర్చి పాఠశాలకు తీసుకువచ్చారు. అనంతరం విద్యార్థినులు బతుకమ్మల చుట్టూ తిరుగుతూ ఆడుతూ, పాడుతూ కోలాటాలు ఆడారు. ఉపాధ్యాయులు పిల్లలతో కలిసి బతుకమ్మ పాటలు పాడి వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ డా.శృతి విద్య మాట్లాడుతు "తెలంగాణ విశిష్ట సంస్కృతి, ప్రకృతిని పూజించే గొప్ప పండుగ బతుకమ్మ వేడుకలు అన్నారు. మన ఆచార వ్యవహారాలు, సంస్కృతీ సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో ఇలాంటి వేడుకలు ఎంతగానో ఉపయోగపడతాయి" అని పేర్కొన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలోని ప్రశాంత వాతావరణంలో బతుకమ్మలను నిమజ్జనం చేసి, అందరికీ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్స్ శివరాత్రి మంగదేవి,డా.శృతి విద్య, డా. శివరాత్రి నిఖిల్, నిత్య,ప్రిన్సిపాల్ శివరాత్రి సాయి తేజ,ఇంచార్జి గీత,ఉపాధ్యాయులు రాణి, స్వప్న, శరణ్య, కవిత, సవిత, కృష్ణవేణి, సుభాషిణి, ప్రవళిక, విద్యార్థులు, పర్యవేక్షకులు పాల్గొన్నారు.

చిన్నారికి విజయవంతంగా శస్త్రచికిత్స.. మరో రూ.2 లక్షల సాయం

- పాప చదువు బాధ్యత కూడా నాదే..
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



నల్లగొండ ప్రతినిధి అక్టోబర్ 11 (సింగిడి): మూగ, చెవిటి దంపతుల చిన్నారికి మెరుగైన వైద్యం అందించేందుకు రాష్ట్ర రోడ్లు. భవనాలు.సినిమా సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చొరవ తీసుకున్నారు. హైదరాబాద్‌లోని కొండాపూర్ కిమ్స్ ఆసుపత్రిలో చిన్నారికి విజయవంతంగా శస్త్రచికిత్స పూర్తయింది. ఈ సందర్భంగా ఆసుపత్రికి వెళ్లిన మంత్రి పాపను పరామర్శించి, వైద్యులతో మాట్లాడి చిన్నారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. చిన్నారి వైద్య ఖర్చుల కోసం ఇప్పటికే రూ. 2 లక్షల ఆర్థికసాయం అందించిన మంత్రి, తాజాగా మరో రూ. 2 లక్షలను కుటుంబ సభ్యులకు అందజేశారు. చిన్నారి సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకునే వరకు అవసరమైన సహకారం అందిస్తానని తల్లిదండ్రులకు భరోసా ఇచ్చారు.వైద్యుల పర్యవేక్షణతో పాటు స్పీచ్ థెరపీ అందిస్తే చిన్నారి త్వరలోనే మాట్లాడే అవకాశం ఉందని వైద్యులు తెలిపినట్లు సమాచారం. చిన్నారి ఆరోగ్యంగా కోలుకోవడమే కాకుండా, భవిష్యత్తులో ఆమె చదువు బాధ్యతను కూడా తానే తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చారు. ఆపదలో ఉన్న కుటుంబానికి వైద్యసాయం అందించడంతో పాటు చిన్నారి భవిష్యత్తుకు అండగా నిలుస్తానని భరోసా ఇవ్వడం కుటుంబ సభ్యుల్లో ఆశలు నింపింది.

నగరంలో అంగరంగవైభవంగా బతుకమ్మ వేడుకలు

- ప్రకృతి ప్రసాదించిన పూలతో బతుకమ్మలు
- ఆటపాటలతో మహిళా మణుల సంబరాలు



హన్మకొండ, అక్టోబర్ 11 (సింగిడి): గ్రేటర్ వరంగల్ మున్సిపాలిటీ పరిధిలోని ట్రై సిటీలో శనివారం బతుకమ్మ పండగ వేడుకలు అంగరంగ జరిగాయి. ఆశ్వయుజ పితృ అమావాస్య తొలిరోజు నేపద్యంలో హన్మకొండలోని చారిత్రక వేయిస్తంభాల దేవాలయానికి మహిళలు పెద్ద ఎత్తున వేడుకలకు తరలి వచ్చారు. ప్రకృతిలో లభించే వివిధ రకాల పూలతో వివిధ ఆకృతులతో పేర్చిన బతుకమ్మలతో దేవాలయాలే వేదికలుగా మహిళలు ఆటపాటలతో గౌరీదేవిని ఆరాధించారు. ఎంగిలిపూల బతుకమ్మతో పండుగకు శ్రీకారం చుట్టారు. తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా పాటలు పాడుతూ ఎంగిలిపూల బతుకమ్మకు స్వాగతం పలికారు. అమ్మవారికి నైవేద్యంగా నువ్వులు, బియ్యం పిండి, నూకలు కలిపి ప్రసాదం తయారు చేసి తమ వెంట తీసుకు వచ్చి పలువురికి పంచిపెట్టారు. సమీపంలో ఉన్న దేవాలయాలు,చెరువుల వద్ద మహిళలంతా గుమికూడి సమిష్టిగా వేడుకలు జరుపుకున్నారు. బతుకమ్మ కేవలం పూల అలంకరణ మాత్రమే కాకుండా తెలంగాణ గ్రామీణ జీవన విధానాన్ని, స్త్రీల శక్తిని, ప్రకృతి పట్ల గౌరవాన్ని చాటి చెప్పే ఉత్సవంగా భావించారు. ఈ సందర్భంగా బతుకమ్మ పాటలను అందరూ కలిసి ఆలపించడం ఆసక్తిని సంతరించుకుంది. ప్రతి రోజు వేర్వేరు పూలతో వివిధ ఆకృతులతో బతుకమ్మలను తయారు చేసి పూజించడంతో పాటు ప్రత్యేకంగా బతుకమ్మ పాటలు పాడుతూ నిర్వహించే వేడుకలు తెలంగాణ సంప్రదాయానికి ప్రతీకగా నిలుస్తుంది.

ఘనంగా బి.ఆర్.ఎస్ నేత విజయ్ రామిరెడ్డి జన్మదిన వేడుకలు

- శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే వివేకానంద్, ఎమ్మెల్సీ శంబిపూర్





కుత్బుల్లాపూర్, అక్టోబర్ 11 (సింగిడి): కుత్బుల్లాపూర్ నియోజక వర్గం గాజులరామారం సర్కిల్ మల్లారెడ్డి నగర్ లో గదుల రామారావు డివిజన్ బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు డి విజయ్ రామ్ రెడ్డి జన్మదిన వేడుకలు కుటుంబ సభ్యులు ఆత్మీయులు అభిమానులు పార్టీ స్థానిక ముఖ్య నేతల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. విజయరామిరెడ్డి జన్మదిన వేడుకలు సందర్భంగా టిఆర్ఎస్ పార్టీ విప్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ఎమ్మెల్సీ చంబిపూర్ రాజు లను కలిసి వారి ఆశీస్సులు, జన్మదిన శుభాకాంక్షలు అందుకున్నారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులకు విజయ్ రామ్ రెడ్డి దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు, ఆత్మీయులు, అభిమానులు, పార్టీ స్థానిక నేతలందరూ హాజరై శాలువాలు కప్పి పుష్పగుచ్చాలు అందించి, కేకులు కట్ చేసి, మిఠాయిలు తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. విజయరామరెడ్డి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలు సుఖసంతోషాలతో జీవిస్తూ, రానున్న కాలంలో మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించి ప్రజాసేవలో మరింత ఉత్తమ పేరు ప్రఖ్యాతలు సాధించాలని, ప్రజల మధ్య మరెన్నో జన్మదిన వేడుకలను జరుపుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

చిన్నారి ప్రాణం తీసిన బంగారు, వెండి నగలు శుద్ధి చేసే రసాయన పదార్థం

శోకసముద్రంలో మునిగిన చిన్నారి కుటుంబం



కుత్బుల్లాపూర్, అక్టోబర్ 11 (సింగిడి): బంగారు, వెండి పాత నగలను శుభ్రపరిచే రసాయనాలను తిని చిన్నారి మరణించిన సంఘటన జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. జువెలరీ షాపులో రసాయన పదార్థాలని అబ్బము శుభం తెలియని రెండేళ్ల చిన్నారి తిని ప్రాణాలు కోల్పోవడంతో ఆ కుటుంబం శోకసముద్రంలో మునిగింది. పోలీసులు వివరాల ప్రకారం ఓ మహిళ జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధి చింతల్ లోని విష్ణు జువెలరీ షాపులో బంగారం కొనేందుకు తన రెండేళ్ల చిన్నారిని తీసుకొని వెళ్లింది.సదరు మహిళ షాపు యజమానితో బంగారం గురించి మాట్లాడే క్రమంలో చిన్నారి పక్కకు వెళ్లి అక్కడే ఉన్న నగలు మెరుగు పెట్టే కెమికల్ పదార్థాలను నోట్లో పెట్టుకుంది. దీంతో అస్వస్థతకు గురైన ఆ చిన్నారిని కుటుంబసభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. ఆ చిన్నారి చికిత్స పొందుతూ ప్రాణాలు విడిచింది. కండ్ల ముందే విగతజీవిగా మారిపోయిన చిన్నారిని చూసి తల్లిదండ్రులు, కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. చిన్నారి తల్లిదండ్రులు తమకు న్యాయం చేయాలని జువెలరీ షాపు ముందు ఆందోళనకు దిగారు. జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

కిసాన్ బంధు సహకారంతో నూతన వస్త్రాలు బహూకరణ



కొడంగల్, అక్టోబర్ 11 (సింగిడి): 2023లో తండ్రి ఆత్మహత్య,గత సెప్టెంబర్ లో తల్లి అనారోగ్యంతో మృతిచెందడంతో సంతానం అనాథలుగా మారిపోయారు. విషయం తెలుసుకున్న తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి కె.రవీందర్ గౌడ్ కిసాన్ బంధు వ్యవస్థాపకులు స్నేహ, నిశాంత్, సతీష్ లకు తెలియజేయగా హృదయం చలించిన కిసాబంధు సంస్థ వారు శనివారం దుద్యాల గ్రామానికి చేరుకుని తల్లిదండ్రులు లేని నలుగురు పిల్లలకు దసరా పండుగకు కొత్త బట్టలు ధరించాలని 7000 రూపాయలతో నూతన వస్త్రాలు కొనిచ్చారు. తల్లిదండ్రులు లేరనే దిగులుతో ఆత్మస్థైర్యాన్ని కోల్పోరాదనీ, గొప్ప చదువులు చదువుకోవాలని, చదువుకునేందుకు తమవంతు తోడ్పాటు ఎప్పటికీ ఉంటుందని తెలిపారు. ఈకార్యక్రమంలో దుద్యాల ఉపసర్పంచ్, సంజీవ్, ఉపాధ్యాయులు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు

- బతుకమ్మలను ఒకచోట పేర్చి వేడుకల్లో పాల్గొన్న మహిళలు



కుత్బుల్లాపూర్, అక్టోబర్ 11 (సింగిడి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం సర్కిల్ సూరారం డివిజన్ సంజయ్ గాంధీ నగర్ లో లావణ్య ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు అత్యంత వైభవంగా, ఆనందోత్సవాల మధ్య జరిగాయి. ఈ వేడుకల్లో రంగురంగుల పూలతో అలంకరించిన ఎంగిలిపూల బతుకమ్మలను అందంగా అలంకరించి ఒకచోట సమకూర్చి కాలనీలోని మహిళలందరూ సంప్రదాయ దుస్తులను ధరించి ఆనందంగా బతుకమ్మ పాటలు పాడుతూ లయబద్దంగా అడుగులు వేస్తూ వేడుకలు జరుపుకున్నారు. వేడుకల అనంతరం ఎంగిలిపూల బతుకమ్మలను తాత్కాలికంగా ఏర్పాటు చేసిన బతుకమ్మ కొలనులలో ఎంగిలిపూల బతుకమ్మలను నీటిలోకి వదిలి వీడ్కోలు పలికారు. వచ్చే సంవత్సరం వరకు ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో జీవించేలా దీవించాలని గౌరమ్మను, ఎంగిలిపూల బతుకమ్మలను మహిళలు వేడుకున్నారు. అనంతరం వివిధ రకాల ఫలహారాలను మహిళలు ఒకరికొకరు పంచుకొని స్నేహపూర్వక వాతావరణం లో ఎంగిలి పూల బతుకమ్మ వేడుకలను ముగించారు.

క్వారీ గుంతలో పడి... కళాశాల విద్యార్థి మృతి

పిఎస్ లో ఫిర్యాదు చేసిన తల్లి



జవహర్ నగర్, అక్టోబర్ 11 (సింగిడి): ఓ క్వారీ గుంతలో పడి కళాశాల విద్యార్థి మృతి చెందిన సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ హెచ్ ఓ సైదులు తెలిపిన కథనం ప్రకారం.... ముమ్మారెడ్డి ప్రణవ్ సాయి (17) తన తల్లితో జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సాయి ప్రియ కాలనీలో నివసిస్తున్నారు. ప్రణవ్ సాయి నగరంలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఎప్పటిలాగే ఈనెల తొమ్మిదో తారీఖున ఉదయం కళాశాలకు వెళ్ళాడు. తిరిగి అదే రోజు సాయంత్రం సుమారు 5 గంటల సమయంలో ప్రణవ్ సాయి అతని స్నేహితులు మల్కారం క్వారీలో ఈత కొట్టడానికి వెళ్లారని, ప్రణవ్ సాయి స్నేహితులు పోలీసులు ఫోన్ చేసి ప్రణవ సాయి క్వారీలోని నీటిలో ఈత కొడుతూ మునిగి పోయాడని సమాచారం ఇచ్చారు. వెంటనే ముమ్మారెడ్డి హేమలత సంఘటనా స్థలానికి చేరుకొని తన కుమారుడి స్నేహితులను విచారించగా వారందరూ కలిసి ఈత కొట్టడానికి వెళ్ళామని ఈత కొడుతున్న సమయంలో నీటిలో మునిగిపోయాడని తెలిపారు. ఈ మేరకు పోలీసులు, డిఆర్ఎఫ్ బృందాల సహాయంతో క్వారీ గుంతలోని నీటిలో నుండి ప్రణవసాయి మృతదేహాన్ని బయటకి తీశారు. అప్పటికే ప్రణవసాయి మరణించట్లు గుర్తించారు. ఈ మేరకు హేమలత ఘటనపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం..



చింతపల్లి, అక్టోబర్ 11 (సింగిడి): మానవసేవే మాధవసేవ అన్న స్ఫూర్తితో మండల కేంద్రానికి చెందిన యువకులు ఆదర్శ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శనివారం వృద్ధాశ్రమంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వృద్ధులకు భోజనం అందించి తమ సేవా నిరతిని చాటుకున్నారు. కొడిదల శ్రీనివాస్ వృద్ధులకు పండ్లు పంపిణీ చేసి వారి ఆరోగ్యాన్ని ఆకాంక్షించారు.వృద్ధాప్యంలో ఆప్యాయత, ఆదరణతో పాటు అవసరమైన సహాయ సహకారాలు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని యువకులు పేర్కొన్నారు. సమాజంలో వృద్ధుల పట్ల గౌరవభావం పెంపొందించడంతో పాటు, ఆపదలో ఉన్నవారికి అండగా నిలవాలనే ఉద్దేశంతో ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువకుల చొరవపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో వందనపు ఆంజనేయులు, దాచేపల్లి మధు, వి.కె. శ్రీనివాస్, సముద్రాల నగేష్, చెట్లపల్లి హరిప్రసాద్, విగ్రహాల మనుమదాచారి, కొక్కొండ్ల అరుణ్ కుమార్, ఉప్పల యాదయ్య, ఆకారపు శ్రీకాంత్, చిన్నమోని అంజయ్య, నాళ్ల శివకుమార్, ఎన్నం శేఖర్, గోవింద్ రవి తదితరులు పాల్గొన్నారు.

యోగా సాధనకు స్థలం కేటాయించాలని

కొలన్ హన్మంత్ రెడ్డికి వినతి



కుత్బుల్లాపూర్, అక్టోబర్ 11 (సింగిడి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ని శనివారం నిజాంపేట్‌కు చెందిన పతంజలి యోగా టీమ్ వెల్నెస్ అసోసియేషన్ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి, యోగా సాధన, ధ్యానం నిర్వహించేందుకు అనువైన స్థలం కేటాయించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. గత ఎనిమిదేళ్లుగా నిజాంపేట్‌లో యోగా, ధ్యానం, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, ప్రస్తుతం ఎండ, వర్షం, వాహనాల కాలుష్యం, రోడ్డు భద్రత వంటి సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అసోసియేషన్ సభ్యులు వివరించారు. యోగా సాధనకు అనువైన స్థలం కల్పించి తమకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, నిజాంపేట్ సర్కిల్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, పతంజలి యోగా టీమ్ వెల్నెస్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

శివ సాయి హిల్స్ యుజుడి సమస్యకు పరిష్కారం, 37 లక్షలు మంజూరు

కొలన్ హన్మంత్ రెడ్డికి కాలనీ కమిటీ కృతజ్ఞతలు



కుత్బుల్లాపూర్, అక్టోబర్ 11 (సింగిడి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 277వ మహదేవపురం డివిజన్ శివ సాయి హిల్స్ కాలనీలో గత నాలుగేళ్లుగా స్థానిక ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ (యు జి డి)సమస్య పరిష్కారం లభించింది. ఈ సమస్య శాశ్వత పరిష్కారానికి 37 లక్షల నిధులు కులను హనుమంత రెడ్డి కృషితో మంజూ–రయ్యాయి. ఈ సమస్యను కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి దృష్టికి కాలనీవాసులు తీసుకెళ్లగా, ఆయన సంబంధిత అధికారులతో పాటు ఉన్నతాధికారులతో మాట్లాడి, డీఈ దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యను పరిశీలించేలా చొరవ తీసుకున్నారు. అనంతరం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల నిర్మాణానికి కావలసిన నిధులు మంజూరు పత్రం వచ్చింది. 10 రోజుల క్రితం సాంక్షన్ ఆర్డర్ జారీ కాగా, రాబోయే 15--20 రోజుల్లో పనులు పూర్తి చేస్తామని అధికారులు తెలిపినట్లు కాలనీ కమిటీ సభ్యులు వెల్లడించారు. ఈ సందర్భంగా శివ సాయి హిల్స్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులందరూ కొలన్ హన్మంత్ రెడ్డి ని కలిసి, తమ కాలనీలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న యు జి డి సమస్య పరిష్కారానికి చొరవ తీసుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. సమస్య పరిష్కారం దిశగా చర్యలు ప్రారంభం కావడం పట్ల కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శివ సాయి హిల్స్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వికారాబాద్ జిల్లా బెన్నారులో విషాదం

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి దుర్మరణం



వికారాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 11 (సింగిడి): వికారాబాద్ జిల్లా యాలాల్ మండలం బెన్నారు గ్రామానికి చెందిన విద్యార్థి రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో విషాద ఛాయలు అలుముకున్నాయి. గ్రామస్తుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన చంద్రశేఖర్ గౌడ్ ఆలియాస్(చందు) పిల్లల చదువు కోసం హైదరాబాద్ లో స్థిరపడ్డారు. ఈ నేపథ్యంలో సాఫిగా సాగుతున్న వారి కుటుంబంలో తీరని విషాదం నెలకొంది. కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో బెన్నారుకు చెందిన చంద్రశేఖర్ గౌడ్ తనయుడు అఖిల్ (20) రోడ్డు ప్రమాదానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. అఖిల్ ఉదయం జిమ్ కు వెళ్ళి తిరిగి ఇంటికి సూటిపై వెళుతున్న సమయంలో సిలిండర్ లోడ్ తో వెళుతున్న లారీ స్కూటీ ఢీ కొనడంతో కిందపడిపోయిన అఖిల్ పై నుండి లారీ వెనకచక్రాలు ఆయనపై నుండి వెళ్లడంతో ఆయన అక్కడికి అక్కడే ప్రాణాలు వదిలాడు. అల్లారుముద్దుగా పెంచుకున్న ఏకైక కుమారుడు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. కుటుంబ సభ్యుల కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న తీరు పలువురిని కలచివేసింది. దీంతో స్వగ్రామం బెన్నారులో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ మేరకు కీసర పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. లారీ డ్రైవర్ పరారీలో ఉన్నట్లు తెలిసింది.

అంబేద్కర్ సార్వత్రిక విద్యకు సువర్ణ అవకాశం

డిగ్రీ ప్రవేశాలకు అక్టోబర్ 13 చివరి తేదీ

సిఆర్‌పిఎఫ్ స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ కె. హరి శంకర్



జవహర్ నగర్, అక్టోబర్ 11 (సింగిడి): : ఉన్నత చదువుల అభ్యసనానికి దూరవిద్య కేంద్రం (డిస్టెన్స్ ఎడ్యుకేషన్) బిఆర్ఏ ఓయూ కేంద్రం ద్వారా సిఆర్పిఎఫ్ క్యాంపస్ చక్కని సువర్ణ అవకాశం కల్పిస్తుందని అర్హులైన అభ్యర్థులు ఈనెల 13వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలనిసిఆర్పిఎఫ్ పబ్లిక్ స్కూల్ వైస్ ప్రిన్సిపల్ కే .హరిశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ 2026 ఇంకా 2027 విద్యా సంవత్సరానికి సంబంధించి కోర్సులైన బిఏ, బీకాం, బీఎస్సీ డిగ్రీ కోర్సులో ప్రవేశాలకు ఈనెల 13వ తేదీ చివరి తేదీ అని వైస్ ప్రిన్సిపల్ కే. హరిశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు నిర్దిష్ట గడువులోగా ప్రవేశ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని వివరాల కోసం ఈ క్రింది నెంబర్లను సంప్రదించవచ్చునని తెలిపారు. మరిన్ని వివరాలకు 7981837962 లేదా 99590 344 77 నెంబర్లను సంప్రదించాలన్నారు.



ఒక గుడ్డుతో ఇంటి స్టైల్ రెసిపీ..



ఎగ్ రైస్‌కు కావాల్సిన పదార్థాలు:
ఒక కప్పు ఉడికించిన అన్నం, ఇంకా ఒక గుడ్డు, రెండు ఉల్లిపాయలు, నాలుగు పచ్చిమిర్చి, ఇంకా కొద్దిగా కొత్తిమీర, ఒక టేబుల్ స్పూన్ అల్లం వెల్లుల్లి పేస్ట్, ఒక టేబుల్ స్పూన్ కారం, ఒక టేబుల్ స్పూన్ మిరియాల పొడి, రుచికి సరిపడా ఉప్పు, ఇంకా కొద్దిగా బియ్యప్పిండి లేదా రెండు టేబుల్ స్పూన్స్ కార్న్ ఫ్లోర్, దీనికి సరిపడా నూనెను తీసుకోవాలి.

ఎగ్ రైస్ తయారీ విధానం :
ముందుగా ఒక గిన్నెలో కొద్దిగా అన్నాన్ని తీసుకుని దానిలో చేత్తో ఒక ముద్దలా చేసుకోవాలి. దీనిని కొంచం లైట్ గా వేయించుకోవాలి. ఇలా వేయించిన తర్వాత దీనిలో దానిలో గుడ్డు బ్రేక్ వేసి దానిలో బాగా కలపాలి. ఇంకా రెండు ఉల్లిపాయ, పచ్చిమిర్చి, అర కట్ట కొత్తిమీర, ఒక టేబుల్ స్పూన్ అల్లం వెల్లుల్లి పేస్ట్ ను కూడా వేసి కలుపుకోవాలి.

ఒక టేబుల్ స్పూన్ కారం, ఇంకా ఒక టేబుల్ స్పూన్ మిరియాల పొడి, ఇంకా కొద్దిగా ఉప్పు కూడా వేసి కలపాలి. అంతే ఎగ్ రైస్ రెడీ. మీరు ఇంకా దీనితో బియ్యప్పిండి లేదా కార్న్ ఫ్లోర్ వేసి దీనిని ఒక మిశ్రమంలాగా చేసుకుని రైస్ టిక్కీలాగా చేసుకోవాలి. చేతితోనే దీనిని తీసుకుని చిన్న టిక్కీల్లాగా చేసుకుని నూనెలో వేయించుకోవడమే.

ఇక ఇప్పుడు పాన్ లో ఆయిల్ వేసి చేసి వీటిని మీడియం మంటపై గోల్డ్ కలర్లోకి మారే వచ్చే వరకు వేయించాలి. ఇవి బయటకు కరకరలాడుతూ ఉన్నా లోపల మాత్రం మెత్తగా ఉంటాయి ఇవి రుచికి కూడా బెస్ట్. ఈ ఎగ్ రైస్ టిక్కీలు అంత టేస్టీగా ఉంటాయి. అసలు లేట్ చేయకుండా దీనిని ఇంట్లో చేసేయండి.

ఇదే రెసిపిని కొందరు అల్లం పేస్ట్ తో చేస్తారు ఇంకొందరు మాసాల పొడితో చేస్తారు కానీ ఎలా చేసినా కూడా రుచి మాత్రం అదుర్స్. కాబట్టి, సరైన కొలతలతో ఇంట్లో చేసుకుని తినండి అస్సలు మిస్ చేయకండి. ఎప్పుడు ఒక ఫుడ్స్ తిన్నా కూడా అంత టేస్ట్ ఉండదు.

ఐటీ షాక్..



ముంబయి: దేశీయ స్టాక్ మారట్కట్ సూచీలు భారీ నష్టాల్లో ముగిశాయి. ఇరాన్‌తో కాల్పుల విరమణ ఒప్పందాన్ని పొడిగిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ప్రకటించినప్పటికీ.. శాంతి చర్చల అంశం ఇంకా కొలిక్కి రాకపోవడం సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. దీనికితోడు గరిష్ఠ స్థాయిలో క్రూడాయిల్ ధరలు కొనసాగుతుండడం, ఇటీవల లాభాల నేపథ్యంలో మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడం వంటివి ప్రభావం చూపాయి. ముఖ్యంగా ఐటీ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి సూచీలను పడేశాయి. దీంతో సెన్సెక్స్ 750 పాయింట్లకు పైగా నష్టపోగా.. నిఫ్టీ 24,400 దిగువకు చేరింది.
అంతర్జాతీయ మార్కెట్‌ల నుంచి ప్రతికూల సంకేతాలతో సెన్సెక్స్ ఉదయం 79,019.34 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 79,273.33) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల బాటలోనే పయనించింది. ఇంట్రాడేలో 78,442.30 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 756.84 పాయింట్ల నష్టంతో 78,516.49 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 198.50 పాయింట్ల నష్టంతో 24,378.10 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 37 పైసలు క్షీణించి 93.81గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ 10 శాతం మేర నష్టపోయింది. ఇన్ఫోసిస్, మహీంద్రా అండ్ మహీంద్రా, టీసీఎస్, టెక్ మహీంద్రా స్టాక్స్ కూడా నష్టాలు చవిచూశాయి. హిందుస్థాన్ యూనిలీవర్, ఎన్టీపీసీ, ఎటర్నల్, ట్రెంట్, అల్ట్రాటెక్ సిమెంట్ లాభపడ్డాయి.
అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 99 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం 4754 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.
ఐటీ స్టాక్స్ ధమాల్: ఐటీ స్టాక్స్‌లో అమ్మకాలతో నేడు నిఫ్టీ ఐటీ ఇండెక్స్ దాదాపు 4 శాతం మేర నష్టపోయింది. నిన్న నిరుత్సాహకర క్యూ4 ఫలితాలతో పాటు బలహీన భవిష్యత్ అంచనాలను హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ వెలువరించడం ఇందుకు కారణమైంది. దీంతో హెచ్‌సీఎల్ స్టాక్ దాదాపు 11 శాతం మేర పతనం కాగా.. ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, టీసీఎస్ స్టాక్స్ కూడా నష్టాలు చవిచూశాయి. దీంతో సూచీలపై ఒత్తిడి పడింది.

స్టాక్ మార్కెట్ Stock Market



గేములకు తప్పనిసరి రిజిస్ట్రేషన్ చేయాల్సిన అవసరం లేదు

దిల్లీ: నగదుతో ముడిపడిన ఆన్‌లైన్‌గేమ్‌లను నిషేధిస్తూ చట్టం తీసుకొచ్చిన కేంద్ర ప్రభుత్వం.. తాజాగా నిబంధనలను నోటిఫై చేసింది. గతేడాది పార్లమెంట్ ఆమోదం పొందిన ఆన్‌లైన్ గేమింగ్ ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ యాక్ట్‌ను అమలు చేయడానికి అవసరమైన నిబంధనలను కేంద్రం నోటిఫై చేసింది. ఇవి మే 1 నుంచి అమల్లోకి రానున్నాయి. దీంతో పాటు ఆన్‌లైన్ గేమింగ్ అథారిటీని ఏర్పాటుచేస్తూ కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ నిర్ణయం తీసుకుంది. ఏ గేమ్ చట్టబద్ధమైనదో, ఏది కాదో నిర్ణయించే అధికారం ఈ అథారిటీకి ఉంటుంది.

రియల్ మనీ గేములు కాకపోతే చాలా వరకు గేములకు తప్పనిసరి రిజిస్ట్రేషన్ చేయాల్సిన అవసరం లేదని ఐటీ సెక్రెటరీ ఎస్.కృష్ణన్ తెలిపారు. అయితే, ఈస్పోర్ట్స్ గేములు మాత్రం చట్టంలో పేర్కొన్న ప్రకారం రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంటుందని చెప్పారు. ఆన్‌లైన్ మనీ గేమా? సోషల్ గేమా, ఈ-స్పోర్ట్స్ అని నిర్ధారించుకోవడం అనేది పూర్తిగా ఐచ్ఛికమని పేర్కొన్నారు. అథారిటీ ఏదైనా గేమ్‌ను సుమోటోగా చేపట్టడం, ఈస్పోర్ట్స్ గేములు, నిర్దిష్ట సోషల్ గేమ్‌లను కేంద్రం నోటిఫై చేసిన సందర్భాల్లో మాత్రం గుర్తింపును నిర్ధారించుకోవాల్సి ఉంటుందని స్పష్టంచేశారు.

ఆన్‌లైన్ గేమింగ్ అథారిటీ ఏర్పాటు: దేశంలో ఆన్‌లైన్ గేమింగ్ రంగాన్ని క్రమబద్ధీకరించేందుకు ఆరుగురు అధికారులతో అథారిటీని ఏర్పాటు చేసింది. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి చైర్మన్‌గా, ఎక్స్ అఫీషియోగా ఉంటారని కేంద్రం ప్రకటించింది. హోం శాఖ సంయుక్త కార్యదర్శి, ఆర్థిక వ్యవహారాల సంయుక్త కార్యదర్శి, సమాచార ప్రసార శాఖ సంయుక్త కార్యదర్శి, యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ సంయుక్త కార్యదర్శి, న్యాయశాఖ సంయుక్త కార్యదర్శి ఎక్స్ అఫీషియో సభ్యులుగా వ్యవహరిస్తారని పేర్కొంది.



బ్యాంకింగ్ రూల్స్ మార్చిన ఆర్బీఐ.. కొత్త నిబంధనలు ఇవే..

డిజిటల్ చెల్లింపులను మరింత వేగవంతం చేసేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కొత్త రూల్స్ ప్రవేశపెట్టింది. ఆటోమేటిక్ ఇ-మాండేట్ ట్రాన్సాక్షన్లకు సంబంధించి కొత్త నిబంధనలను తీసుకొచ్చింది.

ఇక నుంచి కొత్త కార్డు పొందినప్పుడు పాత కార్డుపై ఉన్న ఇ- మాండేట్ చెల్లింపులు కొత్త కార్డుకు ఆటోమేటిక్‌గా బదిలీ అవుతాయి. ఇ-మాండేట్ చెల్లింపులను సులభతరం చేయడం, సురక్షితంగా కస్టమర్లు నిర్వహించేందుకు ఆర్బీఐ ఈ రూల్స్ ప్రవేశపెట్టింది.

ఈ కొత్త నిబంధనలకు సంబంధించి ఓ ప్రకటన కూడా జారీ చేసింది. కంపెనీలు, వ్యక్తుల నుంచి వచ్చిన సూచనల ఆధారంగా ఇ-మాండేట్ నిబంధనల్లో ఆర్బీఐ మార్పులు చేసింది. ఆటోమేటిక్ చెల్లింపులకు కస్టమర్‌కు నోటిఫికేషన్ పంపినప్పుడల్లా ఫిర్యాదును ఎలా నమోదు చేయాలనే పూర్తి సమాచారాన్ని కూడా ఇవ్వాలని బ్యాంకులకు ఆర్బీఐ సూచనలు చేసింది. అలాగే ఆటోమేటెడ్ చెల్లింపులపై ఆర్బీఐ మరో కీలక నిర్ణయం కూడా తీసుకుంది.

నెలకు రూ.15 వేల వరకు జరిగే ఆటోమేటిక్ చెల్లింపులకు ఎలాంటి ఓటీపీ, పాస్ వర్డ్ అవసరం లేదని ఆర్బీఐ తన ప్రకటనలో తెలిపింది. ఇంతకంటే ఎక్కువ పేమెంట్స్‌కు మాత్రమే ఓటీపీ లేదా పాస్ వర్డ్ ధృవీకరణ అవసరమవుతుందని స్పష్టం చేసింది. ఇక ఓటీసీ సబ్‌స్క్రిప్షన్లు, కరెంట్ బిల్లుల చెల్లింపుల కోసం ఇ-మాండేట్ ఎంచుకున్న వినియోగదారుల నుంచి ఎలాంటి సర్వీస్ ఛార్జీలు లేదా రుసుములు వసూలు చేయవద్దని బ్యాంకులకు ఆర్బీఐ సూచించింది.

ఇక ఇ-మాండేట్ ట్రాన్సాక్షన్లకు సంబంధించి వినియోగదారుల సమస్యలను పరిష్కరించేందుకు పటిష్టమైన ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని బ్యాంకులను ఆదేశించింది. ఇక ఇన్సూరెన్స్ ప్రీమియంలు, మ్యూచవల్ ఫండ్స్ వాయిదాలు, క్రెడిట్ కార్డు బిల్లు చెల్లింపులకు ఓటీపీ లేకుండా రూ.లక్ష వరకు ట్రాన్సాక్షన్ చేయవచ్చని ఆర్బీఐ స్పష్టం చేసింది. డిజిటల్ లావాదేవీలను మరింత వేగంగా నిర్వహించేందుకు ఈ నిర్ణయాలు ఉపయోగపడనున్నాయి.

డిజిటల్ చెల్లింపులు ఇటీవల పెరిగిపోయాయి. ప్రతీఒక్కరి చేతుల్లో స్మార్ట్ ఫోన్ ఉండటంతో నెట్, మొబైల్ బ్యాంకింగ్‌తో పాటు యూపీఐ సౌకర్యాన్ని ఎక్కుమంది ఉపయోగించుకుంటున్నారు. ఈ విధానాల ద్వారా డిజిటల్ విధానంలో చెల్లింపులు చేస్తున్నారు. ఇప్పటివరకు పేమెంట్స్ కోసం ఓటీపీ ఎంటర్ చేయాల్సి వచ్చేది. కానీ ఇక నుంచి రూ.15 వేలలోపు చేసే చెల్లింపులకు అవసరం లేకపోవడం వల్ల వేగంగా లావాదేవీలు చేయవచ్చు

ఇటీవలే మృతి చెందిన కార్మికుడి కుటుంబానికి తోటి విద్యార్థులు ఆర్థిక సహాయం



తొగుట, అక్టోబర్ 11(సింగిడి): సిద్దిపేట జిల్లా తొగుట మండలం గోవర్ధనగిరి గ్రామ పంచాయతీ పరిధిలో ఇటీవల మృతి చెందిన గ్రామ పంచాయతీ కార్మికుడు అయ్యవారి రమేష్(36) కుటుంబానికి తమ పదవ తరగతి మిత్రులు (2005-2006) ఉపాధ్యాయులు కలిసి 50000/రూ- లతో పాటుగా 50/కిలోల బియ్యాన్ని అందజేశారు. అందరితో కలివిడిగా ఉండే రమేష్ మృతి చెందడం అందరినీ కలచివేసిందన్నారు. రమేష్‌కు ఇద్దరు కూతుళ్లు ఉన్నారని వారి భవిష్యత్తు కోసం తమ వంతు సహాయం అందించడం జరిగిందని తోటి విద్యార్థులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పదవ తరగతి మిత్రులు కోతి కర్ణాకర్, మహమ్మద్, సర్దార్, ఉప్పరి రాజు, వెంకటాపూర్ నవీన్, యాదగిరి, బస్సాపూర్ జంగం రాజు, యువకులు పాల్గొన్నారు.

గౌడ యూత్ కు కొత్త సారథ్యం

అధ్యక్షుడిగా పంజాల నాగరాజు ఎన్నిక..
సర్వాయి పాపన్న విగ్రహ ఏర్పాటుకు కృషి



జమ్మికుంట అక్టోబర్ 11(సింగిడి)

హుజురాబాద్ మండలం చెల్పూర్ గ్రామంలోని గౌడ (కౌండిన్య) యూత్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా పంజాల నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా పంజాల అరవింద్, ఉపాధ్యక్షులుగా పంజాల నవీన్, కోశాధికారిగా పంజాల శివ ఎన్నికయ్యారు. జాయింట్ సెక్రటరీగా సుమంత్, కార్యదర్శులుగా కుమార్, తరుణ్ బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ.. గౌడ యూత్ అభివృద్ధికి ఐకమత్యంతో కృషి చేస్తామని తెలిపారు. యువతను సంఘటితం చేస్తూ సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటామని పేర్కొన్నారు. గౌడ జాతి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాల సాధనకు కృషి చేస్తామని వెల్లడించారు. చెల్పూర్ గ్రామంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు తమ వంతు ప్రయత్నం చేస్తామని స్పష్టం చేశారు.

అనుమతి లేని వాహనాలపై పోలీసుల ఉక్కుపాదం

వీణవంక, కొండపాక లో కార్డన్ సెర్చ్..
ఏసీపీ మాధవి పర్యవేక్షణలో తనిఖీలు



జమ్మికుంట, అక్టోబర్ 11(సింగిడి)

మండలంలోని వీణవంక, కొండపాక గ్రామాల్లో పోలీసులు కార్డన్ సెర్చ్‌తో పాటు విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. హుజూరాబాద్ ఏసీపీ మాధవి పర్యవేక్షణలో ఎస్సై ఆవుల తిరుపతి ఆధ్వర్యంలో సుమారు 50 మంది పోలీసు సిబ్బంది ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల గుర్తింపే లక్ష్యంగా తనిఖీలు చేపట్టారు. వీణవంకలో 13 ద్విచక్ర వాహనాలు, 22 ట్రాలీలతో పాటు పలు వాహనాలను పరిశీలించారు. కొండపాకలో 40 ద్విచక్రవాహనాలు, ఒక టాటా ఏస్, ఒక ఇసుక ట్రాక్టర్, రెండు ట్రాక్టర్లు, ఒక ఆటో సహా మొత్తం 45 వాహనాలను తనిఖీ చేశారు.నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాహనాలపై జరిమానాలు విధించడంతో పాటు కొన్ని వాహనాలను సీజ్ చేశారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, గ్రామాల్లో అనుమానాస్పద కార్యకలాపాలు గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అధికారులు సూచించారు.ఈ తనిఖీల్లో హుజూరాబాద్ ఏసీపీ మాధవి, సీఐ పులి వెంకట్, వీణవంక ఎస్సై ఆవుల తిరుపతి శంకరపట్నం ఎస్ఐ శేఖర్ రెడ్డి తో పాటు హుజూరాబాద్, జమ్మికుంట, శంకరపట్నం, హైదాపూర్ పోలీస్ స్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు.

మోకాళ్ల నొప్పులను నిర్లక్ష్యం చేయొద్దు

ఆధునిక చికిత్సతో మెరుగైన జీవన ప్రమాణాలు,
కిమ్స్ వైద్య నిపుణుడు డాక్టర్ సాయి ఫణి చంద్ర



కలీంనగర్, అక్టోబర్ 11(సింగిడి)మోకాళ్ల నొప్పులతో బాధపడేవారు నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వైద్యులను సంప్రదించాలని హైదరాబాద్ కిమ్స్ ఆసుపత్రి ఎముకలు, కీళ్ల వైద్య నిపుణుడు డాక్టర్ సాయి ఫణి చంద్ర సూచించారు. ఆధునిక చికిత్సా విధానాలతో కీళ్ల సమస్యలను నియంత్రించి జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకోవచ్చని తెలిపారు.ప్రపంచ కీళ్లవాతం దినోత్సవం సందర్భంగా కలీంనగర్‌లోని శ్వేతా సాయి ఫణి క్లినిక్‌లో నిర్వహించిన అవగాహనకార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, వయస్సు పెరగడం, కీళ్ల అరుగుదల కారణంగా నడవడం, మెట్లు ఎక్కడం, రోజువారీ పనులు చేసుకోవడంలో ఇబ్బందులు ఎదురవుతాయని వివరించారు.కీళ్ల నొప్పులు ఉన్న ప్రతి ఒక్కరికీ శస్త్రచికిత్స అవసరం లేదని, రోగి ఆరోగ్యపరిస్థితిని బట్టి మందులు, వ్యాయామం, భౌతిక చికిత్స వంటి విధానాలతో పాటు అవసరమైనప్పుడు శస్త్రచికిత్సను సూచిస్తారని తెలిపారు. కీళ్ల అరుగుదల తీవ్రంగా ఉన్నవారికి రోబోటిక్ సహాయక కీళ్ల మార్పిడి శస్త్రచికిత్స ఆధునిక చికిత్సా విధానంగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.డాక్టర్ సాయి ఫణి చంద్రకు 150కి పైగా రోబోటిక్ శస్త్రచికిత్సలు నిర్వహించిన అనుభవం ఉందని నిర్వాహకులు తెలిపారు. శస్త్రచికిత్స అనంతరం వైద్యుల సూచనలు పాటిస్తూ, అవసరమైన భౌతిక చికిత్స చేయించుకోవాలని సూచించారు. కీళ్ల నొప్పులను నిర్లక్ష్యం చేయకుండా నిపుణుల సలహాతో తగిన చికిత్స పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్వేతా సాయి ఫణి క్లినిక్ నిర్వాహకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రజకుల ఐక్యతకు మరో అడుగు..

హక్కుల సాధనకు మరో ముందడుగు..!
దౌల్తాబాద్ మండల కమిటీ ఏర్పాటు
అధ్యక్షుడి గా ముత్యంగారీ స్వామి నియామకం
తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి,
రాష్ట్ర అధ్యక్షుడు గోపి రజక,
రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్ గణేష్ చిన్నరంగారి

దౌల్తాబాద్, అక్టోబర్ 11 (సింగిడి): తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లాలో నిర్వహించనున్న 4వ మహాసభ ఏర్పాట్లలో భాగంగా ఆదివారం దౌల్తాబాద్, మండల కమిటీ ఏర్పాటు చేశామని, ఇప్పటి వరకు 11 మండల కమిటీ లు పూర్తి చేశామని జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దిటి రాజు తెలిపారు.. మండల అధ్యక్షుడు ముత్యంగారి స్వామి (దౌల్తాబాద్), ఆర్. మల్లేశం (దౌల్తాబాద్), ఉపాధ్యక్షులు ముత్యాల శంకర్ (సూరంపల్లి), బిన్నాకుల నరేష్ (దొమ్మాట), ప్రధాన కార్యదర్శి ముత్యంగారి నవీన్ (దౌల్తాబాద్), కోశాధికారి రాములు నర్సింలు (దౌల్తాబాద్), వర్కింగ్ ప్రెసిడెంట్ బిటికుల స్వామి (కోనపూర్) యూత్ అధ్యక్షుడు ముత్యంగారి స్వదేశ్ (దౌల్తాబాద్), సహాయ కార్యదర్శి కమలాకర్ (ఉప్పర్ పల్లి), సోషల్ మీడియా కన్వీనర్ సట్ట బాను(గొడుగుపల్లి)ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులుగోపి రజక, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్ గణేష్ లు మాట్లాడుతూ సిద్దిపేట జిల్లా లో మండల కమిటీ లు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశం రజక సామాజిక వర్గాన్ని ఐక్యంగా సంఘటితం చేయడం, రజకుల హక్కుల సాధన కోసం సమిష్టిగా కృషి చేయడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అవగాహన కల్పించడం, సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా రజకుల అభ్యున్నతికి కృషి చేయడం. ఈ సందర్భంగా రజకులు పెద్ద సంఖ్యలో పాల్గొని, తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి బలోపేతానికి సహకరించాలని రాష్ట్ర నాయకులు పిలుపునిచ్చారు. గ్రామస్థాయి నుంచి మండల, జిల్లా స్థాయి వరకు సంఘాన్ని బలోపేతం చేయడం ద్వారా రజకుల సమస్యలను సంబంధిత అధికారుల, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కార సాధనకు కృషి చేయాలని సమితి లక్ష్యంగా పెట్టుకుందన్నారు.సిద్దిపేట జిల్లాలో జరగనున్న తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి 4వ మహాసభను విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు రావాలని, రజకుల హక్కులు, సంక్షేమం, అభివృద్ధి కోసం సంఘటితంగా పనిచేయాలని ఈ సందర్భంగా కోరుతున్నారు.ఐక్యతే మన బలం... హక్కుల సాధనే మన లక్ష్యం...రజకుల అభ్యున్నతే మన ధ్యేయం!
ముందుకు సాగాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ అధ్యక్షుడు చింతకింది కరుణాకర్, ఉపాధ్యక్షులు ముత్యాల సత్య స్వామి, జూపల్లి నర్సింలు, మండల అధ్యక్షుడు జంగపల్లి రాజమల్లు, మండలం లో ఉన్న రజక నాయకులు పాల్గొన్నారు.



భూంపల్లి – అక్బర్ పేట మండల కమిటీ ఏర్పాటు

మండల అధ్యక్షుడిగా తెల్లకుల యాదగిరి నియామకం



భూంపల్లి – అక్బర్ పేట,అక్టోబర్ 11 (సింగిడి) తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి సిద్దిపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భూంపల్లి-అక్బర్ పేట మండల కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది. మండల అధ్యక్షుడి గా తెల్లకుల యాదగిరి (భూంపల్లి) గౌరవ అధ్యక్షులుగా ముత్తంగి భూదయ్య (జంగపల్లి), కలిపాక నారాయణ (బొప్పాపూర్), ఉపాధ్యక్షులు దాసారం ప్రవీణ్ (ఏనగుర్తి), భూమోల్ల యాదగిరి (పోతరెడ్డిపేట), ప్రధాన కార్యదర్శి మార్కంటి లక్ష్మణ్ (ఖాజీపూర్), కోశాధికారి జప్తి.కిషన్ (మోతే) మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కె. శ్రీకాంత్ (చౌదరిపల్లి), యూత్ అధ్యక్షులు భాను (ఖాజీపూర్) మీడియా కన్వీనర్ లింగంపల్లి స్వామి (వీరరెడ్డిపల్లి) లుగా నియమించడం జరిగిందని జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బిటి రాజు తెలిపారు.ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు గోపి రజక, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్ గణేష్ చిన్నరంగారి లు మాట్లాడుతూ... నవంబర్ లో నిర్వహించే 4వ మహాసభను విజయవంతం చేయాలని నూతన మండల కమిటీ నేతృత్వంలో అధిక సంఖ్యలో పాల్గొనే విధంగా చూడాలని కోరారు.. మహాసభ ఏర్పాటు లో భాగంగా ఇప్పటి వరకు 11 తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి సిద్దిపేట జిల్లా ఆధ్వర్యంలో పూర్తి చేయడం జరిగింది. జిల్లాలో ఉన్న మిగతా మండల కమిటీ లు కూడా పూర్తి చేస్తామని వెల్లడించారు. రజకుల ఐక్యతే మన బలంగా హక్కుల సాధనే మన లక్ష్యంగా రజకుల అభ్యున్నతే మన ధ్యేయంగా ముందుకు సాగాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ అధ్యక్షుడు చింతకింది కరుణాకర్, ఉపాధ్యక్షుడు సత్య స్వామి, చిన్న కోడూరు మండల అధ్యక్షుడు జంగపల్లి రాజమల్లు, మండలంలో ఉన్న రజక నాయకులు పాల్గొన్నారు.

ఓటర్ చోరీ ఆరోపణలకు ఆధారాలేవి?

కాంగ్రెస్ తప్పుడు ప్రచారం మానుకోవాలి: బీజేపీ నేతలు

జమ్మికుంట, అక్టోబర్ 11 (సింగిడి) ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆరోపణలకు ఆధారాలు చూపాలని బీజేపీ హుజురాబాద్ పట్టణ అధ్యక్షుడు తూర్పాటి రాజు, మండల అధ్యక్షుడు పారుపల్లికొండల్ రెడ్డిడిమాండ్ చేశారు.ఆదివారంహుజూరాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం వంటి రాజ్యాంగబద్ధ సంస్థలపై నిరాధార ఆరోపణలు చేస్తూ ప్రజల్లో అపోహలు సృష్టించడం మానుకోవాలని హితవు పలికారు.ఓటరు జాబితాలను పారదర్శకంగా ప్రక్షాళన చేసేందుకే ఎస్ఐఆర్ ప్రక్రియ చేపడుతున్నట్లు తెలిపారు.ఎన్నికల ఫలితాలపై అనుమానాలు వ్యక్తం చేసే ముందు కాంగ్రెస్ నాయకులు తమ ఆరోపణలకు నిర్దిష్ట ఆధారాలు చూపించాలని అన్నారు. ప్రజా సమస్యలపై నిర్మాణాత్మకంగా పోరాడి ప్రజల విశ్వాసాన్ని గెలుచుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ముప్పు మహేష్, తూముల శ్రీనివాస్, గంగిశెట్టి రాజు, తిప్పబత్తిని రాజు, గంట సంపత్, అంకటి వాసు, రావుల పూర్ణం చందర్, పోచంపల్లి సహదేవ్, పెరుమాళ్ల దేవగౌడ్, పెరుమాళ్ల కోటి తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి



సాగుపై మాత్రమే ఆధారపడకుండా, ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపాలని కోరారు.

ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న సర్పంచ్ దంపతులు

పంచాయతీ ఎన్నికల సమయంలో గ్రామ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు సొంత నిధులతో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసిన సర్పంచ్ కనవేని అక్షయ, శ్రీనివాస్ దంపతులను ఎమ్మెల్యే ఈ సందర్భంగా అభినందించారు. గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఖాదర్ గూడెం గ్రామ శాఖ అధ్యక్షుడు అంకుస్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ధ్యావ శ్రీనివాసరెడ్డి, ప్యాక్స్ చైర్మన్ ప్రసాద్ శ్రీనివాసరెడ్డి, సీఐ శ్రీలత, ఏఎంసీ మాజీ చైర్మన్ మరవెల్లి యాదవ్, వైస్ చైర్మన్ రామిడి తిరుమల్‌రెడ్డి, నాయకులు రేమిడి శ్రీనివాసరెడ్డి, మీస సత్యనారాయణ, గొల్లెన కొమురయ్య, పేడ తిరుపతిరెడ్డి, తోట శ్రీనివాస్, బుర్ర చంద్రశేఖర్, కుంభం చిరంజీవి, కనకం అశోక్, కొండ్ర సురేష్, రేవెల్లి రాజలింగం, ముక్కెర సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి

మానకొండూర్, అక్టోబర్ 11(సింగిడి)మారుతున్న వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని మానకొండూరు ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సూచించారు. నీటి వనరులను పొదుపుగా వినియోగించుకుంటూ, తక్కువ నీటితో అధిక ఆదాయం అందించే పంటలను సాగు చేసేందుకు ప్రాధాన్యమివ్వాలని కోరారు. ఆదివారం ఖాదర్‌గూడెం గ్రామంలో కనవేని కొమురయ్య జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పసిఫిక్ మహాసముద్ర ఉపరితల ఉష్ణోగ్రతల్లో చోటు చేసుకుంటున్న మార్పుల కారణంగా ఎల్‌నినో ప్రభావం ఏర్పడే పరిస్థితులు ఉన్నాయని, దీని ప్రభావంతో రానున్న రోజుల్లో వర్షపాతం, నీటి లభ్యతలో మార్పులు చోటుచేసుకునే అవకాశాలున్నాయని పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో రైతులు ఇప్పటి నుంచే అప్రమత్తంగా ఉండాలని, నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. వరి

అభివృద్ధి బాటలో మంచిర్యాల

ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు



మంచిర్యాల, అక్టోబరు 11 (సింగిడి): మంచిర్యాల పట్టణ అభివృద్ధికి మరో ముందడుగు పడనుంది. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతోపాటు, పట్టణానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చేలా ఆర్టీసీ బస్టాండ్‌ను ఆధునిక హంగులతో తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. ప్రస్తుతం ఉన్న తొమ్మిది ప్లాట్‌ఫామ్‌లను 18కి పెంచి, విశ్రాంతి గదులు, షాపింగ్ మాల్ తదితర సౌకర్యాలు కల్పించనున్నారు. మరోవైపు పట్టణంలోని పురాతన శ్రీ విశ్వనాథ ఆలయ పునర్నిర్మాణానికి కూడా కార్యాచరణ చేపట్టారు. ఈ రెండు అభివృద్ధి పనులకు సంబంధించిన నమూనాలను ఆదివారం ప్రజాప్రతినిధులు, పుర ప్రముఖుల పరిశీలనార్థం ప్రదర్శించారు. మంచిర్యాల నియోజకవర్గాన్ని విద్య, వైద్య రంగాలకు హబ్‌గా మారుస్తానని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు తెలిపారు. పట్టణంలోని కాలేజ్ రోడ్డులో ఉన్న పద్మనాయక ఏసీ ఫంక్షన్ హాల్‌లో ఆర్టీసీ బస్టాండ్, శ్రీ విశ్వనాథ ఆలయ పునర్నిర్మాణ నమూనాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మంచిర్యాల ఆర్టీసీ డిపోను పూర్తిస్థాయిలో ఆధునికీకరించి, అన్ని హంగులతో బస్టాండ్‌ను నిర్మించనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం ఉన్న తొమ్మిది ప్లాట్‌ఫామ్‌లను 18కి పెంచడం ద్వారా బస్సుల రాకపోకలకు మరింత వెసులుబాటు కల్పించాలన్నది ప్రణాళిక. ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని విశ్రాంతి గదులు, షాపింగ్ మాల్ తదితర సదుపాయాలను అందుబాటులోకి తీసుకురానున్నారు. పెరుగుతున్న పట్టణ అవసరాలు, ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్టాండ్‌ను అభివృద్ధి చేయడం ద్వారా ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించవచ్చన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. పట్టణంలోని పురాతన శ్రీ విశ్వనాథ ఆలయాన్ని పునర్నిర్మించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. భక్తుల మనోభావాలు, ఆలయ ప్రాధాన్యాన్ని దృష్టిలో ఉంచుకొని దేవాదాయ శాఖ వాస్తుశిల్పి, స్థపతి సూచనల మేరకు నిర్మాణం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఆలయ పునర్నిర్మాణం పూర్తయితే భక్తులకు మెరుగైన వసతులు అందుబాటులోకి రావడంతోపాటు, పట్టణ



ఆధ్యాత్మిక ప్రాధాన్యమూ మరింత పెరిగే అవకాశం ఉంది. సింగరేణి కార్మికులకు ఆదాయపు పన్ను మినహాయింపు కల్పించాలన్నతనవిజ్ఞప్తిపైముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించారని తెలిపారు. అధికారులకు ఆదాయపు పన్ను విషయంలో యాజమాన్యం అనుసరిస్తున్న విధానాన్నే కార్మికులకూ వర్తింపజేయాలని కోరినట్లు చెప్పారు. దీనికి ఆమోదం లభించిందని వెల్లడించారు. అలాగే సింగరేణి వైద్య పరీక్షల నిర్వహణలో పారదర్శకత కోసం కొత్తగూడెంలోనే కాకుండా ఏరియాల వారీగా మెడికల్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్షలు నిర్వహించిన రోజే ఫలితాలు విడుదల చేస్తే అవినీతికి ఆస్కారం ఉండదని అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, మున్సిపల్ కమిషనర్ జి. అన్వేష్, మేయర్ ధర్మ మధుకర్, డిప్యూటీ మేయర్ సల్లా రమ్య, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు, కార్పొరేటర్ తూముల నరేష్, మంచిర్యాల, లక్షెట్టిపేట మార్కెట్ కమిటీల చైర్మన్లు రామగిరి బానేష్ పాల్గొన్నారు.

సద్దుల బతుకమ్మ వేడుకలకు సర్వం సిద్ధం!

ఏర్పాట్లను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్



జమ్మికుంట, అక్టోబర్ 11 (సింగిడి) తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు జమ్మికుంట మున్సిపల్ పాలకవర్గం ఏర్పాట్లు ప్రారంభించింది. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం, నాయిని చెరువు వద్ద మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ కొబ్బరికాయ కొట్టి ఏర్పాట్ల పనులకు శ్రీకారం చుట్టారు. ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమై తొమ్మిది రోజులపాటు సాగే బతుకమ్మ వేడుకల్లో చివరి రోజైన సద్దుల బతుకమ్మ సందర్భంగా జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని 30 వార్డులకు చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ ఆడుకునేందుకు వీలుగా ఏర్పాట్లు చేపడుతున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ.. ప్రకృతిని, పూలను పూజించే విశిష్టమైన పండుగ బతుకమ్మ అని పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే ఈ పూల పండుగను మహిళలు ఆనందోత్సాహాల మధ్య జరుపుకునేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించడం మున్సిపల్ పాలకవర్గం బాధ్యత అని తెలిపారు. సద్దుల బతుకమ్మ వేడుకలకు వచ్చే మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ మున్సిపల్ మేనేజర్ రాజిరెడ్డి కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, పానగంటి రాము పానగంటి విష్ణు కొలుగూరి సురేష్ తూర్పాటి శంకర్ ఎన్విరాన్మెంట్ అధికారి శ్రీకాంత్ కాంట్రాక్టర్ ఓర్సు శ్రీనివాస్ మార్కెట్ డైరెక్టర్ గడ్డం దీక్షిత్ గౌడ్ ఇతర ప్రజా ప్రతినిధులు, సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తా

న్యూ శ్రీనగర్ కాలనీవాసుల ఆహ్వానం
పొరండ్ల సహకార సంఘం నూతన చైర్మన్‌కు అభినందనలు
వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న పటేల్



కరీంనగర్, అక్టోబర్11(సింగిడి)

నగరంలోని 11వ డివిజన్ న్యూ శ్రీనగర్ కాలనీ వాసులు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న పటేల్‌ను ఆయన కార్యాలయంలో కలిసి బతుకమ్మ సంబ రాలకు ఆహ్వానించారు. కాలనీలో రోడ్డు నిర్మాణం, పార్కు అభివృద్ధికి కృషి చేసి నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నరసన్న పటేల్ మాట్లాడుతూ, కాలనీలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతానని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవలందిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

పొరండ్ల సహకార సంఘం చైర్మన్‌కు సత్కారం..

పొరండ్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన తిరుపతి రెడ్డిని ఆకుల నరసన్న పటేల్ శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వైస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన రావుల కృష్ణగౌడ్‌ను కూడా అభినందించారు. నూతన పాలకవర్గం రైతుల సంక్షేమానికి, సహకార సంఘం అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తిమ్మాపూర్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బండారి రమేష్, ముస్లాపూర్ సహకార సంఘం చైర్మన్ రమణారెడ్డి, ఊటూరు సహకార సంఘం చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా వాసవి క్లబ్స్ జోన్ సోషల్ వేడుకలు

ఆరు క్లబ్ ల ప్రతినిధులకు సత్కారాలు..
సేవా కార్యక్రమాలకు ప్రశంసలు
వాసవి సేవా స్ఫూర్తిని చాటిన జోన్ సోషల్



జమ్మికుంట, అక్టోబర్ 11(సింగిడి) వాసవి క్లబ్స్ జోన్--2 ఆధ్వర్యంలో జోన్ చైర్‌పర్సన్ వీఎన్ కేజీసీఎఫ్ అయితు శ్రీనివాస్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన జోన్ సోషల్ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా వైస్ గవర్నర్--1 వీఎన్ కేజీసీఎఫ్ తంగళ్లపల్లి రాజభాస్కర్ ముఖ్య అతిథిగా హాజరై సభ్యులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథి వీసీఐ అధికారిక జెండాను ఆవిష్కరించగా, జోన్ చైర్ పర్సన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు.జోన్ ప్రథమ మహిళ అయితు అనూష జ్యోతి ప్రజ్వలన చేసి వాసవీమాత ప్రార్థన నిర్వహించారు. అనంతరం సభ్యులందరి తో ప్రతిజ్ఞ చేయించారు. ప్రపంచ శాంతిని ఆకాంక్షిస్తూ, స్వర్గస్తులైన వాసవీయన్న ఆత్మశాంతి కోసం ఒక నిమిషం మౌనం పాటించారు. ముఖ్యఅతిథికిజాతీయజెండాను, జోన్ చైర్ పర్సన్‌కువాసవీమాత జెండాను అందజేశారు. హోస్ట్ క్లబ్ వాసవి క్లబ్ జమ్మికుంట అధ్యక్షుడు వీఎన్ కేజీసీఎఫ్ గుడివాడ వెంకట సతీష్ స్వాగతోపన్యాసం చేశారు. కార్యక్రమానికిఐపీసీ గంప సురేందర్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. వీఎన్ కేజీసీఎఫ్ ఆకినపల్లి శ్రీనివాస్ జోన్ చైర్ పర్సన్‌ను పరిచయం చే

అమ్మవారి దయ ఉంటే అన్నీ ఉన్నట్లే!



- దుర్గామాత ఆగమన్ వేడుకల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్‌కుమార్

జమ్మికుంట, అక్టోబర్ 11 (సింగిడి): అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ ఆకాంక్షించారు. జమ్మికుంట పట్టణంలో నిర్వహించిన శ్రీ దుర్గామాత ఆగమన్ వేడుకల్లో ఆయన పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. అమ్మవారి దయ ఉంటే అన్నీ ఉన్నట్లేనని, దుర్గామాత కృపతో ప్రజల జీవితాల్లో సుఖశాంతులు వెల్లివిరియాలని అన్నారు. దేవీ నవరాత్రి ఉత్సవాల్లో యువత భక్తిశ్రద్ధలతో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించడం అభినందనీయమన్నారు. నేటి యువతలో ఆధ్యాత్మిక చింతన, దైవభక్తి పెరుగుతుండటం శుభపరిణామమని పేర్కొన్నారు. దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు భక్తి, ఐక్యత, సోదరభావానికి ప్రతీకలని పేర్కొంటూ, ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, పరస్పర సౌభ్రాతృత్వంతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ప్రజలకు సూచించారు. అమ్మవారి కృపాకటాక్షాలు పట్టణ ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు.

మహాశక్తి ఆలయంలో వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

బాలా త్రిపురసుందరీ దేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు

ధ్వజారోహణంలో పాల్గొన్న కేంద్ర మంత్రి బండి సంజయ్



కరీంనగర్, అక్టోబర్ 11(సింగిడి): నగరంలోని శ్రీ మహాశక్తి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు అమ్మవారు బాలా త్రిపురసుందరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వగా, వేలాది మంది భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని పూలతో సుందరంగా అలంకరించారు. ఉదయం 11 గంటలకు నిర్వహించిన ధ్వజారోహణ కార్యక్రమంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. భవానీ దీక్షాపరులు, భక్తుల కోసం ఆలయ నిర్వాహకులు మధ్యాహ్న భోజనం, సాయంత్రం అల్పాహారం ఏర్పాటు చేశారు. ఈ సేవలు నవరాత్రులు ముగిసే వరకు కొనసాగనున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ సాయంత్రం బ్రహ్మశ్రీ డాక్టర్ గర్రెపల్లి మహేశ్వర శర్మ ఆధ్వర్యంలో 'శ్రీ భాగవత వైభవం'పై ప్రవచనాలు నిర్వహించనున్నారు. రాత్రి 9 గంటలకు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే భక్తి గీతాలతో దాండియా కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమం లో మేయర్ కోలగాని శ్రీనివాస్, డివ్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, బీజేపీ జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి షూస్‌తో వెళ్లడంపై సర్పంచ్‌పై విమర్శలు!

కోరపల్లి శివాలయంలో ఘటనపై గ్రామస్తుల అభ్యంతరం

దైవాన్ని అవమానించడం క్షమించరాని నేరం

ఫిషర్ మెన్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి పింగిలి రాకేష్



జమ్మికుంట, అక్టోబర్ 11 (సింగిడి): మండలంలోని కోరపల్లి గ్రామానికి ప్రథమ పౌరుడిగా ఉండాల్సిన సర్పంచ్.. ప్రజల ఆచారాలు, సంప్రదాయాలను గౌరవిస్తూ ఆదర్శంగా నిలవాల్సిన బాధ్యత లేదా? అంటూ కోరపల్లి సర్పంచ్ కందికట్ట మధుసూధన్ పై ఫిషర్‌మెన్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి పింగిళి రాకేష్ ముదిరాజ్‌తో పాటు పలువురు గ్రామస్థులు విమర్శలు వ్యక్తం చేశారు. కోరపల్లి శివాలయానికి సర్పంచ్ షూస్‌తో వెళ్లడంపై వారు అభ్యంతరం తెలిపారు. ఆలయాలు భక్తి, ఆధ్యాత్మికతకు ప్రతీకలని, అటువంటి పవిత్ర ప్రదేశాలకు వెళ్లేటప్పుడు అక్కడి ఆచారాలు, సంప్రదాయాలను గౌరవించాలని రాకేష్ పేర్కొన్నారు. గ్రామానికి నాయకత్వం వహించే వ్యక్తి తన ప్రవర్తనతో ప్రజలకు ఆదర్శంగా నిలవాలని, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. పదవి హోదా మాత్రమే కాదు.. బాధ్యతాయుత ప్రవర్తన కూడా ముఖ్యమేనని, గ్రామ ప్రథమ పౌరుడిగా సర్పంచ్ వ్యవహారశైలి ప్రజలకు ఆదర్శంగా ఉండాలని వారు అభిప్రాయపడ్డారు. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

బాధితులకు అండగా ఆకుల నరసన్న పటేల్

మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచన

అమీర్ ఖాన్‌కు రూ.4.50 లక్షల ఆర్థికసాయం



కరీంనగర్, అక్టోబర్11 (సింగిడి): నగరంలోని అపోలో, రిచ్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులను వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న పటేల్ ఆదివారం రాత్రి పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని ధైర్యం చెప్పారు. బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. రిచ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అమీర్ ఖాన్‌కు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ. 4. 50 లక్షలు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు తెల్లోని శ్రీనివాస్, సీనియర్ నాయకులు కేకే రాజ్, జిల్లోజి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాలా త్రిపుర సుందరిగా.. దర్శనమిచ్చిన దుర్గమ్మ

- తొలిరోజే తరలివచ్చిన భక్తజనం







సామూహిక సేవాభావం కలగలిసిన ఉత్సవాలు ఇందిరానగర్‌లో ఆధ్యాత్మిక శోభను నింపాయి.

మంచిర్యాల, అక్టోబరు 11 (సింగిడి): శరన్నవరాత్రి శోభతో ఇందిరానగర్ ఆధ్యాత్మిక సందడిని సంతరించుకుంది. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం ఇందిరానగర్‌లోని స్వయంభూ శ్రీ మహంకాళీ దేవస్థానంలో కొలువుదీరిన శ్రీ కనకదుర్గాదేవి అమ్మవారు తొలిరోజు శ్రీ బాలా త్రిపుర సుందరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకునేందుకు భక్తులు వేలాదిగా తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం అమ్మవారి నామస్మరణతో మారోగింది. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన పూజలు, హారతులతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

పసుపు కొమ్ములతో ప్రత్యేక అలంకరణ..

ఈ ఏడాది ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని పసుపు కొమ్ములతో ప్రత్యేకంగా అలంకరించడం ఆకర్షణగా నిలిచింది. సంప్రదాయబద్ధమైన అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారిని చూసి భక్తులు పరవశించారు. మహిళలు ఓడి బియ్యం సమర్పించి, హారతులిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. మరికొందరు తలనీలాలు సమర్పించి అమ్మవారిని దర్శించుకున్నారు. కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని, తమ కోరికలు నెరవేరాలని భక్తులు ప్రార్థించారు.

భవానీ మాలధారణ దీక్షలు..

ఆలయ ప్రధాన అర్చకులు దేవార వినోద్ స్వామి భక్తులకు భవానీ మాలధారణ దీక్షలు చేపట్టి, దీక్షా నియమాలను వివరించారు. భక్తి, నియమ నిష్ఠలతో అమ్మవారిని ఆరాధించాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా ఇన్‌చార్జి అజ్మీరా శ్యామ్‌నాయక్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాలకు వచ్చిన భక్తులకు ఆలయ అధ్యక్షుడు మోదెం తిరుపతిగౌడ్--సుకన్య దంపతులు, గ్రామ సర్పంచి దారావత్ కృష్ణ--అరుణ దంపతులు, ఉప సర్పంచి మిట్ట వెంకటేశ్ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేపట్టారు. శరన్నవరాత్రుల తొలిరోజే పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయం సందడిగా మారింది. భక్తి, సంప్రదాయం, సామూహిక సేవాభావం కలగలిసిన ఉత్సవాలు ఇందిరానగర్‌లో ఆధ్యాత్మిక శోభను నింపాయి.

ప్రకృతి ఒడిలో..30 కి.మీ మారథాన్



మంచిర్యాల, అక్టోబరు 11 (సింగిడి): అడవుల పరిరక్షణ.. పర్యావరణంపై అవగాహన.. ఆరోగ్యకర జీవనశైలికి ప్రోత్సాహం.. ఈ మూడు లక్ష్యాలతో మంచిర్యాల వేదికగా నిర్వహించిన గ్రీన్ ట్రైల్ రన్ విజయవంతమైంది. తెలంగాణ రాష్ట్రంలోనే తొలిసారిగా అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ 30 కి.మీ. మారథాన్‌లో దేశంలోని వివిధ రాష్ట్రాలతోపాటు విదేశాల నుంచి వచ్చిన సుమారు 350 మంది రన్నర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రకృతి ఒడిలో సాగిన ఈ పరుగులు పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను చాటిచెప్పాయి. గ్రీన్ ట్రైల్ రన్‌లో భాగంగా 5, 10, 30 కిలోమీటర్ల విభాగాల్లో పరుగు పందెం పోటీలను నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని తమ పరుగుల నైపుణ్యాన్ని ప్రదర్శించారు. అటవీ సంపద ప్రాధాన్యాన్ని ప్రజలకు తెలియజేయడంతోపాటు, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేయడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం. పరుగు ద్వారా శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకోవచ్చని, ప్రకృతితో మమేకమవుతూ ఆరోగ్యకరమైన జీవనాన్ని అలవర్చుకోవచ్చనే సందేశాన్ని ఈ కార్యక్రమం అందించింది. ఈ కార్యక్రమాన్ని కవ్వాల్ ఎఫ్‌డీపీటీ శాంతారం, ఐఏఎస్ అధికారి, ఐటీడీఏ పీవో మంద మకరందు, మంచిర్యాల జిల్లా న్యాయమూర్తి, జిల్లా అటవీశాఖ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు పర్యవేక్షించారు. పాల్గొన్న రన్నర్లను అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ.. అడవుల సంరక్షణ ప్రభుత్వ శాఖల బాధ్యత మాత్రమే కాదని, ప్రజలందరి భాగస్వామ్యంతోనే పర్యావరణాన్ని కాపాడుకోగలమని పేర్కొన్నారు. పచ్చదనాన్ని పెంపొందించడం, అటవీ సంపదను పరిరక్షించడం, ప్రజల్లో ప్రకృతి పట్ల బాధ్యతను పెంచడం వంటి లక్ష్యాలతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో గ్రీన్ ట్రైల్ రన్‌ను మరింత విస్తృత స్థాయిలో నిర్వహించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రకృతి పరిరక్షణే లక్ష్యంగా.. ఆరోగ్యమే పెట్టుబడిగా సాగిన ఈ పరుగు మంచిర్యాలకు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చింది.

సర్ పేరిట మైనార్టీ ఓట్లు తొలగింపు కక్ష సాధింపు చర్య

ఎస్.ఐ.ఆర్ పై కీలక వ్యాఖ్యలు చేసిన హరీష్‌రావు



సిద్దిపేట, అక్టోబర్, 11 (సింగిడి) : సిద్దిపేట జిల్లాలో పదేళ్ళ పండుగ పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని ఎస్.ఎస్. ఫంక్షన్ హాల్ భారస మైనార్టీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఎస్.ఐ.ఆర్ పేరిట కేంద్ర ప్రభుత్వం భాజపా సర్కారు 13 కోట్ల ఓట్లను తొలగించడం హేమమైన చర్య అని...ఎస్.ఐ.ఆర్ పేరిట అధ్యధిక శాతం మైనార్టీ ఓట్లు తొలగించడానికి కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు.. సీ. ఈ.సీకీ వ్యతిరేకంగా యువత డిల్లీ లో శాంతియుతంగా ఆందోళన చేస్తుంటే డిల్లీ లో కర్ఫ్యూ విధించడం, రైల్వే, మెట్రో, ఇంటర్నెట్ సేవలు నిలిపివేశారని యువతను బెదిరించి, భయపెట్టి, వెళ్ళగొట్టగలరేమో గాని యువత మనసులో ఉన్న వేదనను మోడీ తొలగించలేరన్నారు. సిద్దిపేట లో ఒక్క ముస్లింల ఓటు తొలగించకుండా మన అందరం పనిచేద్దామని హరీష్ రావు సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముస్లింల తరుపున చేసింది ఏమీలేదన్నారు. కేసీఆర్ పదేళ్ల కాలంలో ముస్లిం, మైనార్టీల కోసం ఖర్చు చేసిన నిధుల కంటే చాల తక్కువగా కాంగ్రెస్ ఖర్చు చేసింది అని ఆరోపించారు. ముస్లింల విద్యార్థుల కోసం నాణ్యమైన విద్య అందించారు.

ప్రజల సేవే ధ్యేయంగా కేసీఆర్ పని చేశారని రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 204 టీఆర్ఐస్ పాఠశాలను ఏర్పాటు చేశామని ఎస్సీ.ఎస్టీ. బీసీ. విద్యార్థుల తరహాలోనే ముస్లిం విద్యార్థుల స్కాలర్షిప్ లు అందించిన ఘనత మన కేసీఆర్ కే దక్కుతుందన్నారు. కేసీఆర్ పాలనలో శాంతియుత వాతావరణాన్ని కొనసాగించారని అన్నారు.. ముస్లింల తరుపున హోం శాఖ మంత్రి పదవీ ఇచ్చారనీ గుర్తు చేశారు. మళ్లీ వచ్చేది భారస ప్రభుత్వమే అన్నారు. పార్టీ కోసం పని చేసి కష్టపడే ప్రతి కార్యకర్త లకు రానున్న రోజుల్లో మంచి గుర్తింపు లభిస్తుందని హరీష్ రావు సూచించారు.

భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న వరంగల్ కలెక్టర్



వరంగల్, అక్టోబర్ 11 (సింగిడి): శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద కుటుంబ సమేతంగా ఆదివారం వరంగల్‌లోని శ్రీ భద్రకాళి అమ్మవారి ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు కుటుంబ సమేతంగా విచ్చేసిన జిల్లా కలెక్టర్‌కు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదమంత్రో చ్ఛారణల మధ్య పూజా కార్యక్రమాలు చేపట్టి అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. శరన్నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో భద్రకాళి అమ్మవారి ఆలయం భక్తులతో సందడిగా మారింది. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుంటూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అమ్మవారి ఆశీస్సులతో జిల్లా ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యా లతో ఉండాలని ఆకాంక్షించారు. శరన్నవరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పించేలా ఆలయ పరిపాలన విభాగం అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. భద్రకాళి ఆలయంలో భక్తిభావాన్ని, ఆధ్యాత్మిక చింతనను పెంపొందిం చడంతో పాటు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు దోహదపడుతున్నాయని వారు పేర్కొన్నారు.

రైతుల కష్టాలకు కారణం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమే..

- నీళ్లు, కరెంటు లేక ఎండిపోతున్న పంటలు
- కేసీఆర్ పాలనలో రాష్ట్రం సస్య శామలం
- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి





సిద్దిపేట, అక్టోబర్ 11 (సింగిడి): సిద్దిపేట జిల్లా దశాబ్ది ఉత్సవాల సందర్భంగా మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వ పాలనపై, రైతులు ఎదుర్కొంటున్న సాగునీరు, విద్యుత్ సమస్యలపై ఆయన తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కేసీఆర్ పాలనలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరాతో తెలంగాణ వ్యవసాయ రంగం అభివృద్ధి పథంలో ముందుకు సాగిందని కొత్త ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. నాడు నీటితో కళకళలాడిన పంట పొలాలు నేడు నీళ్లు లేక ఎండిపోతున్నాయని, విద్యుత్ కోతలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సమస్యలను పట్టించుకోకుండా వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెడుతోందని విమర్శించారు. దుబ్బాక నియోజకవర్గ పరిధిలోనే మల్లన్నసాగర్ వంటి భారీ ప్రాజెక్టు ఉన్నప్పటికి స్థానిక రైతులకు సాగునీరు అందకపోవడం దురదృష్టకరమన్నారు. ఒకవైపు పంటలు ఎండిపోతుంటే, మరోవైపు సాగునీటిని మళ్లించే ఆలోచనలు చేయడం రైతుల ప్రయోజనాలకు విరుద్ధమని అన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇప్పటికైనా తన వైఖరిని మార్చుకుని రైతుల పొలాలకు సాగునీరు అందించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మల్లన్నసాగర్ నీటిని దుబ్బాక నియోజకవర్గ రైతులకు అందించేందుకు అవసరమైన ఉపకాల్వలను ఏర్పాటు చేయాలని, వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా కల్పించి ఎండిపోతున్న పంటలను కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు. రైతుల కష్టాలను తక్షణమే పరిష్కరించి, సాగునీరు, విద్యుత్ విషయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని స్పష్టం చేశారు. కేసీఆర్ మార్గదర్శకత్వంలో, హరీశ్‌రావు నాయకత్వంలో సిద్దిపేట జిల్లాను ఏర్పాటు చేసుకుని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడం మనందరి అదృష్టమని కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లా అభివృద్ధిలో సాధించిన ప్రగతి వెనుక కేసీఆర్ దార్శనికత, హరీశ్‌రావు కృషి ఉన్నాయని పేర్కొన్నారు. తెలంగాణ రైతాంగానికి కేసీఆర్ పాలనే నిజమైన భరోసా. తెలంగాణ అభివృద్ధి, రైతుల సంక్షేమం కోసం మళ్లీ కేసీఆర్ నాయకత్వంలోని భారస ప్రభుత్వం రావడం ఖాయమని కొత్త ప్రభాకర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

రెడ్‌క్రాస్ విజేతలకు గంగుల సత్కారం

ప్రజాసేవలను మరింత విస్తరించాలి

మాజీ మంత్రి గంగుల కమలాకర్



కరీంనగర్, అక్టోబర్11(సింగిడి): రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్నికల్లో విజయం సాధించిన అభ్యర్థులు ఆదివారం మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన విజేతలను శాలువాలు కప్పి, పూల మొక్కలు అందించి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. రెడ్‌క్రాస్ సొసైటీ సేవలను అభినందిస్తూ, సామాజిక సేవా కార్యక్రమాలను మరింత విస్తరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ సంఘం లక్ష్మణరావు, ఉపాధ్యక్షుడు ఊట్కూరి రాధాకృష్ణరెడ్డి, ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, కేంద్ర కమిటీ సభ్యుడు కుందారపు మహేశ్వర్, కోశాధికారి గోలి శ్రీనివాస్, నిర్వహణ కమిటీ సభ్యులు పెండ్యాల కేశవరెడ్డి, పెద్ది విద్యాసాగర్, ఎలగందుల మునీందర్, సాయినేని నరేందర్, కనపర్తి మనోహర్‌రావు, మొగులోలు రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికుల సమస్యల కోసం కృషి చేస్తాం

దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి



గజ్వేల్, అక్టోబర్, 11 (సింగిడి): సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణ కేంద్రంలో ప్రజ్ఞా గార్డెన్ లో జిల్లా మాజీ సైనికుల సంక్షేమ సంఘం ద్వితీయ వార్షికోత్సవానికి ఎమ్మెల్సీ డా. వంటేరు యాదవ రెడ్డి, మాజీ ఎఫ్.డీసి చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి లతో కలిసి కొత్త ప్రభాకర్ రెడ్డి హాజరై మాట్లాడారు...దేశ సరిహద్దుల్లో నిరంతరం విధులు నిర్వహించి ప్రజల భద్రత కోసం సైనికులు చేస్తున్న సేవలు మరువలేమన్నారు. వారి కుటుంబలకు దూరంగా ఉంటూ ఎన్నో కష్టాలను ఎదుర్కొని దేశ సేవకు వారి జీవితాలను అంకితం చేసిన సైనికుల త్యాగాల ను మనం గుర్తుంచుకోవాలని సూచనలు చేశారు.. వారు పదవీ విరమణ అనంతరం మాజీ సైనికులు ఎదుర్కొంటున్న పెన్షన్లు, ఆరోగ్య, సేవలు ఉపాధి, తదితర అంశాలపై పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందన్నారు. వారి సమస్యల ను తన దృష్టి కి తీసుకొస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తామని వారికి హామీ ఇచ్చారు. దేశం కోసం సైనికులకు గౌరవంతో పాటు వారి కుటుంబలాకు అండగా నిలబడే విధంగా ప్రతి ఒక్కరూ బాధ్యత గా ఉండాలన్నారు. మాజీ సైనికుల సంక్షేమ సంఘం మరింత బలోపేతనికి సైనికులు కుటుంబాల సంక్షేమానికి సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఈ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అంబేద్కర్ ఆశయ సాధనకు ఐక్యంగా కృషి చేయాలి



మహాముత్తారం, (సింగిడి): అల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం నూతనంగా ఎన్నికైన రాష్ట్ర కమిటీ నాయకులందరికీ మహాముత్తారం మండల అధ్యక్షుడు రామ గిరి రాజు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాల సాధనకు, సామాజిక న్యాయం, సమానత్వం, విద్యాభివృద్ధి, హక్కుల పరిరక్షణకు నూతన కమిటీ నాయకులు ఐక్యంగా కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ మామిడిపల్లి బాపన్న, జాతీయ కోఆర్డినేటర్ ఎస్. వరుణ్ కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు కాదారం వినయ్ కుమార్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకురి మదన్న, రాష్ట్ర కార్యదర్శి లింగాల రామన్నలకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి, యువతలో సామాజిక చైతన్యం పెంపొందించడానికి, బడుగు బలహీన వర్గాల హక్కుల సాధనకు నూతన రాష్ట్ర కమిటీ నాయకులు అంకితభావంతో పనిచేయాలని రామగిరి రాజు కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ జిల్లా చైర్మన్ పీక కిరణ్, అంబేద్కర్ సంఘం మండల గౌరవ అధ్యక్షుడు లింగమళ్ల సడవలి రావు, ప్రధాన కార్యదర్శి లింగమళ్ల శంకర్, సంయుక్త కార్యదర్శి పంగ సురేందర్, కోశాధికారి వేల్పుల రావణ్, సభ్యుడు రామకృష్ణ పాల్గొన్నారు.

అక్రమంగా నీటిని వదిలితే అధికారులకు ఫిర్యాదు చేస్తాం..!



కమలాపూం(సింగిడి):మండల కేంద్రంలోని పెద్ద చెరువు తూము నుండి అక్రమంగా ఎవరైనా నీటిని వదిలి నట్లైతే సంబంధిత శాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తామని గ్రామ సర్పంచ్ పబ్బు సతీష్ హెచ్చరించారు. పెద్ద చెరువు తూము నుండి గుర్తు తెలియని వ్యక్తులు నీటిని వదులి పెడుతున్నారనే సమాచారంతో తూమును శనివారం పరిశీలించారు. అనంతరం గ్రామస్తుల సహకారంతో నీరు బయటకు వెళ్లకుండా షెట్టరకు తాళం వేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ పబ్బు సతీష్ మాట్లాడుతూకమలాపూర్ పెద్ద చెరువు నీరును సుమారు 16 గ్రామాలకు తాగు సాగు కోసం ఉపయోగిస్తారని అన్నారు.నేడు ఉన్న ఎలనినో ప్రభావంతో నీటి ఎద్దడి ఏర్పడినందున, ఎవరైనా అక్రమంగా తూము నుండి నీటిని వదిలేస్తే వారిపై చట్టపరమైన చర్యల కోసం సంబంధిత శాఖల అధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ దుశ్చర్య వల్ల రాబోయే వేసవి కాలంలో త్రాగడానికి నీరు దొరకదని తెలిపారు. ఈ కార్యక్ర మంలో వార్డు సభ్యులు నాగరాజు, మల్లారెడ్డి,పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

దుర్గమ్మా.....కదిలి రావమ్మా!,

విక్రయాలకు సిద్ధంగా ఉన్న అమ్మవారి విగ్రహాలు, నేటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు.



హనుమకొండ, (సింగిడి):కొలువుదీర కదలిరావ మ్మా, కనకదుర్గమ్మ అని అమ్మవారినీ స్మరించుకుంటూ ప్రజలు ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 11వ తేదీ నుంచి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. అందుకోసం నగరంలోని పాత సెంట్రల్ జైలు సమీపంలో అమ్మవారి విగ్రహాలను విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు అమ్మవార్ల విగ్రహాలను కొనుగోళ్లకు ముందస్తుగానే వ్యాపారులకు అడ్వాన్సులు ఇచ్చుకున్నారు.విగ్రహాల విక్రయాలు గత ఏడాదితో పోలిస్తే ఈసారి వాటిధరలు రూ 2వేల నుంచిరూ 3వేల వరకు పెరిగినట్లు నిర్వాహకులు చెబుతున్నారు. నిర్వాహకులు ఆదివారం విగ్రహాలను ప్రతిష్టించి పూజలు నిర్వహించనున్నారు.

సమాచార హక్కు చట్టం సాధన కమిటీ రాష్ట్ర కార్యదర్శిగా భూర్ల రేణు కుమార్

రవీంద్రభారతిలో నియామక పత్రం అందజేత



బిక్కనూర్, (సింగిడి):సమాచార హక్కు చట్టం సాధన కమిటీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా భూర్ల రేణు కుమార్ నియమితులయ్యారు. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించిన సమాచార హక్కు వారోత్సవాల కార్యక్రమంలో కమిటీ వ్యవస్థాపకులు, జాతీయ చైర్‌పర్సన్ చంటి ముదిరాజ్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు.

పూల పండుగలో సంప్రదాయాల సందడి..

రాజీవ్‌నగర్‌లో బతుకమ్మ సంబరాలు!







మహిళలతో కలిసి బతుకమ్మ పేర్చిన కందుల సంధ్యారాణి.. ఆటపాటలతో మార్మోగిన వేడుకలు

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టిన ఎంగిలిపూల బతుకమ్మ ఉత్సవం

గోదావరిఖని,(సింగిడి):తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, పూల పండుగ వైభవానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలు రాజీవ్ నగర్‌లో అంబరాన్నంటాయి. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలు.. మహిళల కోలాహలం.. సంప్రదాయ ఆటపాటలతో కాలనీలో పండుగ వాతావరణం నెలకొంది. లక్ష్మీనగర్ మండల అధ్యక్షురాలు ఊరగొండ అపర్ణ ఆధ్వర్యంలో రాజీవ్ నగర్‌లోని వల్స సుజాత నివాసంలో ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ వేడుకలకు బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి ముఖ్య అతిథిగా హాజరై మహిళల్లో ఉత్సాహాన్ని నింపారు. కాలనీ మహిళలతో కలిసి వివిధ రకాల పూలతో బతుకమ్మను పేర్చి, వారితో కలసి ఆటపాటల్లో పాల్గొన్నారు. మహిళలతో ఆత్మీయంగా మమేకమై పండుగ ఆనందాన్ని పంచుకున్నాతీబతు సందర్భంగా కందుల సంధ్యారాణి మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతికి, మహిళల ఐక్యతకు, ఆడపడుచుల ఆత్మీయ అనుబంధాలకు ప్రతీక అని పేర్కొన్నారు. తరతరాలుగా వస్తున్న పండుగ సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మహిళలంతా ఒకచోట చేరి ఆనందోత్సాహాల మధ్య బతుకమ్మ వేడుకలు నిర్వహించడం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలపై వారికున్న అభిమానానికి నిదర్శనమని తెలిపారు. పూలతో అందంగా పేర్చిన బతుకమ్మల చుట్టూ మహిళలు చేరి సంప్రదాయ పాటలు పాడుతూ, ఆటలాడుతూ వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. పరస్పర ఆత్మీయత, సోదరభావం వెల్లివిరిసిన ఈ కార్యక్రమం రాజీవ్ నగర్‌లో పండుగ శోభను తీసుకొచ్చింది. ఈ కార్యక్రమంలో విజయ, తిరుమల, కనకలక్ష్మి, లచ్చమ్మ, కళావతి, మహేశ్వరి, శ్యామల, పద్మ, సాయిప్రియ, సరిత, కవిత, పావని, శ్వేత, భాగ్య, సంజన, రమ్య, శారద, శాన్వి, యశస్విని, శాన్విక తదితర మహిళలు పాల్గొన్నారు.

రూ: 35.19 కోట్ల పనులకు టెండర్ ప్రక్రియ పూర్తయింది

రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు



మల్యాల, (సింగిడి)::కొండగట్టులో శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానం ద్వారా మంజూరైన రూ 35. 19 కోట్ల నిధులతో చేపట్టబోయే ధర్మసత్రాలు, దీక్ష విరమణ మండపం సంబంధించిన పనులకు టెండర్ ప్రక్రియ పూర్తయిందని పనులు ప్రారంభిం చేందుకు సిద్ధంగా ఉన్నాయని రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు తెలిపారు. శనివారం కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానంలో కుటుంబ సమేతంగా స్వామి వారిని దర్శించుకున్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబరు 15వ తేదీ నుండి 20 వరకు చేపట్టబోయే శ్రీ స్వామివారి చందనోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేపడుతున్నట్లు వివరిస్తూ ఉత్సవాలకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా తగిన సౌకర్యాలకు ఏర్పాట్లు చర్యలు చేపడుతున్నమన్నారు. ఆలయ అధికారులు, పూర్ణకుంభంతో స్వాగతం పలికి వేద మంత్రోచ్చారణల మధ్య ఆశీర్వచనం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈవో అంజన రెడ్డి, హరిహర నాథ్, పర్యవేక్షకులు సునీల్ కుమార్, ప్రధాన అర్చకులు జితేంద్రప్రసాద్, చిరంజీవి స్వామి, మారుతి ప్రసాద్, స్థానాచార్యులు కపిందర్, ఆలయ పరిశీలకులు అశోక్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలి

పెండింగ్ పరిహారం వెంటనే విడుదల చేయాలి

మోకుదెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్.



నల్లబెల్లి, (సింగిడి):రాష్ట్రవ్యాప్తంగా ప్రమాదాలకు గురై గాయపడిన, ప్రాణాలు కోల్పోయిన గీత,కార్మికులకు చెల్లించాల్సిన పెండింగ్ ఎక్స్‌గ్రేషియా నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని గౌడజన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ రాష్ట్రవర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్ డిమాండ్ చేశారు. బాధిత కార్మికులు, మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు. నల్లబెల్లి మండలం శనిగరం గౌడ సంఘం నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన బూర శ్రీనివాస్ గౌడ్‌ను శనివారం శనిగరంలోని శ్రీకంఠ మహేశ్వర ఆలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా అనంతుల రమేష్ గౌడ్, మాజీ ఎంపీపీ కక్కెర్ల శ్రీనివాస్ గౌడ్ ఆయనకు శాలువా కప్పి అభినందనలు తెలిపారు.అనంతరం రమేష్ గౌడ్ మాట్లాడుతూ.. తాటి చెట్లపై నుంచి పడి ప్రమాదాలకు గురైన గీత కార్మికులకు, ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు అందాల్సిన పరిహారం ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉండటం వల్ల వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. గీత వృత్తిపై ఆధారపడి జీవించే కుటుంబాలకు ప్రమాదాలు తీవ్ర ఆర్థిక నష్టాన్ని కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి పెండింగ్ ఎక్స్‌గ్రేషియా చెల్లింపులు పూర్తి చేయాలని, బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం ఉపాధ్యక్షుడు మాదాసు రమేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి ఉట్కూరి శ్రీనివాస్ గౌడ్, సభ్యులు బూర గోపి గౌడ్, బూర తిరుపతి గౌడ్, కక్కెర్ల శ్రీధర్ గౌడ్, కోల జంపయ్య గౌడ్, పెరుమాండ్ల శ్రీనివాస్ గౌడ్, గడ్డమీది శోభన్ గౌడ్, పెరుమాండ్ల కుమారస్వామి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు క్రీడాకారులు సిద్ధం కావాలి

కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తెప్పల దేవేందర్ రెడ్డి

కాటారంలో ఖోఖో శిక్షణ శిబిరం ప్రారంభం



కాటారం, (సింగిడి):రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో క్రీడాకారులు ప్రతిభ కనబరిచి విజయం సాధించాలని కాంగ్రెస్ పార్టీ కాటారం మండల అధ్యక్షుడు తెప్పల దేవేందర్ రెడ్డి ఆకాంక్షించారు. శనివారం కాటారం మండలంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాల (టీటీడబ్ల్యూఆర్ఎస్) ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఖోఖో శిక్షణ శిబిరాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో ఈ నెల 15, 16, 17 తేదీల్లో జరగనున్న తెలంగాణ రాష్ట్ర అండర్-17 జూనియర్ ఖోఖో పోటీల్లో పాల్గొననున్న పెద్దపల్లి జిల్లా జట్టుకు ఈ శిబిరంలో శిక్షణ అందిస్తున్నారు. పాఠశాల పీటీ శ్రీనివాస్, ఉడుత తిరుపతి ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా తెప్పల దేవేందర్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పంతకాని సమ్మయ్య మాట్లాడుతూ.. క్రీడలు కేవలం ఆటలు మాత్రమే కాదని, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, ఐకమత్యం, పోరాట స్ఫూర్తిని పెంపొందించే వేదికలని అన్నారు. ఖోఖో ఆటలో వేగం, చురుకుదనం, సమయస్ఫూర్తితో పాటు జట్టుగా ఆడే నైపుణ్యం ఎంతో ముఖ్యమని తెలిపారు. ఈ శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకొని క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో సమష్టిగా రాణించి ప్రథమ స్థానం సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి అంగజాల అశోక్, కదారి విక్రమ్, కుమార్ యాదవ్, మొగిలి రాజ్ కుమార్ యాదవ్, బొతు శేఖర్, రమణారెడ్డి, గోనె మహేష్, శ్రీనివాస్, ఉడుత తిరుపతి, కిషోర్, నవీన్, షేక్ రహీం తదితరులు పాల్గొన్నారు.

కాటారం పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన అడిషనల్ ఎస్పీ



కాటారం, (సింగిడి): జిల్లా అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్ శనివారం కాటారం పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లోని రికార్డులు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, సీసీ కెమెరాల పనితీరు, స్టేషన్ పరిసరాల పరిశుభ్రతను క్షుణ్ణంగా పరిశీలించారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయడంతోపాటు ప్రతి కేసును నాణ్యతతో దర్యాప్తు చేయాలని అధికారులకు సూచించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించేందుకు అధికారులు, సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాటారం డీఎస్పీ సూర్యనారాయణ, ఎస్సై శ్రీనివాస్ పాల్గొన్నారు.





పుట్టినరోజు వేడుకలకు సేవా స్ఫూర్తి..

పేదల ముఖాల్లో చిరునవ్వులు!

నిరుపేద కుటుంబాలకు, ఆసుపత్రి రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ

ఆడంబరాలకు దూరంగా..

ఆపన్నులకు అండగా సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సయ్యద్ జియా బాయ్

గోదావరిఖని, (సింగిడి):పుట్టినరోజు వేడుకలను సామాజిక సేవకు వేదికగా మార్చుకుంటూ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సయ్యద్ జియా బాయ్ తన ఉదారతను చాటుకున్నారు. గోదావరిఖని అడ్డగుంటపల్లికి చెందిన ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని నిరుపేద కుటుంబాలకు, ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేసి సేవాభావాన్ని చాటుకున్నారు.పుట్టినరోజు వేడుకలను ఆడంబరాలకు పరిమితం చేయకుండా, ఆపదలో ఉన్నవారికి తోడ్పడాలనే ఆలోచనతో సయ్యద్ జియా బాయ్ సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న పేద కుటుంబాలకు ఆహార పదార్థాలు అందించడంతో పాటు, ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రత్యేక రోజుల్లో ఇతరుల జీవితాల్లోనూ ఆనందాన్ని నింపవచ్చనే సందేశాన్ని అందించారు. ఈ సందర్భంగా సయ్యద్ జియా బాయ్ మాట్లాడుతూ.. సమాజంలో పేదరికంతో ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు, అనారోగ్యంతో బాధపడుతున్న రోగులకు తన వంతు సహాయం అందించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. అవసరంలో ఉన్నవారికి అండగా నిలవడం ద్వారా కలిగే సంతృప్తి మరే ఇతర ఆనందంతోనూ పోల్చలేమన్నారు.ప్రతి ఒక్కరూ తమ పుట్టినరోజులు, ఇతర శుభ సందర్భాలను సేవా కార్యక్రమాలతో జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. సమాజంలో మానవతా విలువలు మరింత బలపడాలంటే పేదలకు సహాయం చేయాలనే ఆలోచన ప్రతి ఒక్కరిలో పెంపొందాలని పేర్కొన్నారు. ఆపన్నులకు అండగా నిలుస్తూ, తోటి మనుషుల కష్టాల్లో పాలుపంచుకున్నప్పుడే వేడుకలకు నిజమైన సార్థకత చేకూరుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. పుట్టినరోజు సందర్భంగా చేపట్టిన ఈ సేవా కార్యక్రమం ద్వారా సయ్యద్ జియా బాయ్ సామాజిక బాధ్యతను చాటుతూ ఆదర్శంగా నిలిచారు.

బతుకమ్మ సంబరాల్లో వైశ్య సంఘం సందడి..

నగరేశ్వరాలయం వద్ద పండుగ శోభ



భిక్కనూర్, (సింగిడి):భిక్కనూర్‌లోని నగరేశ్వరా లయం వద్ద వైశ్య సంఘం ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం బతుకమ్మ పాటలు పాడుతూ ఆటపాటలతో సందడి చేశారు. ఈ వేడుకలతో నగరేశ్వరాలయం పరిసరాల్లో పండుగ శోభ సంతరించుకుంది.

పొలంలోకి దూసుకెళ్లిన కారు

బైక్‌ను తప్పించబోయి బోల్తా..

దంపతులు, ఇద్దరు పిల్లలకు స్వల్ప గాయాలు



భీమదేవరపల్లి, (సింగిడి): ఎదురుగా వస్తున్న మోటార్‌సైకిల్‌ను తప్పించబోయిన కారు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న పొలంలోకి దూసుకెళ్లి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న దంపతులు, వారి ఇద్దరు పిల్లలు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ ఘటన మండలం లోని గట్ల నర్సింగాపూర్ స్టేజ్ వద్ద చోటుచేసుకుంది.వివరాల్లోకి వెళ్తే.. హుస్నాబాద్ వైపు నుంచి వస్తున్న అనిల్‌కుమార్, ఆయన భార్య అన్నపూర్ణ, వారి ఇద్దరు పిల్లలు కారులో ప్రయాణిస్తున్నారు. హైదరాబాద్‌లో ఇంటర్మీడియట్ చదువుతున్న తమ కుమార్తెను తీసుకొని స్వగ్రామమైన హుజూరాబాద్‌కు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. గట్ల నర్సింగాపూర్ స్టేజ్ వద్ద ఎదురుగా మోటార్‌సైకిల్ రావడంతో దానిని తప్పించేందుకు ప్రయత్నించగా కారు అదుపుతప్పి పొలంలోకి దూసుకెళ్లి బోల్తాపడింది. ప్రమాదంలో కారులో ఉన్న నలుగురికి స్వల్ప గాయాలు కావడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనతో స్థానికంగా కొద్దిసేపు ఆందోళన నెలకొంది.

గడువు ముగిసినా క్వారీలో మైనింగ్ !

తెలిసినా పట్టించుకోని అధికారులెవరు ?

నాలుగుసార్లు గడువిచ్చినా పూర్తికాని ట్రెంచ్‌లు..

ముగ్గురు కార్మికులు గాయపడినా మారని తీరు !

పెద్దపల్లి, (సింగిడి):గడువు ముగిసినప్పటికీ క్వారీల్లో పనులు కొనసాగుతున్న విషయంలో మైనింగ్ శాఖ అధికారుల పర్యవేక్షణపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. క్వారీల చుట్టూ ట్రెంచ్‌లు ఏర్పాటు చేయాలని ఇప్పటికే నాలుగుసార్లు గడువు ఇచ్చినా పనులు పూర్తికాకపోవడం, మరోవైపు సంబంధిత క్వారీ అనుమతుల గడువు ముగిసినా తవ్వకాలు కొనసాగుతున్నాయన్న ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయి. అనుమతుల గడువు ముగిసినప్పటికీ తవ్వకాలు కొనసాగుతున్నాయన్న విషయం అధికారుల దృష్టికి వచ్చిందా ? వచ్చినట్లయితే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్న ప్రశ్నలు స్థానికంగా వినిపిస్తున్నాయి. శుక్రవారం క్వారీలో జరిగిన ప్రమాదంలో ముగ్గురు కార్మికులు గాయపడటంతో భద్రతా చర్యలపై మరోసారి చర్చ మొదలైంది.

పూర్తికాని ట్రెంచ్‌లు !

క్వారీల లీజ్ గడువు ముగిసాక ట్రెంచ్‌లు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అయినప్పటికీ ట్రెంచ్ పనులు పూర్తికాకపోవడంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. గడువులు విధిస్తున్నా నిర్దేశించిన పనులు ఎందుకు పూర్తికావడం లేదన్నది ప్రశ్నార్థకంగా మారింది. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టి, పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టారన్న దానిపై స్పష్టత రావాల్సి ఉంది.

అనుమతుల గడువు ముగిసినా తవ్వకాలా ?



సంబంధిత క్వారీ అనుమతుల గడువు ముగిసినప్పటికీ మైనింగ్ కార్యకలాపాలు కొనసాగుతున్నాయన్న ఆరోపణలు చర్చనీయాంశమయ్యాయి. ప్రస్తుతం జరుగుతున్నతవ్వకాలకు చెల్లుబాటయ్యే అనుమతులు ఉన్నాయా ? గడువు ముగిసిన అనుమతులను పొడిగించారా ? అనే అంశాలను అధికారులు స్పష్టం చేయాల్సి ఉంది. అనుమతుల గడువు ముగిసినప్పటికీ తవ్వకాలు కొనసాగుతున్నట్లు నిర్ధారణ అయితే, అందుకు బాధ్యులెవరు ? వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు ? నిబంధనల అమలులో నిర్లక్ష్యం వహించిన అధికారుల బాధ్యతను కూడా పరిశీలిస్తారా ? అన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.

మైనింగ్ శాఖ పర్యవేక్షణ ఏది ?

ఒక వైపు ట్రెంచ్‌ల ఏర్పాటుకు గడువు ఇచ్చినా పనులు పూర్తికాకపోవడం, మరోవైపు క్వారీ అనుమతుల గడువుపై ఆరోపణలు రావడం మైనింగ్ శాఖ పర్యవేక్షణ తీరుపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. క్వారీ అనుమతులు, లీజు పత్రాలు, వాటి గడువు వివరాలు, తనిఖీ నివేదికలు, ట్రెంచ్‌ల ఏర్పాటుకు ఇచ్చిన గడువులకు సంబంధించిన రికార్డులను ఉన్నతాధికారులు పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి వాస్తవ పరిస్థితులను వెల్లడించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

చర్యలు ఎప్పుడు ? బాధ్యత ఎవరిది ?

గడువు ముగిసినప్పటికీ క్వారీల్లో పనులు కొనసాగుతున్న, క్వారీ అనుమతుల గడువు ముగిసినప్పటికీ కార్యకలాపాలు కొనసాగుతున్నాయన్న ఆరోపణలపై మైనింగ్ శాఖ అధికారులు అధికారికంగా స్పందించాల్సిన అవసరం ఉంది. నిబంధనల ఉల్లంఘనలు నిర్ధారణ అయితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. ట్రెంచ్‌ల ఏర్పాటులో జాప్యానికి కారణాలను గుర్తించి, భద్రతా చర్యలు పూర్తయ్యేలా చూడాలి. ఇప్పటికే ముగ్గురు కార్మికులు గాయపడిన నేపథ్యంలో మరో ప్రమాదం జరగకముందే సంబంధిత శాఖలు అప్రమత్తమై తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఇప్పటికే ట్రెంచ్ పనులపై సమాచారం ఇచ్చాం...

- పాలకుర్తి తహశీల్దార్ జె.సునీత

క్వారీల చుట్టూ ట్రెంచ్‌లు ఏర్పాటు చేయాలని మైనింగ్ అధికారులకు ఇప్పటికే పలు మార్లు సమాచారం ఇచ్చాం. అయినప్పటికీ ట్రెంచ్‌ల ఏర్పాటు విషయంలో వారి నుంచి తగిన స్పందన రాలేదు. గడువు పూర్తయిన క్వారీలను నిర్వహిస్తే చర్యలు తీసుకుంటాం.

ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ సంబురాలు!

తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీకగా బతుకమ్మ. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి.ఆటపాటలతో సందడి చేసిన మహిళలు.

డోర్నకల్/మరిపెడ (సింగిడి): మరిపెడ మండలం ఎల్లంపేట గ్రామపంచాయతీ ప్రభుత్వ పాఠశాల ఆవరణంలో గ్రామ సర్పంచ్ గండి రాధమ్మ అధ్వారంలో ఎంగిలి పూల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కృష్ణ ఫౌండేషన్ సంధ్య సమక్షంలో బహుజన బతుకమ్మ వేడుకలకు సింగర్ విప్లవకారులు విమలక్క ముఖ్యఅతిథిగా పాల్గొని మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. విమలక్క రాకతో ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు సంబరాలతో అంబరానంటాయి. తెలంగాణసంస్కృతి,సంప్రదాయాలు,ఆడపడుచుల ఆత్మీయతకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సంబురాలు మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలో ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి.ప్రకృతిని పూల రూపంలో ఆరాధిస్తూ,సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ మహిళలు తొలి రోజు ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి,అందంగా అలంకరించి పండుగ సందడిని చాటిచెప్పారు.

ప్రకృతిని ఆరాధించే పూల పండుగ బతుకమ్మ!

బతుకమ్మ అంటే కేవలం పూలను పేర్చి ఆడుకునే పండుగ మాత్రమే



కాదు..ప్రకృతితో మానవ జీవనానికి ఉన్న అనుబంధాన్ని చాటిచెప్పే గొప్ప సాంస్కృతిక వేడుక. తెలంగాణ నేలపై విరబూసే తంగేడు,గునుగు,బంతి తదితర పూలతో బతుకమ్మలను అందంగా పేర్చడం ఈ పండుగ ప్రత్యేకత. ప్రకృతి ప్రసాదించిన పూలను పూజిస్తూ,పచ్చదనం ప్రాధాన్యతను గుర్తుచేస్తూ తరతరాలుగా ఈ పండుగను జరుపుకుంటున్నారు.

ఆడపడుచుల ఆత్మీయతకు ప్రతీక.. బతుకమ్మ!

తొమ్మిది రోజులపాటు వివిధ రూపాల్లో బతుకమ్మను పూజిస్తూ మహిళలు సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ,చప్పట్లు కొడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొంటారు. కుటుంబ సభ్యుల క్షేమం,ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని అమ్మవారిని ప్రార్థిస్తారు.కులమతాలకు అతీతంగా మహిళలంతా ఒకచోట చేరి జరుపుకునే ఈ వేడుకలుఐక్యతకు,సోదరభావానికి,సామాజిక బంధాలకు ప్రతీకగా నిలుస్తాయి.

తెలంగాణ అస్తిత్వానికి ప్రతిబింబం..బతుకమ్మ!

తెలంగాణ ప్రత్యేకతను ప్రపంచానికి చాటిచెప్పే పండుగల్లో బతుకమ్మకు విశిష్ట స్థానం ఉంది.తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మల చుట్టూ మహిళలు చేసే సందడి,మార్మోగే జానపద గీతాలు తెలంగాణ పల్లె సంస్కృతికి అద్దం పడతాయి.ఆధునిక కాలంలోనూ ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ భావితరాలకు మన సంస్కృతి,వారసత్వాన్ని పరిచయం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత.భక్తి,ప్రకృతి ప్రేమ,కుటుంబ అనుబంధాలు,మహిళల ఐక్యత కలగలిసిన బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రజల జీవనశైలిలో విడదీయలేని భాగంగా నిలుస్తోంది.మరిపెడ మండలంలో ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమైన ఈ సంబురాలు రానున్న రోజుల్లో మరింత సందడిగా సాగనున్నాయి.తెలంగాణ ఆడపడుచుల ఆనందోత్సాహాల మధ్య బతుకమ్మ పండుగ పల్లెల్లో పండుగ శోభను నింపుతోంది..

పని ప్రదేశంలో బతుకమ్మ వేడుకలు



ధర్మారం (సింగిడి):మండలంలో కిలవనపర్తి నర్సింగాపూర్ గ్రామాలలో ఉపాధి హామీ ప్రదేశంలో ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు ఆ గ్రామ సర్పంచులు మోతే కనకయ్య, బంగుటపు కొమురయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచులు మాట్లాడుతూ ప్రపంచంలో మరిక్కడ లేనివిధంగా తెలంగాణ ఆడబిడ్డలు మాత్రమే జరుపుకొని పూల పండగ బతుకమ్మ అని అన్నారు పండుగలొ మన సంస్కృతి సాంప్రదాయం దాగి ఉన్నాయని మనమందరం బాధ్యత ఈ సాంప్రదాయాన్ని కాపాడుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బొట్ల వనపర్తి ఉప సర్పంచ్ మోతే కావ్య వెంకటస్వామి ఫీల్డ్ అసిస్టెంట్ రాజయ్య , ఆయా గ్రామ ఆడపడుచులు పాల్గొన్నారు.

పెద్దపల్లిలో కమలం వికసించకుంటే గుండు కొట్టించుకుంటా!

బీజేపీ గెలుపుపై జిల్లా అధ్యక్షుడు కర్ర సంజీవ రెడ్డి సంచలన సవాల్..

కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై తీవ్ర విమర్శలు

ఎస్టీ మోర్చా జిల్లా నూతన కమిటీ ప్రకటన..

గిరిజనుల సంక్షేమమే లక్ష్యంగా పదాధికారుల నియామకం

పెద్దపల్లి, (సింగిడి): రాబోయే ఎన్నికల్లో పెద్దపల్లి నియోజకవర్గంలో బీజేపీ విజయం సాధించకపోతే గుండు కొట్టించుకుంటానని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కర్ర సంజీవ రెడ్డి సంచలన సవాల్ విసిరారు. పెద్దపల్లి గడ్డపై కమలం జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని, ప్రజల్లో బీజేపీకి ఆదరణ పెరుగుతోందని పేర్కొన్నారు. శనివారం పెద్దపల్లిలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో సంజీవ రెడ్డి మాట్లాడారు. దేశవ్యాప్తంగా బీజేపీ సాధిస్తున్న విజయాలు తెలంగాణలోనూ పార్టీ అధికారంలోకి వస్తుందనే నమ్మకాన్ని కలిగిస్తున్నాయని తెలిపారు. పెద్దపల్లి, రామగుండం, కాజీపేట, వరంగల్, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లోరైల్వే స్టేషన్ల ఆధునికీకరణకు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తోందని వివరించారు.

గ్రూపు రాజకీయాలకు తావివ్వొద్దు...

పార్టీ అభ్యర్థుల ఎంపిక విషయంలో నాయకులు, కార్యకర్తలు వ్యక్తిగత విభేదాలు, గ్రూపు రాజకీయాలకు దూరంగా ఉండాలని సంజీవ రెడ్డి పిలుపునిచ్చారు. అధిష్ఠానం ఎవరికి టికెట్ కేటాయించినా, పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా అందరూ ఐక్యంగా పనిచేయాలని సూచించారు.కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై ఆయన తీవ్ర విమర్శలు చేశారు. ఆ పార్టీలు కులాల ప్రాతిపదికన రాజకీయాలు చేస్తున్నాయని ఆరోపించారు. బీసీలు, పేదలు, బడుగు బలహీన వర్గాలకు నిజమైన న్యాయం చేయగల పార్టీ బీజేపీ మాత్రమేనని పేర్కొన్నారు. కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలకు అభివృద్ధిపై స్పష్టమైన అవగాహన, విధానాలు లేవని విమర్శించారు.

ఓటర్ల జాబితా ప్రక్షాళనను వ్యతిరేకించడం ఎందుకు?

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ఆరోపణలను బీజేపీ నేతలు ఖండించారు. మృతుల పేర్లతో కొనసాగుతున్న ఓట్లు, నకిలీ ఓట్లను తొలగించే చర్యలను కాంగ్రెస్ ఎందుకు వ్యతిరేకిస్తోందని ప్రశ్నించారు. ఓటర్ల జాబితా ప్రక్షాళనను రాజకీయ వివాదాలకు వేదికగా మార్చడం సరికాదని వ్యాఖ్యానించారు.

బీజేపీ ఎస్టీ మోర్చా జిల్లా కమిటీ నియామకాలు...

సమావేశంలో బీజేపీ ఎస్టీ మోర్చా పెద్దపల్లి జిల్లా నూతన కమిటీ పదాధికారులను జిల్లా అధ్యక్షుడు కర్ర సంజీవ రెడ్డి, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు అరుణ్ రామ్ జా ప్రకటించారు. గిరిజనుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణతో పాటు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా నియామకాలు చేపట్టినట్లు తెలిపారు.నూతన కమిటీలో జిల్లా ఉపాధ్యక్షులుగా జి. సురేష్ నాయక్, లింగం నాయక్, విజయ; ప్రధాన కార్యదర్శులుగా జి. రమేష్, బలవంత్ అనిల్ నాయక్, కార్యదర్శులుగా ఎస్లావత్ శ్రీనివాస్, రాజేష్ రాథోడ్, సమయ్యలను నియమించారు.జిల్లా సోషల్ మీడియా కన్వీనర్లుగా ఎస్లావత్ సతీష్, నేనావత్ అరుణ్ కుమార్; టూర్ అండ్ మానిటరింగ్ కన్వీనర్‌గా లావుడ్యా రాజేష్; మన్ కీ బాత్ కన్వీనర్‌గా అజ్మీరా కిరణ్‌ను నియమించి నియామక పత్రాలు అందజేశారు. నూతన పదాధికారులు పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేయాలని నాయకత్వం సూచించింది. ఎస్టీ మోర్చాను గ్రామస్థాయి నుంచి బలోపేతం చేస్తూ గిరిజనుల సంక్షేమానికి కృషి చేయాలని, పార్టీ సిద్ధాంతాలు, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీజేపీ ముఖ్య నాయకులు, యువమోర్చా ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



జ్ఞానేశ్ కుమార్‌ను సీఈసీ పదవి నుంచి తొలగించాలి

ఎస్ఐఆర్ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలి..

సీపీఎం జిల్లా కార్యదర్శి బి.రెడ్డి సాంబశివ డిమాండ్

ములుగు ప్రతినిధి, (సింగిడి):ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను తక్షణమే నిలిపివేసి, దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని సీపీఎం ములుగు జిల్లా కార్యదర్శి బి.రెడ్డి సాంబశివ డిమాండ్ చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించి, కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం మంగపేట మండల కేంద్రంలోని తెలంగాణ సెంటర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న బి.రెడ్డి సాంబశివ మాట్లాడుతూ.. ఓటర్ల జాబితా సవరణ, ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన నిర్ణయాలపై ఎన్నికల కమిషనర్ల మధ్య అభిప్రాయ భేదాలు ఉన్నట్లు వచ్చిన నివేదికలు ఎన్నికల సంఘం నిర్ణయ ప్రక్రియపై అనేక ప్రశ్నలు లేవనెత్తుతున్నాయని అన్నారు. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా సూచనల మేరకు దేశవ్యాప్తంగా 13 కోట్ల ఓట్లను తొలగించేందుకు చర్యలు తీసుకుం టున్నారంటూ ఆరోపించారు. ఓటర్ల పేర్లను చేర్చడం, తొలగించడం వంటి అంశాలు ప్రజల ఓటు హక్కుతోముడిపడి ఉన్నందున ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పాక్షికంగా జరగాలని స్పష్టం చేశారు.ఎస్ఐఆర్ ప్రక్రియ పేరుతో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించి ఉంటే వాటిని వెంటనే పరిశీలించి



పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియను తక్షణమే నిలిపివేసి, దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. ఎన్నికల సంఘం స్వతంత్రత, సమగ్రతపై ప్రజల్లో విశ్వాసం నిలిచేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎన్నికల కమిషనర్ల నియామక ప్రక్రియలో పారదర్శకత ఉండేలా చట్టపరమైన మార్పులు తీసుకురావాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యాన్ని, ఓటు హక్కును పరిరక్షించేందుకు ప్రజల్లో చైతన్యం కల్పిస్తామని, కేంద్ర ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి జాగటి చిన్న, సీనియర్ నాయకులు ఎన్.ఎస్.ప్రసాద్, ముత్యాలు, చిరంజీవి, పూనెం నాగేశ్, కోరం సంతోష్, దేవయ్య, మడకం విజయ్, రవి, మంగయ్య తదితరులు పాల్గొన్నారు.

బాలగోపాల్ సంస్మరణ సభను

విజయవంతం చేయండి

మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు డాక్టర్ తిరుపతయ్య..



జమ్మికుంట,(సింగిడి): మానవ హ క్కుల వేదిక, దళిత, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం హుజూరాబాద్‌లో నిర్వహించనున్న హక్కుల నేత బాలగోపాల్ 17వ సంస్మరణ సభను విజయవంతం చేయాలని మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు డాక్టర్ ఎస్ తిరుపతయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు పలు ప్రజా సంఘాల నాయకులు సంయుక్త పత్రిక ప్రకటన విడుదల చేశారు. హుజూరాబాద్‌లోని వివేక్ వెంకటస్వామి ఫంక్షన్ హాల్ (హుజూరాబాద్ క్లబ్)లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ సభ జరగనుంది. ఛత్తీస్‌గఢ్ హైకోర్టు న్యాయవాది, సామాజిక, మానవ హక్కుల కార్యకర్త బేలా భాటియా ముఖ్య వక్తగా హాజరుకానున్నారు. 'నేటి సందర్భంలో బాలగోపాల్ హక్కుల దృక్పథం' అనే అంశంపై మానవ హక్కుల వేదిక, దళిత, ప్రజా సంఘాల నాయకులు తమ సందేశాలను అందించనున్నారు.

ప్రజాస్వామిక విలువలు, మానవ హక్కుల పరిరక్షణ కోసం కృషి చేసే వారందరూ ఈ సంస్మరణ సభకు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు డాక్టర్ ఎస్. తిరుపతయ్య, సీనియర్ జర్నలిస్ట్ ఆవునూరి సమ్మయ్య, న్యాయవాది, టీజేఎస్ రాష్ట్ర నాయకులు ముక్కెర రాజు, భారత్ బచావో నాయకులు భీమోజు సదానందం, పొడిశెట్టి వెంకట్రాజం, రచయిత ఇమ్మడి సంపత్ కుమార్, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కాయిత రాములు, డీటీఎఫ్ నాయకులు పి. ఈశ్వర్ రెడ్డి, వేల్పుల రత్నం, తెలంగాణ హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు గుంటి సామ్రాజ్యం, ద్రావిడ సాహిత్య సాంస్కృతిక కళామండలి అధ్యక్షుడు రామంచ భరత్, తెలంగాణ సాంస్కృతిక సమాఖ్య నాయకుడు బాబ్జీ, ఆర్టీసీ నాయకులు శివదయాల్ సింగ్, మార్త రవీందర్, వేల్పుల ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

అంగరంగ వైభవంగా బతుకమ్మ వేడుకలు

పెద్ద ఎత్తున పాల్గొన్న మహిళలు..

పూల పండుగతో సందడిగా మారిన వార్డు



హుస్నాబాద్,(సింగిడి): హుస్నాబాద్ పట్టణంలోని 16వ వార్డులో ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలను అంగ రంగ వైభవంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని వార్డు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని సంబరాలు జరుపుకున్నారు. వివిధ రకాల రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మ చుట్టూ చేరి ఆటపాటలతో సందడి చేశారు. తెలంగాణ జానపద గీతాలు ఆలపిస్తూ, బతుకమ్మ పాటలకు అనుగుణంగా కోలాటాలు, నృత్యాలతో వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. మహిళల కేరింతలు, బతుకమ్మ పాటలతో వార్డు పండుగ శోభను సంతరించుకుంది. వార్డు కౌన్సిలర్ వైద్యం కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో మున్సిపల్ చైర్మన్ దండి లక్ష్మి, వైస్ చైర్మన్ చిత్తారి పద్మ, మాజీ వైస్ చైర్మన్ ఐలేని అనితారెడ్డితో పాటు వార్డు మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో బతుకమ్మ పండుగ ఎంతో ప్రాధాన్యత కలిగి ఉందని, మహిళలందరూ ఐకమత్యంతో పండుగను జరుపుకోవడం ఆనందంగా ఉందని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు.

ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు

తీరొక్క పూలతో బతుకమ్మల అలంకరణ..

పాటలతో హోరెత్తిన గ్రామాలు



కాటారం, (సింగిడి): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకల్లో భాగంగా కాటారం మండలంలో ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలను శనివారం మహిళలు, యువతులు ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి, సంప్రదాయబద్ధంగా పూజలు చేశారు. అనంతరం పలు కాలనీలో బతుకమ్మల చుట్టూ చేరి ఆటపాటలతో సందడి చేశారు. బతుకమ్మ పాటలు, కోలాటాలతో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. తెలంగాణ ఆడపడుచుల ఐక్యతకు, ప్రకృతి ప్రేమకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.



పేద కుటుంబానికి

శ్రీ లక్ష్మి నరసింహ దత్త సేన సేవా ట్రస్ట్ చేయూత

దశదిన కర్మల నిర్వహణకు 50 కిలోల బియ్యం అందజేత

ములుగు ప్రతినిధి,(సింగిడి): మానవతా దృక్పథంతో ఆపదలో ఉన్నపేద కుటుంబాలకు అండగా నిలుస్తూ శ్రీ లక్ష్మి నరసింహ దత్త సేన సేవాట్రస్ట్ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా మంగపేట మండలంతిమ్మంపేట గ్రామానికి చెందిన తోటమల్ల నర్సింహారావు (45) ఇటీవలఅనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుటుంబం నిరుపేద కుటుంబం కావడంతో, విషయంతెలుసుకున్న ట్రస్ట్ చైర్మన్ ఈశ్వర్ చందు సభ్యుల ద్వారా బాధితకుటుంబానికి సహాయం అందించారు. ఆదివారం నిర్వహించనున్న దశదిన కర్మల కోసం50 కిలోల బియ్యాన్ని కుటుంబ సభ్యులకు అందజేసి తమ మానవత్వాన్నిచాటుకున్నారు. ఈ కార్యక్రమంలో జయరాజు, బోడ ప్రవీణ్, ఏసు రత్నం, అంజిబాబు,బాబురావు, అబ్రహం, శ్రీనివాస్‌తో పాటు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

singidinews@gmail.com



గ్యాంగ్‌స్టర్ మోడ్

యాక్టివేటెడ్!

ఇటీవలే 'ది ప్యారడైజ్' సినిమాతో ప్రేక్షకుల్ని పలకరించారు కథానాయకుడు నాని. అందులో ఆయన రెండు జడలతో ఊర మాస్ లుక్‌లో అందర్నీ అలరించిన సంగతి తెలిసిందే. అయితే ఇప్పుడాయన 'బ్లడీ రోమియో' కోసం పూర్తిగా స్టైలిష్ లుక్‌లోకి మారిపోయారు. 'ఓజీ' విజయం తర్వాత సుజీత్ దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. వెంకట్ బోయనపల్లి నిర్మిస్తున్నారు. ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనుల్లో ఉన్న ఈ సినిమా వచ్చే వారం నుంచి చిత్రీకరణ ప్రారంభించుకోనున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే తాజాగా నానిపై ఫొటో షూట్‌ని పూర్తి చేశారు. దీనికి సంబంధించి ఓ ప్రత్యేక వీడియోను నెట్టింట పంచుకున్నారు.

"గ్యాంగ్‌స్టర్ మోడ్ యాక్టివేటెడ్.. ఇంక రచ్చ రచ్చే" అంటూ దానికి ఓ ఆసక్తికర వ్యాఖ్యని జోడించారు. ఈ వీడియోలో నాని లుక్.. తన హెయిర్ స్టైల్ చూస్తుంటే మునుపెన్నడూ చూడని ఓ సరికొత్త స్టైలిష్ అవతారంలో సుజీత్ తనని చూపించనున్నట్లు అర్థమవుతోంది. ఇదొక వినూత్నమైన గ్యాంగ్‌స్టర్ యాక్షన్ డ్రామాగా ముస్తాబు కానుంది. నాని ఇందులో చెఫ్‌గా.. గ్యాంగ్‌స్టర్‌గా రెండు కోణాల్లో సాగే పాత్రలో అలరించనున్నారు. ఈ సినిమా సింహభాగం చిత్రీకరణ విదేశాల్లో జరగనుంది. ఇందులో ప్రీతి ముకుందన్ కథానాయికగా కనిపించనున్నట్లు ప్రచారం జరుగుతోంది



సినిమా సింగిడి
Cinma Singidi

సోమవారం
12-10-2026



Shruti Haasan

హలో... ఇది ఆరంభమే

సంగీత్, మమితా బైజు

భాషతో సంబంధం లేకుండా విభిన్నమైన కథలతో ప్రేక్షకుల్ని అలరిస్తుంటారు అందాల తార మమితా బైజు. ఇటీవలే 'విశ్వనాథ్ అండ్ సన్స్', 'బెత్లెహోమ్ కుటుంబ యూనిట్' లాంటి చిత్రాలతో బాక్సాఫీసు వద్ద మంచి విజయాన్ని అందుకున్నారు. ప్రస్తుతం వరుస సినిమాలతో మంచి జోరుమీదున్న ఈ భామ 'హలో డియర్'లో నటిస్తున్న సంగతి తెలిసిందే. మమిత, సంగీత్ ప్రతాప్ ప్రధాన పాత్రల్లో రూపొందుతున్న చిత్రమిది. ఈ సినిమా జనవరి 29న థియేటర్లలోకి రాబోతుందని అధికారికంగా ప్రకటిస్తూ... సామాజిక మాధ్యమాల వేదికగా ఒక కొత్త పోస్టర్‌ను పంచుకున్నారు మమిత.

ఈ నేపథ్యంలో "హలో' అనేది కేవలం ఆరంభం మాత్రమే. ఆ తర్వాత జరిగే ప్రతిదానిలోనే అసలైన మ్యాజిక్ ఉంది" అనే క్యాప్షన్‌ను జోడించారు. డినోయ్ పాలోస్ దర్శకత్వంలో ఆషిక్ ఉస్మాన్ నిర్మిస్తున్నారు. ఈ పోస్టర్‌లో మమితా, సంగీత్ సరదాగా నవ్వుతూ కబుర్లు చెప్పుకుంటూ నడుస్తూ కనిపించిన తీరు సినీప్రియుల్ని ఆకట్టుకుంది. అనుకోకుండా వచ్చిన ఒక ఫోన్ కాల్ తర్వాత.. ఓ జంట గందరగోళ సంఘటనల్లో చిక్కుకోవడమే ఈ చిత్ర కథాంశమని సినీవర్గాలు తెలిపాయి. ప్రస్తుతం మమిత 'ఇరందు వానమ్'లో నటిస్తున్నారు.

ప్రేక్షకులు ట్రోల్ చేసేలోపే..

మనల్ని మనం జడ్జ్ చేసుకోవాలి: కిరణ్ అబ్బవరం

: భిన్నమైన కథలతో టాలీవుడ్‌లో తనదైన ముద్ర వేస్తున్నారు నటుడు కిరణ్ అబ్బవరం ప్రస్తుతం ఆయన వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. వినోదాత్మక చిత్రాలు, యాక్షన్ ఫాంటసీ, హారర్ థ్రిల్లర్లతో పాటు తొలిసారి ఓటీటీలోకి కూడా అడుగుపెడుతున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన కెరీర్, రాబోయే ప్రాజెక్టుల విశేషాలను కిరణ్ పంచుకున్నారు.

"ఐదేళ్ల క్రితం 'ఎస్ఆర్ కళ్యాణమండపం' చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే, సంభాషణలు రాశా. ఆ సినిమా నా కెరీర్‌ను మలుపు తిప్పింది. ఆ తర్వాత నటనలో బిజీ అయిపోవడంతో రాయడానికి సమయం దొరకలేదు. ఇప్పుడు 'రియాలిటీ' (=ముశ్రీఖ్ఐ) కోసం నటనతో పాటు దర్శకత్వం, రచన బాధ్యతలను తీసుకున్నా. సమాజంలో నేటి మధ్యతరగతి యువత ఎదుర్కొంటున్న పెళ్లి ఒత్తిళ్ల నేపథ్యంతో ఈ కథ సాగుతుంది. బడ్జెట్‌లోనే పెళ్లి చేసుకోవాలనుకునే ఓ కుర్రాడి జీవితంలో ఎలాంటి పరిస్థితులు ఎదురయ్యాయన్నది వినోదాత్మకంగా చూపించనున్నాం. ప్రేక్షకులు ఎప్పుడూ ఆహ్లాదకరమైన ప్రేమకథలను కోరుకుంటారు. కమర్షియల్ హంగులతో సంబంధం లేకుండా మనసుకు హత్తుకునే కథలకే ఓటేస్తారు. 2023లో వచ్చిన నా 'మీటర్' చిత్రాన్ని ప్రేక్షకులు తిరస్కరించారు. ఎంత రొటీన్ జానర్ అయినా సరే.. కొత్తదనం లేకపోతే జనం చూడరని ఆ సినిమా నాకు నేర్పింది. సినిమా విడుదలయ్యే ముందే మన కథలోని లోపాలు మనకు తెలిసిపోతాయి. ప్రేక్షకులు ట్రోల్ చేసేలోపే.. మనల్ని మనం జడ్జ్ చేసుకోవాలి" అని ఆయన తెలిపారు.



లోతైన భావోద్వేగాలు పండాయంటే కారణం మా జోడీయే

తన రాబోయే చిత్రాల గురించి మాట్లాడుతూ.. "'కాంతార: చాప్టర్-1'కి పనిచేసిన శ్రీకాంత్ పుప్పాల దర్శకత్వంలో 'ఇంద్రపుత్ర' చేస్తున్నా. ఇది పీరియాడిక్ సినిమా కాదు.. నేటి తరం కథ. తొలి 15-20 నిమిషాలు మాత్రమే మైథాలజీ అంశాలు ఉంటాయి. కత్తులు తిప్పుతూ భారీ కాస్ట్యూమ్స్‌తో కనిపించను. అలాగే, నేను నిర్మాతగా వ్యవహరిస్తున్న హారర్ థ్రిల్లర్ 'హతః' తప్పకుండా ఆకట్టుకుంటుంది. కథలోకి వెళ్లడానికి 10-15 నిమిషాలు పట్టినా.. ఆ తర్వాత ప్రేక్షకులను సీటు అంచున కూర్చోబెడుతుంది" అని కిరణ్ పేర్కొన్నారు.

'డియర్ కామ్రేడ్' దర్శకుడు భరత్ కమ్మతో కలిసి 'గువ్వల చెరువు ఘాట్' అనే సిరీస్ ద్వారా తాను డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లోకి అడుగుపెడుతున్నట్లు ఆయన వెల్లడించారు. "సినిమాలతో బిజీగా ఉండటం వల్ల ఓటీటీపై ముందు ఆలోచన లేదు. కానీ భరత్ కమ్మ కథ వినగానే ఆశ్చర్యపోయా. 1980ల నాటి రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో 8 ఎపిసోడ్‌లుగా ఈ సిరీస్ రూపొందుతోంది. ఇందులో నేను జర్నలిస్ట్ పాత్రలో కనిపించనున్నాను" అని కిరణ్ అబ్బవరం వివరించారు.

ఇక, కిరణ్ స్వీయ దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'రియాలిటీ' (=ముశ్రీఖ్ఐ). ఇటీవల ఈ సినిమా టైటిల్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఇందులో మధ్యతరగతి వ్యక్తిగా కిరణ్ కనిపించారు. డిసెంబర్ 25న ఈ చిత్రం విడుదల కానుంది.

వేట్టువం'లో శ్రుతి?

"హల్లల్లల్లో.. హల్లో.." అంటూ ఇటీవలే 'పెద్ది' సినిమాలో రామ్‌చరణ్‌తో కలిసి స్టెప్పులేసి కుర్రకారుని ఉర్రూతలూగించారు నాయిక శ్రుతిహాసన్. పాత్రల ఎంపికలో ఆచితూచి అడుగులేస్తున్న ఈ తార.. ప్రస్తుతం ప్రత్యేక పాటలు, భిన్నమైన కథలతో సినీప్రియుల్ని అలరించే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పుడీ నేపథ్యంలోనే ఆమె మరో కొత్త పాత్ర కోసం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. దర్శకుడు పా.రంజిత్ 'వేట్టువం' అనే చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు ఈ మధ్యే ప్రకటించిన సంగతి తెలిసిందే. సైన్స్ ఫిక్షన్ యాక్షన్ డ్రామాగా తీర్చిదిద్దుతున్న ఈ సినిమాలో తమిళ హీరో ఆర్య, శోభితా ధూళిపాళ్ల ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఇందులో అతిథి పాత్రలో తళుక్కున మెరువనున్నారట శ్రుతిహాసన్. ప్రస్తుతం ఆమె పాత్రకు సంబంధించిన చిత్రీకరణ జరుగుతోందని, త్వరలోనే ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించే అవకాశాలున్నాయని తమిళ వర్గాల్లో చర్చలు జరుగుతున్నాయి.

Printed and Published by Mohan Pusala on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Pusala mohan, PRGI.REGN.NO. TGTEL/26/A4370. Cell 91 89199 18737